VASAVI SAROVAR
KUKATPALLY - HITEC CITY
TS RERA NO. P02200006766

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 40 | విజయవాడ, శనివారం 9 సెప్టెంబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Saturday 9 September 2023 | Rs

VASAVI SAROVAR
KUKATPALLY - HITEC CITY
TS RERA NO. P02200006766

కొత్త రిజిస్ట్రేషన్ విధానం చట్ట వ్యతిరేకం

- హైకోర్టులో పిల్

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్ర ప్రభుత్వ నూతన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానాన్ని (కార్డ్ ప్రైమ్ 2.0) రద్దు చేయాలంటూ హైకోర్టులో పిల్ దాఖలైంది. కొత్త రిజిస్ట్రేషన్ విధానం చట్ట వ్యతిరేకమని ప్రకటించాలని కోరుతూ కృష్ణా జిల్లా కంకిపాడుకు చెందిన కొత్తపల్లి సీతారామ ప్రసాద్ దాఖలు చేసిన పిల్‌లో ప్రతివాదులుగా రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖల ముఖ్య కార్యదర్శులు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ జాయింట్ సెక్రటరీ, స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ కమిషనర్, ఇతరులను చేర్చారు. కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేయాలన్నారు. ఆస్తుల క్రయవిక్రయాలకు పాల్పడే వారిరువురూ రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు భౌతికంగా రావాలన్న నిబంధన ఇప్పటి వరకు ఉందని, కొత్త విధానంలో ఆస్తుల రిజిస్ట్రేషన్ మొత్తం సాఫ్ట్‌వేర్ ద్వారానే జరుగుతుందన్నారు. దీనివల్ల చదువుకోని వారికి అనేక సమస్యలు వస్తాయన్నారు.

హైకోర్టు నిరాకరణ

వక్ఫ్‌బోర్డులో ముత్తవల్లీ కోటా సభ్యుడి ఎన్నిక ప్రక్రియలో జోక్యం చేసుకునేందుకు హైకోర్టు నిరాకరించింది. ఎన్నికల ఫలితాలు మాత్రం తామిచ్చే తుది ఉత్తర్వులకు లోబడి ఉండాలని జస్టిస్ బి కృష్ణమోహన్ శుక్రవారం మధ్యంతర ఆదేశాలిచ్చారు. ముత్తవల్లీ కోటా నుంచి వక్ఫ్‌బోర్డుకు సభ్యుడి ఎన్నికలు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతాయి. ఓటర్ల లిస్ట్ రూల్స్ ప్రకారం ఓటర్ల జాబితాను పత్రికల్లో ప్రకటించాలని, ఆ విధంగా చేయలేదు కాబట్టి ఎన్నికను నిలిపివేయాలని కోరుతూ మూడు రిట్లు దాఖలయ్యాయి. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా చర్యలు లేనందున ఎన్నికలపై స్టే ఇవ్వాలని పిటిషనర్లు వాదించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం తర్వాత కేసులు చెల్లవని, ఎన్నికల ఫలితాలపై అభ్యంతరం ఉంటే వక్ఫ్ ట్రిబ్యునల్‌లో సవాల్ చేసుకోవాలని ప్రభుత్వం వాదించింది.

విదేశాలకు శ్రీనివాసరావు, మనోజ్ వాసుదేవ్ !

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చంద్రబాబు నాయుడుకు ఐటి నోటీసులు ఇచ్చిన అంశంలో కీలక వ్యక్తులైన పెండ్యాల శ్రీనివాసరావు, మనోజ్ వాసుదేవ్ విదేశాలకు వెళ్లారు. చంద్రబాబుకు అందిన ఐటి నోటీసులపై ఒకవైపు చర్చ జరుగుతుంటే వారిరువురూ విచారణకు అందుబాటులో లేకుండా విదేశాలకు వెళ్లడం చర్చనీయాంశమైంది. ఈ నెల 5న షాపూర్జి పల్లోంజి సంస్థ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ దుబాయ్‌కు వెళ్లినట్లు తెలిసింది. చంద్రబాబు పిఎ పెండ్యాల శ్రీనివాసరావు ఈ నెల 6న అమెరికాకు వెళ్లారు. షెల్ కంపెనీల సృష్టికర్త యోగేష్ గుప్తా మాత్రం ఐటి విచారణకు అందుబాటులో వున్నట్లు తెలిసింది.

విద్యుత్ రంగాన్ని ధ్వంసం చేశారు : టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ రంగాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వంసం చేశారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి కిమిడి కళావెంకట్రావు విమర్శించారు. నాలుగేళ్లలో ఎనిమిది సార్లు కరెంటు ఛార్జీలు పెంచేశారని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కరెంటు లేక ఆస్పత్రుల్లో సెల్‌ఫోన్లు, టార్చ్‌లైట్ వెలుతురులో ఆపరేషన్లు చేయాల్సిన దుస్థితి రావడం పాలనా వైఫల్యం అని విమర్శించారు.

అనాలోచిత విధానం జిరాక్స్ రిజిస్ట్రేషన్ : నసీర్ అహ్మద్

వైసిపి ప్రభుత్వం అనాలోచిత విధానాల్లో భాగమే జెరాక్స్ రిజిస్ట్రేషన్ విధానమని టిడిపి అధికార ప్రతినిధి మహ్మద్ నసీర్ అహ్మద్ విమర్శించారు. 24 ఏళ్ల నుంచి సమర్థవంతంగా పనిచేస్తున్న నేషనల్ ఇన్‌ఫర్‌మేటిక్ సెంటర్ రిజిస్ట్రేషన్ సంస్థను పక్కనపెట్టి ఎపి ప్రభుత్వం క్రిటికల్ రివర్ ఇన్‌ఫర్‌మేషన్ అనే ప్రైవేటు సంస్థకు రిజిస్ట్రేషన్ల తంతును అప్పగించడం పలు అనుమానాలకు తావిస్తోందని అన్నారు. అనుభవం లేని ప్రైవేటు సంస్థకు అప్పగిస్తే రికవరీ యాక్ట్ కింద ఆ సంస్థ డేటా రికవరీ చేసే అవకాశం ఉందా? అని ప్రశ్నించారు. కమీషన్ల కోసమే సిఎం జగన్ జెరాక్స్ విధానం తీసుకొచ్చారని ఆరోపించారు.

'స్కిల్ యూనివర్స్' పేరుతో డ్యాష్‌బోర్డు : మంత్రి బుగ్గన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'స్కిల్ యూనివర్స్' పేరుతో డ్యాష్‌బోర్డు ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి, శిక్షణశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వెల్లడించారు. ట్రైనింగ్, ప్లేస్‌మెంట్లకు సంబంధించిన సమగ్ర సమాచారం యువతకు ఎప్పటికప్పుడు తెలిసేలా ఈ బోర్డును తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్‌పై విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఎపిఎస్ఎస్‌డిసి ఆధ్వర్యంలో తీర్చిదిద్దుతోన్న ఈ బోర్డును త్వరలోనే ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. ఎపిఎస్ఎస్‌డిసి, సిడ్యాప్, న్యాక్ సంయుక్త శిక్షణ వివరాలు పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేలా కసరత్తు చేస్తున్నామని తెలిపారు. యువత నమోదు చేసిన వ్యక్తిగత వివరాలతో కరిక్యులమ్ తయారయ్యే అత్యాధునిక వెసులుబాటు కలిసున్నట్లు డ్యాష్‌బోర్డు సౌకర్యాల గురించి నైపుణ్యాభివృద్ధి, శిక్షణశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ విపులంగా వివరించారు. ఎవరైనా సులభంగా లాగిన్ అయ్యే విధంగా తీర్చిదిద్దుతామని ఎపిఎస్ఎస్‌డిసి ఎండి వినోద్‌కుమార్ తెలిపారు. సాంకేతిక, నైపుణ్య విద్య నేర్చుకునే యువతీయువకులకు అధ్యాపకుల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి అన్నారు. ల్యాబ్ టెక్నీషియన్లు, టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగాలను కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికలో భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కళాశాలలు, హాస్టళ్లలో నియామకాల వివరాలను సాంకేతిక విద్య కమిషనర్ నాగరాణి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్, డిప్యూటీ ట్రైనింగ్ ఆఫీసర్ నియామకానికి చొరవ చూపాలని సాంకేతిక ఉపాధి, శిక్షణశాఖ డైరెక్టర్ నవ్య కోరగా, మంత్రి సమగ్రమైన జాబితా సిద్ధం చేయాలని చెప్పారు.

రహదారి పక్కన పారబోసిన టమాటాలను తింటున్న పశువులు

ధరలేక.. పశువులకు మేత

- రహదారి పక్కన పారబోసిన టమాటాలు

ప్రజాశక్తి-వేటపాలెం (బాపట్ల జిల్లా)

మొన్నటి వరకూ కిలో రూ.220 పలికిన టమాటా ధర..నేడు ధర లేక రోడ్డు పాలవుతోంది. బాపట్ల జిల్లా వేటపాలెం మండలం పరిధిలోని పందిళ్ళపల్లి 216 జాతీయ రహదారి వెంట గుర్తు తెలియని రైతులు టమాటాను పారబోశారు. అటుగా వెళ్తున్న కొందరు వాటిని చూసి మంచివాటిని ఏరుకుని ఇళ్లకు తీసుకెళ్లారు. మిగిలిపోయిన వాటిని పశువులు తిన్నాయి. కర్నూలు జిల్లా పత్తికొండలో కిలో రూ.2.50, అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కిలో రూ.9.80 పలుకుతుండడంతో గిట్టుబాటు లభించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎంఎస్ఎంఇ ప్రోత్సాహానికి కృషి

- సిఎస్ జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎంఎస్ఎంఇల ప్రోత్సాహానికి ప్రత్యేక కృషి చేస్తున్నామని, ముందుకు వచ్చేవారికి తగిన ప్రోత్సాహం అందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ఎంఎస్ఎంఇలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కువ మందికి ఉపాధి కల్పించే దిశగా యూనిట్లు ఏర్పాటు చేయాలని పరిశ్రమల అధికారులను ఆదేశించారు. కొప్పర్తి, గుంటూరులో ఏర్పాటవుతున్న ఎంఎస్ఎంఇ టెక్నాలజీ కేంద్రాల ప్రగతిని సిఎస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వైఎస్ఆర్ ఎపి వన్ ప్లాట్‌ఫాం, ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తీసుకున్న చర్యలను, కామన్ ఫెసిలిటీ కేంద్రాలపైనా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఎంఎస్ఎంఇ రంగంలో చేపట్టిన పలు అంశాలను వివరించారు. చేనేత జౌళిశాఖ ముఖ్యకార్యదర్శి సునీత, ఎంఎస్ఎంఇ సిఇఒ ప్రవీణ్‌కుమార్, జెడి రామలింగేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

పిఎంవికె రెండున్నర లక్షల మందిని రిజిస్టర్ చేయాలి

చేతి వృత్తిదారులను ఆర్థికంగా ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నెల 17 నుంచి ప్రారంభించనున్న ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంలో రాష్ట్రంలో మొదటి ఏడాదిగా రెండున్నర లక్షల మందిని రిజిస్టర్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సిఎస్ ఆదేశించారు. చేతి పనిముట్లతో సంప్రదాయ పద్ధతిలో చేతి వృత్తి చేసుకునే వారిని ఆదుకునేందుకు నూరుశాతం నిధులు సమకూర్చనుందని, రాష్ట్రం నుండి వీలైనంత మంది లబ్ధిదారులకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులకు రూ.లక్ష రుణం ఇస్తారని, తీర్చిన తరువాత రూ.రెండు లక్షలు ఇస్తారని మొత్తం ఐదుశాతం వడ్డీతో హామీలేని రుణం ఇస్తారని పేర్కొన్నారు.

మెరుగైన లిక్కర్ పాలసీ తెస్తాం : లోకేష్

ప్రజాశక్తి - భీమవరం/రాజోలు

ప్రస్తుతమున్న మద్యం పాలసీని రద్దు చేసి మెరుగైన పాలసీ తీసుకొస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తెలిపారు. గతంలో టిడిపి ప్రభుత్వం అమలు చేసిన అనేక బిసి సంక్షేమ పథకాలను వైసిపి ప్రభుత్వం రద్దు చేయడమే కాకుండా 26 వేల మందిపై అక్రమ కేసులు బనాయించిందని తెలిపారు. యువగళం పాదయాత్ర శుక్రవారం 208వ రోజు పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలో సాగింది. కలగంపూడిలో శెట్టిబలిజ ప్రతినిధులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. తాము అధికారంలోకి రాగానే గతంలో అమలు చేసిన పథకాలన్నీ పునరుద్ధరిస్తామని, కుల వృత్తులను ప్రోత్సహిస్తామని తెలిపారు. ఉపాధి హామీ కోసం తాడిచెట్ల పెంపకానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం ఇస్తున్న కుల ధ్రువీకరణ పత్రాలు ఆరు నెలలే చెల్లుబాటులో ఉంటున్నాయని, టిడిపి అధికారం చేపట్టాక శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాన్ని అందించే ఏర్పాటు చేస్తామన్నారు. పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని అన్నారు.

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న నేతలు

శాసనమండలి మాజీ వైస్ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ టిడిపి అంటే బిసి.. బిసి అంటే టిడిపి అని అన్నారు. 208వ రోజు పాదయాత్ర కలగంపూడి నుంచి ప్రారంభమై చించినాడ మీదుగా వశిష్ట గోదావరి వంతెనపైకి చేరింది. శుక్రవారం రాత్రి అంబేద్కర్ కోనసీమ జిల్లాలోకి ప్రవేశించింది. రాజోలు నియోజకవర్గంలోని మలికిపురం మండలం దిండి వద్ద టిడిపి నాయకులు భారీ కొబ్బరి కాయల దండతో స్వాగతం పలికారు.

మాజీ మంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, గొల్లపల్లి సూర్యారావు, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ల వెంకట రమణ పాల్గొన్నారు. పాదయాత్ర దిండి నుండి శివకోటి, రాజోలు, సోంపల్లి మీదుగా పొదలాడకు చేరింది.

పులివెందులలో టిడిపి కార్యకర్త హత్య

- వేటకొడవళ్లతో దాడి

ప్రజాశక్తి- లింగాల (వైఎస్ఆర్‌జిల్లా), అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గం పులివెందుల పరిధిలోని లింగాల మండలం అంబకపల్లిలో టిడిపి కార్యకర్త చింతకాయల నాగరాజు (37) శుక్రవారం దారుణ హత్యకు గురయ్యాడు. వేటకొడవళ్లతో దాడి చేసి అతి కిరాతకంగా చంపేశారు. ఎస్ఐ రవికుమార్ కథనం మేరకు...అంబకపల్లికి చెందిన చింతకాయ మంద నాగరాజు అనే వ్యక్తి తన పొలంలో పనులు చేసుకుంటుండగా తొమ్మిది మంది గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి వేటకొడవళ్లతో అతి కిరాతకంగా నరికేశారు. తలపై దాదాపు తొమ్మిది చోట్ల నరకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల ఏరియా ఆస్పత్రికి తరలించారు. నాగరాజు తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ హత్య రాజకీయంగా జరిగిందా? లేదా వ్యక్తిగత కక్షతో జరిగిందా? అనే అంశంపై విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు. ఎలాంటి ఘర్షణ చోటు చేసుకోకుండా గ్రామంలో పికెట్ ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇది రాజకీయ హత్యే : మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవి

నాగరాజుది ముమ్మాటికి రాజకీయ హత్య అని పులివెందుల టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవి అన్నారు.

నాగరాజు (ఫైల్)

శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు పులి వెందుల నుంచి అంబకపల్లి గ్రామం మీదుగా వెళతుండగా నాగరాజు, మరికొందరు ఆయనకు స్వాగతం పలుకుతూ టపాసులు పేల్చారు. అప్పటి నుంచి గ్రామంలోని వైసిపి నాయకులు నాగరాజు మీద దాడి చేయడానికి అవకాశం కోసం ఎదురుచూస్తున్నారని, పొలం వద్ద ఒక్కడే ఉండడంతో హతమార్చారని అన్నారు. కడప ఎంపి అవినాష్‌రెడ్డి పిఎ రాఘవరెడ్డి, కృష్ణ, పాటి గంగిరెడ్డి, బాబురెడ్డి అండదండలతోనే ఈ హత్య జరిగిందని ఆరోపించారు.

పార్టీ మారకపోతే హత్య చేస్తారా? : చంద్రబాబు

నాగరాజు కుటుంబ సభ్యులతో చంద్రబాబునాయుడు ఫోన్‌లో మాట్లాడారు. పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ధైర్యంగా ఉండాలని, తాము అండగా ఉంటామని భరోసానిచ్చారు. పార్టీ మారలేదని హత్య చేశారని, ఈ హత్యను ఖండిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. వైసిపి పాలనలో హత్యా రాజకీయాలకు రాష్ట్రం కేరాఫ్ అడ్రస్‌గా మారిందని విమర్శించారు. హంతకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అప్రూవర్‌గా మారిన 'మాగుంట'?

(మొదటి పేజీ తరువాయి)

బెయిల్ వచ్చింది. ఆయన కూడా ఈ కేసులో ఇడికి అనుకూలంగా మారినట్లు చర్చ సాగుతున్న తరుణంలో మాగుంట అప్రూవర్‌గా మారిన వ్యవహారం ఇప్పుడు రాజకీయవర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. సౌత్ గ్రూపు నుంచి రూ.వంద కోట్ల ముడుపులు అందాయనే అంశంపై ఇడి ఈ కేసును చేపట్టింది. ఇందులో సుమారు 20 మందికిపైగా ఇప్పటికే విచారించింది. ఇందులో తెలంగాణా సిఎం కెసిఆర్ కుమార్తె కవిత కూడా ఉన్నారు. ఇటీవల మాగుంటకు నోటీసులు ఇచ్చారు. అప్పటికే ఆయన కుమారుడు ఈ కేసులో అరెస్టయ్యారు. చాలా కాలం బెయిల్ రాలేదు. రాఘవరెడ్డిని అప్రూవర్‌గా మారాలని ఒత్తిళ్ల పెరిగాయనే చర్చ వచ్చింది. ఇటీవల ఆయనకు బెయిల్ రాగా జిల్లాకు వచ్చారు. ఈ కేసు నుంచి మాగుంట కూడా బయటపడాల్సిన పరిస్థితి నేపథ్యంలో ఆయన కూడా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. రాజకీయంగానూ ఈ కేసుపై చర్చ సాగుతోంది. కేంద్రం వ్యూహాత్మకంగానే ఈ కేసులో పలువురిని ఇరికించినట్లు మొదట నుంచీ ప్రచారం సాగుతోంది. ఢిల్లీ ప్రభుత్వంలోని పెద్దలను ఇరికించేందుకేననే ప్రచారం బాహాటంగానే సాగుతోంది. ఏదేమైనా మాగుంట అప్రూవర్‌గా మారారనే వ్యవహారం రాష్ట్రంలో రాజకీయవర్గాల్లో ఉత్కంఠ చర్చకు దారితీసింది.

'ఉక్కు' ఊపిరి తీసే కొత్త కుట్ర!

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుని వివిధ పద్ధతుల్లో వీటన్నిటినీ సరిచేసేందుకు స్టీల్‌ప్లాంట్ సిద్ధమైంది. తొమ్మిది నెలల క్రితమే పైనతెలిపిన రూ.80 కోట్లను రెండు దఫాలుగా ప్లాంట్ చెల్లించింది. మిగిలిన రూ.300 కోట్లను బ్యాంకు ద్వారా తీసుకొచ్చి ఎయిర్ లిక్విడ్ కంపెనీకి స్టీల్‌ప్లాంట్ ఇచ్చేస్తే యుటిలిటీస్ డిపార్టుమెంట్‌గా పిలవబడేటువంటి నెంబరు 2 డిపార్టుమెంట్ అంతా స్టీల్‌ప్లాంట్ పరమవుతుంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పెద్దలు దీన్ని మీరు నడపలేరని, వేరే వాళ్లకి ఇచ్చేసి అక్కడ నుంచి ఆక్సిజన్ తీసుకోవాలని మెలిక పెట్టారు. దీంతో, ప్లాంట్ ఉన్నతాధికారులు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

కేంద్రం కుట్రలను తిప్పికొడతాం

భారీ ప్రయివేట్ కంపెనీలు ప్లాంట్‌లో తిష్టవేసేలా ఢిల్లీ పెద్దలు కుట్రలు చేస్తున్నారు. ఇప్పటికే గంగవరం పోర్టు యాజమాన్యంతో స్టీల్‌ప్లాంట్ పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. రూ.300 కోట్లను తొమ్మిది శాతం వడ్డీకి ప్లాంట్‌కు ఇచ్చేందుకు రెండు బ్యాంకులు ముందుకొచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్రం అడ్డుపుల్ల వేయడం సరికాదు. కేంద్రం కుట్రలు చేసి ప్లాంట్‌ను నడపకుండా ఆటంకాలు కలిగిస్తే సహించేది లేదు.

- జె.అయోధ్యరామ్,
ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో - కన్వీనర్

మోడీని ఓడించి దేశాన్ని కాపాడండి

(మొదటి పేజీ తరువాయి)

ఉదయనిధి వ్యాఖ్యల్లో తప్పేంటి అని డి.రాజా ప్రశ్నించారు.

మీరెటు వైపు ... : నారాయణ

రాష్ట్రంలోని రాజకీయపార్టీలు దేశాన్ని రక్షించే వేదికలో ఉంటారో, భక్షించేవారికి మద్దతిస్తారో తేల్చుకోవాలని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు స్వార్థ ప్రయోజనాల కోసం మోడీ వెంట నడుస్తున్నారని విమర్శించారు. చంద్రబాబును అరెస్టు చేస్తారని సమాచారం వస్తోందని, వాస్తవంగా అరెస్టు చేస్తేనే మంచిదన్నారు. తెలంగాణలో కెసిఆర్, ఆంధ్రప్రదేశ్‌లో జగన్, బిజెపిలను ఓడించాలని పిలుపునిచ్చారు.

శేషాచలం అడవుల్లోకి చిరుతలు ఎందుకు వస్తున్నాయో వాస్తవాలు చెప్పాలన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ తీవ్ర పోరాటాలతో వచ్చిన విశాఖ ఉక్కును రాష్ట్ర ప్రభుత్వం కాపాడాలన్నారు. రాష్ట్రంలో పక్కా పోలీసు రాజ్యం నడుస్తోందన్నారు. బహిరంగసభలో సిపిఐ నాయకులు అక్కినేని వనజ, రావుల వెంకయ్య, ఎం.నాగేశ్వరరావు, సత్యనారాయణమూర్తి, ఓబులేసు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి పాల్గొన్నారు.

ఐదు రోజులు ఓడి లోనే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కొత్త నెల ప్రారంభమైతే చాలు... ఓవర్‌డ్రాఫ్ట్‌కు వెళ్లాల్సిన పరిస్థితి తప్పడం లేదు. గత కొన్ని నెలలుగా ఇదే విధానం కొనసాగుతోంది. తాజాగా సెప్టెంబర్‌లో కూడా ఓవర్‌డ్రాఫ్ట్‌తోనే తొలి వారం రోజుల కార్యక్రమాలు నిర్వహించారు. సెప్టెంబర్ తొలి రోజునే ఓవర్‌డ్రాఫ్ట్‌కు వెళ్లి కొంతమందికి జీతాలు చెల్లించారు. ఇందులో కొంత మొత్తంతో సామాజిక పింఛన్లు కూడా చెల్లించాల్సి వచ్చింది. సెప్టెంబర్ తొలి ఆరు రోజుల్లో ఐదు రోజులపాటు ఓవర్‌డ్రాఫ్ట్‌లోనే ఉండడం గమనార్హం. మూడో తేదీ ఆదివారం తప్ప మిగిలిన రోజుల్లో ఓడీలోనే ఖజానా ఉంది. దీంతో ఈ త్రైమాసికంలో 20 రోజులపాటు ఓవర్‌డ్రాఫ్ట్‌లో ఉన్నట్టయింది.

మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న చంద్రబాబు

రాయలసీమ ద్రోహి జగన్

- కాలువలకు నీళ్లు కూడా ఇవ్వలేని ముఖ్యమంత్రి
- ఎవరికి టికెట్ ఇవ్వాలో కమిటీ నిర్ణయిస్తుంది : చంద్రబాబు

ప్రజాశక్తి-నంద్యాల కలెక్టరేట్ /బనగానపల్లె

రాయలసీమ సస్యశ్యామలం కోసం టిడిపి హయంలో ప్రాజెక్టులు కట్టామని. కనీసం కాలువలకు నీళ్లు ఇవ్వలేని స్థితిలో వైసిపి ప్రభుత్వం ఉందని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విమర్శించారు. జగన్ రాయలసీమ ద్రోహి అని మండిపడ్డారు. అన్ని ప్రభుత్వ శాఖలకు ముఖ్యమంత్రి హాలిడే ప్రకటించారని దుయ్యబట్టారు. 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నంద్యాల జిల్లాల్లో ఆయన పర్యటించారు. తొలుత బనగానపల్లిలో మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నంద్యాలలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ..ఉమ్మడి కర్నూలు జిల్లాకు ఓర్వకల్లు విమానాశ్రయాన్ని నేను తీసుకువస్తే వాటికి రంగులు వేసుకుని శిలఫలకాలపైన స్టిక్కర్లు వేసుకుని ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించారని అన్నారు. పదివేల ఎకరాల్లో మెగా సీడ్ పార్క్, అతి పెద్ద సోలార్ ప్రాజెక్టు తీసుకువచ్చామని తెలిపారు. ఇవి ప్రారంభించి ఉంటే అనేక మందికి ఉపాధి అవకాశాలు లభించేవి అని అన్నారు. నాలుగేళ్లలో ఒక్క పరిశ్రమ కూడా రాలేదని, రాష్ట్రానికి జగన్ చేసేంది ఏమీ లేదని విమర్శించారు. నంద్యాలలో సండే ఎమ్మెల్యే తన అనుచరులకు ఎర్రమట్టి, బియ్యం, అన్ని కట్టబెడుతూ ప్రజాధనాన్ని కొళ్లగొడుతున్నారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం ఉంటే ప్రజల జీవితాలు నాశనం అవుతాయన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎవరికి టికెట్ ఇవ్వాలో కమిటీ నిర్ణయిస్తుందని, నా సీటు కూడా అప్పుడే ప్రకటిస్తారని తెలిపారు. టికెట్ల విషయం కమిటికి వదిలిపెట్టి పార్టీ అభివృద్ధి కోసం అందరూ పని చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. అంతకుముందు మహిళలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో వైసిపి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో మద్యం, గంజాయి వల్ల మహిళలపై దాడులు, అత్యాచారాలు, గృహహింస పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేశామని తెలిపారు. మహిళలను వేధించే వారికి ఈ ప్రభుత్వం ఎంపి, ఎమ్మెల్యే టికెట్లు ఇస్తోందని విమర్శించారు. అరాచక పాలనకు, రాక్షసపాలనకు ప్రజలు చరమగీతం పాడాలని కోరారు. మాజీ మంత్రులు ఫరూఖ్, అఖిలప్రియ, మాజీ ఎమ్మెల్యేలు బిసిజనార్ధన్‌రెడ్డి, భూమా బ్రహ్మానంద రెడ్డి, జయనాగేశ్వరరెడ్డి, ఎవిసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ పులి సంచారం

- ఎద్దును బలిగొన్న వైనం

ప్రజాశక్తి- బాడంగి (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా బాడంగి మండలం రావివలస గ్రామంలో గురువారం రాత్రి కొల్లి ఎరుకునాయుడుకు చెందిన ఎద్దును పులి దాడి చేసి చంపేసింది. కొన్ని నెలల క్రితం ఇదే గ్రామానికి చెందిన రెండు ఆవులను, అల్లుపాల్తేరుకు చెందిన ఒక ఆవును పులి దాడి చంపేసిన విషయం తెలిసిందే. పులి మళ్లీ సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పొలం పనులకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఎప్పుడు ఎటువైపు నుంచి పులి ముప్పు ముంచుకొస్తుందోనని భయపడుతున్నారు. పులి దాడిలో మరణించిన ఎద్దును అటవీ శాఖాధికారి శ్రీనివాసరావు, ఎస్ఐ జయంతి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పలు సూచనలు చేశారు.

పులి దాడిలో మృతి చెందిన ఎద్దును పరిశీలిస్తున్న అటవీ శాఖాధికారులు, పోలీసులు

ఎఆర్ హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

కర్నూలులోని లోకాయుక్త కార్యాలయంలో పనిచేస్తున్న ఎఆర్ హెడ్ కానిస్టేబుల్ శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... 1993 ఎఆర్ కానిస్టేబుల్ బ్యాచ్‌కు చెందిన సత్యనారాయణ కర్నూలులోని వెంకటరమణ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఐదు రోజుల క్రితం సంతోష్‌నగర్‌లోని లోకాయుక్త కార్యాలయంలో విధుల్లో చేరారు. శుక్రవారం ఉదయం విధులకు హాజరైన ఆయన లోకాయుక్త కార్యాలయంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న పబ్లిక్ టాయిలెట్స్‌లోకి వెళ్లి తన గన్‌తో తలపై కాల్చుకున్నారు. భారీ శబ్దం రావడంతో అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది బాత్రూంలోకి వెళ్లి పరిశీలించారు. రక్తపు మడుగులో పడి ఉన్న సత్యనారాయణ గమనించి కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సత్యనారాయణకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆత్మహత్యకు కారణం తెలిసిరాలేదు. నాలుగో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సత్యనారాయణ (ఫైల్)

బిజెపి నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బిజెపి నూతన కార్యవర్గాన్ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి ప్రకటించారు. ఈ మేరకు జాబితాను శుక్రవారం విడుదల చేశారు. 26 మంది పార్టీ జిల్లా అధ్యక్షులతోపాటు మరో 26 మంది జిల్లా ఇన్‌ఛార్జులు, ముగ్గురు రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టులుగా 14 మందిని నియమించారు.

అసమానతలు లేని అభివృద్ధి కోసం నవంబరు 7న భారీ బహిరంగ సభ

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గాలపై కేంద్రీకరించి ప్రజా పునాదిని పెంచుకునే కృషిని ప్రారంభించామని, ఎన్నికల నాటికి నిర్దిష్టంగా నిర్ణయించుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో నెలకొంటున్న కరువు పరిస్థితులతో ప్రజలు అల్లాడుతుంటే వారిని పట్టించుకోకుండా ముఖ్యమంత్రి విదేశీ పర్యటనకు వెళ్లడం ఏమిటని ప్రశ్నించారు. రిజర్వాయర్లలో నీళ్లు లేవని, రాయలసీమలో పంటలు ఎండిపోయాయని, కోస్తా ప్రాంతంలో నీరులేక పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయని తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించాల్సిన జలవనరులశాఖ మంత్రి నీరు ఇవ్వలేమని, ఆరుతడి పంటలు వేసుకోవాలని బాధ్యతారహితంగా ప్రకటనలు చేస్తున్నారన్నారు. ఇంతవరకు ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించలేదని చెప్పారు. పల్నాడు ప్రాంతంలో వరికపూడిశెల పూర్తిచేసి నీటిని అందించే అవకాశం ఉన్నా ఆ పని చేయడం లేదన్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో రైతులకు పూర్తిగా ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని, బ్యాంకు రుణాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. కౌలు రైతులు రాష్ట్రంలో 33 లక్షల మంది ఉంటే లక్ష మందికి రుణాలు ఇచ్చి మొత్తం అందరికీ ఇచ్చామని చెప్పుకోవడం ఏమిటని ప్రశ్నించారు. మిగిలిన 32 లక్షల మంది ఏమైపోవాలని అన్నారు. విద్యుత్, వ్యవసాయ సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రణాళిక ఇంతవరకు రూపొందించలేదని విమర్శించారు.

కార్పొరేట్ల కోసమే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు

కార్పొరేట్ సంస్థల కోసమే ప్రైమ్ పేరుతో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు పెట్టినట్లు ఉందని తెలిపారు. డాక్యుమెంటు ఒరిజినల్స్ ప్రభుత్వం దగ్గరే ఉంటాయని చెబుతున్నారని, యజమానులు ఏమిచేయాలని ప్రశ్నించారు. డిటిపి ఆపరేటర్లకు, డాక్యుమెంటు రైటర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని డిమాండ్ చేశారు. ఒరిజినల్ ధ్రువపత్రాలు ఉంటేనే రైతులు, యజమానులు హక్కుగా భావిస్తారని, అది లేకుండా చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఒకవైపు సామాన్య ప్రజలు రిజిస్ట్రేషన్ కార్యాలయాల ముందు బారులు తీరుతున్నా వారి సమస్య పరిష్కారం కావడం లేదని పేర్కొన్నారు. కార్పొరేట్లు కార్యాలయాల్లో కూర్చుని నేరుగా రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు వీలుగా కొత్త పద్ధతులు తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం తొందరపడుతోందన్నారు. దీనిపై అన్నిపక్షాలతో సంప్రదించి ప్రజాభిప్రాయాన్నీ పరిగణనలోకి తీసుకొని అవసరమైన సంస్కరణలు చేయాలని కోరారు.

టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

రాష్ట్రంలో 56 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉందని, ప్రభుత్వం మాత్రం తొమ్మిదివేల పోస్టులు మాత్రమేనని చెబుతోందని, వెంటనే డిఎస్‌సి ప్రకటించి మొత్తం టీచర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. పాఠశాలలను కలిపేస్తూ పోస్టులు తగ్గిస్తూ ఖాళీలు లేవని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించి, అవసరమైతే కొన్ని సడలింపులిచ్చి పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

సనాతన ధర్మంలో సమానత్వం ఎక్కడ?

బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు సనాతన ధర్మం పేరుతో తలలు నరికేస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారన్నారు. ఇదేనా మన సంస్కృతి, సంప్రదాయమని ప్రశ్నించారు. సనాతనకాలంలో ప్రజలందరికీ భూమి ఉందని, సనాతన ధర్మాన్ని ఆచరిస్తున్నామని చెబుతున్న వారు ప్రజలకు భూములు ఇచ్చేస్తే తమకు అభ్యంతరం లేదని, ఒకవైపు భూములన్నీ కార్పొరేట్లకు కట్టబెడుతూ పైకి సనాతన ధర్మం గురించి మాట్లాడటం ఏమిటని ప్రశ్నించారు. మానవత్వాన్ని ప్రశ్నించే కులవ్యవస్థను, అంటరానితనాన్ని సమర్థించడం, అగ్రకుల దురహంకారాన్ని రెచ్చగొట్టేదే సనాతన ధర్మమైతే, అటువంటి దానిని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. స్త్రీలను అణచివేయడం సనాతనమా అని ప్రశ్నించారు. దీనిని రాష్ట్రంలో వైసిపి ఖండించడం లేదని, టిడిపి నాయకులు నెత్తినేసుకున్నారని అన్నారు. సనాతన ధర్మం అంటే ఏమిటో చెప్పాలని బిజెపి నాయకులను డిమాండ్ చేశారు. లౌకికవాదాన్ని బలపరిచిన ఎన్‌టిఆర్ కుమార్తె పురంధేశ్వరి కాలం చెల్లిన ధర్మాన్ని గురించి మాట్లాడటం అంటే ఎన్‌టిఆర్‌ను అవమానించడమేనని అన్నారు. భారతీయ సనాతన కాలంలో పురోగమన, తిరోగమన భావాలు రెండూ వున్నాయని, కమ్యూనిస్టులుగా తాము భారతీయ ఉత్తమ సంప్రదాయాలకు, పురోగమన వాదానికి ప్రతినిధులమని చెప్పారు.

ప్రజా ఉద్యమాలపై నిర్బంధం

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ప్రజా ఉద్యమాలపై నిర్బంధాన్ని ప్రయోగిస్తోందని గఫూర్ అన్నారు. శాంతియుతంగా ఆందోళనలు చేస్తున్నా అరెస్టులు గావిస్తూ బెదిరింపులకు దిగుతోందన్నారు. పోలీసు వ్యవస్థ అధికార యంత్రాంగంగా కాకుండా అధికార పార్టీ యంత్రాంగంగా మారిపోయిందని ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. ప్రభుత్వ విధానాలతో ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని, దీన్ని కనబడకుండా చేయాలనే పని పోలీసు వ్యవస్థ చేస్తోందని, ఇలాంటి ప్రభుత్వాలు మనుగడ సాగించిన దాఖలాలు లేవని అన్నారు. పాలకులు ఎల్లప్పుడూ అధికారంలో ఉండరనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు.

పేద రైతుల రుణాలు రద్దు చేయండి

పార్టీ విస్తృత సమావేశంలో ఆమోదించిన తీర్మానాలను మీడియాకు ఆయన విడుదల చేశారు. వీటిల్లో కరువు సహాయక చర్యలు వెంటనే చేపట్టాలని, వ్యవసాయ రుణాలు రద్దుచేయాలని, ఏజెన్సీ, స్పెషల్ డిఎస్‌సి పెట్టాలని, తక్షణమే ప్రకటించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, అధిక ధరలు అరికట్టాలని, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలంటూ ప్రతిపాదించిన పలు తీర్మానాలను ఆమోదించినట్లు తెలిపారు. అలాగే విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు రద్దుచేయాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిలిపేయాలని, కేంద్ర విద్యుత్ చట్టసవరణ ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలని, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమగ్ర పునరావాసం, ప్యాకేజీ అమలు చేసిన అనంతరమే ప్రాజెక్టు నిర్మాణం కొనసాగించాలని తీర్మానించినట్లు తెలిపారు. విశాఖ స్టీలు ప్లాంటును పరిరక్షించాలని ఈ నెల 20 నుండి 29 వరకు సిపిఎం నిర్వహిస్తున్న ఉత్తరాంధ్ర బైక్ యాత్రలో పాల్గొనాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయాలని తీర్మానించినట్లు తెలిపారు.

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 40 | విజయవాడ, శనివారం 9 సెప్టెంబర్ 2023 | 8+8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Saturday 9 September 2023 | Rs

ఏడు స్థానాల్లో నాలుగింట 'ఇండియా' గెలుపు

- త్రిపురలో రిగ్గింగ్‌తో గట్టెక్కిన బిజెపి
- ఉత్తరప్రదేశ్‌లో ఘోర పరాభవం
- కేరళలో కాంగ్రెస్‌కు 'సానుభూతి'

వన్డే ప్రపంచకప్ అధికారుల జాబితాలో

జవగళ్ శ్రీనాథ్‌కు చోటు

- అంపైర్‌గా నితిన్ మీనన్‌కు కూడా..

అసమానతలు లేని అభివృద్ధి కోసం

నవంబరు 7న భారీ బహిరంగసభ

మీడియాతో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు, చిత్రంలో గఫూర్

అక్టోబరు 1 నుండి రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు, జాతాలు

బిజెపిని బలపరిచే పార్టీలతో కలవం

కలిసొచ్చే బిజెపి వ్యతిరేక లౌకిక పార్టీలతో ఉమ్మడి కార్యాచరణ

సిపిఎం నేతలు వి.శ్రీనివాసరావు, ఎంఎ గఫూర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అసమానతలు లేని అభివృద్ధిని డిమాండ్ చేస్తూ నవంబరు 7వ తేదీన విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ రెండురోజులపాటు జరిగిన పార్టీ రాష్ట్రస్థాయి విస్తృత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను, ప్రజా సమస్యలపై చేసిన తీర్మానాలను వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని తెలిపారు. ప్రజా సమస్యలు, భారాలు పెరుగుతున్నా యని చెప్పారు. వీటిని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబరు ఒకటి నుండి రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు, 21 నుంచి జాతాలు నిర్వహిస్తామని చెప్పారు. మూడు ప్రాంతాల నుండి జాతాలు ప్రారంభమౌతాయన్నారు. ఒకటి శ్రీకాకుళం జిల్లా మందస, మరొకటి పార్వతీపురం జిల్లా సీతంపేట, మూడోది కర్నూలు జిల్లా ఆదోని నుండి ప్రారంభమవుతాయన్నారు. పార్టీ స్వతంత్ర ప్రజా పునాదిని పెంచుకోవడానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో బిజెపిని బలపరిచే పార్టీలతో కలిసే ప్రసక్తే లేదని, కలిసొచ్చే బిజెపియేతర లౌకిక పార్టీలతో ఉమ్మడి కార్యాచరణ రూపొందించి ముందుకు వెళతామని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఎన్ని సీట్లు పోటీ చేస్తారని అడిగిన ప్రశ్నకు సీట్ల గురించి ఇంకా చర్చించలేదని, కానీ మూడు నాలుగు పార్లమెంటు, 15, 20 అసెంబ్లీ

మిగతా 2లో

చంద్రబాబు అరెస్టుపై పుకార్లు

నంద్యాల ఆర్‌కె ఫంక్షన్ హాలుకు చేరిన ముఖ్యనాయకులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా పర్యటనలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అరెస్టు చేస్తారని పుకార్లు రావడంతో నంద్యాల, కర్నూలు జిల్లాల ముఖ్యనాయకులు చంద్రబాబు బసచేసిన నంద్యాల ఆర్‌కె ఫంక్షన్‌హాలుకు చేరుకున్నారు. ఇటీవల ఆయనకు ఐటి నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో తనను అరెస్టు చేసే అవకాశం ఉందని చంద్రబాబు స్వయంగా ప్రకటించారు. శుక్రవారం నంద్యాల పర్యటనలో ఉన్న చంద్రబాబు బహిరంగసభ అనంతరం ఆరెకె ఫంక్షన్‌హాలులో బసచేస్తున్నారు. ఈ వార్త తెలిసిన నాయకులు, మీడియా ప్రతినిధులు అంతా అక్కడే ఉన్నారు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, టిడిపి కర్నూలు, నంద్యాల జిల్లాల ముఖ్య నాయకులు వచ్చారు. తెల్లవారు జామున మూడు గంటల ప్రాంతంలో అరెస్టు చేస్తారనే సమాచారం వచ్చిందని నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్ మీడియా తో మాట్లాడు తూ చెప్పారు. మానాయకుడిని అరెస్టు చేస్తే ఊరుకోమని తామంతా అడ్డుకుంటామని ఆయన తెలిపారు. అవినీతిపరుడైన వైఎస్.జగన్‌ను అరెస్టు చేస్తే అడ్డుకున్నారని మానాయకుడిని అరెస్టు చేస్తే తామెలా ఊరుకుంటామని అన్నారు. భారీఎత్తున కార్యకర్తలను రప్పిస్తున్నారు. ఇప్పటికే పలువురు ఆర్‌కె ఫంక్షన్ హాలుకు చేరుకున్నారు.

నంద్యాల ఆర్‌కె ఫంక్షన్ హాలు వద్ద నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్, కార్యకర్తలు

అధినేతల సందడి

- ఢిల్లీకి తరలివచ్చిన నేతలు
- నిఘా నీడలో రాజధాని
- నేడు, రేపు జి20 శిఖరాగ్ర సమావేశాలు

న్యూఢిల్లీ : ప్రపంచంలోని అత్యంత ప్రభావశీల దేశాధినేతల రాకతో శుక్రవారం దేశ రాజధాని నగరంలో సందడి నెలకొంది. అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య నగరమంతా నిఘా నీడలోకి జారుకోవడంతో జనజీవనం మొత్తం స్థంబించింది. ఐక్యరాజ్యసమితి ప్రధానకార్యదర్శి ఆంటోనియో గుటెరాస్, అమెరికా అధ్యక్షులు జోయ్ బైడెన్, బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునక్, బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా, ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోని అల్బనీస్, ఈజిప్టు అధ్యక్షులు అబ్దేల్ ఫతాహ్ అల్ సిసి, దక్షిణ కొరియా అధినేత యూన్ సుక్ యోల్, ఒమన్ ప్రధాని హైతాం బిన్ తారిఖ్ సయీద్, రష్యా విదేశాంగ మంత్రి సెర్గాయ్ లావరోవ్ ఇప్పటికే న్యూఢిల్లీ చేరుకున్నారు. అయితే జి20 సమావేశాల సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇచ్చే విందుకు కాంగ్రెస్ అధ్యక్షులు, పార్లమెంట్‌లో ప్రధాన ప్రతిపక్ష నేత అయిన మల్లికార్జున ఖర్గేకి ఆహ్వానం పంపకపోవడం వివాదస్పదమైంది. మోడీ సర్కార్ ఎక్కడుంటే అక్కడ మనువాదం రాజ్యమేలుతోందని, దళిత నేత అయినందునే ఖర్గేను ఆహ్వానించకుండా కేంద్ర ప్రభుత్వం కుల వివక్షకు పాల్పడిందని కాంగ్రెస్ నేతలు విమర్శలు గుప్పించారు. ఢిల్లీ చేరుకున్న అగ్ర నేతలకు కేంద్ర మంత్రులు వికె సింగ్ తదితరులు స్వాగతం పలికారు. నగరంలోని ప్రగతి మైదానంలో అత్యంత ఆధునిక హంగులతో ఏర్పాటు చేసిన 'భారత్ మండపం'లో శని, ఆదివారాల్లో జి 20 18వ శిఖరాగ్ర సమావేశాలు నిర్వహించనున్నారు. "ఒక భూమి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్" అన్న అంశంతో జరగబోయే ఈ సదస్సు ప్రధానంగా సర్వతో ముఖాభివృద్ధి, డిజిటల్ ఆవిష్కరణ, వాతావరణ మార్పులు, అంతర్జాతీయంగా అందరికీ సమాన అవకాశాలు వంటి అంశాలపై దృష్టి పెట్టనుంది.

ఆర్థిక, ద్రవ్యపరమైన అంశాలపై అంతర్జాతీయ సహకారానికి ప్రధాన వేదికగా 1999లో జి-20 ఏర్పడింది. ఇందులో యురోపియన్ యూనియన్, మరో 19 దేశాలు వున్నాయి. అర్జెంటైనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, ఇండియా, ఇండోనేషియా, ఇటలీ, జపాన్, మెక్సికో, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, దక్షిణ కొరియా, టర్కీ, బ్రిటన్, అమెరికా సభ్య దేశాలుగా వున్నాయి.

న్యూఢిల్లీలోని తన నివాసంలో బైడెన్‌తో భేటీ అయిన నరేంద్రమోడీ

బైడెన్‌తో మోడీ భేటీ

న్యూఢిల్లీ : అమెరికా-ఇండియా ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత అభివృద్ధిపరుచుకోవడంపై ప్రధానంగా నేతలు దృష్టి పెట్టారని బైడెన్‌తో భేటీపై ప్రధానమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఇరు దేశాల ప్రయోజనాలే కీలకంగా పలు అంశాలపై ఇరువురు నేతలు చర్చించారని పేర్కొంది. ఈ సమావేశంలో అమెరికా తరపున ఆర్థికశాఖ మంత్రి జానెట్ యెలెన్, విదేశాంగ మంత్రి ఆంథోనీ బ్లింకెన్‌లు పాల్గొనగా, భారత్ తరపున విదేశాంగ మంత్రి జై శంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పాల్గొన్నారు. 'ప్రతిసారీ మనం కలుస్తున్నాం, మరింత మెరుగైన వాటిని పొందుతున్నాం' అని భారత్‌కు బయలుదేరడానికి ముందుగా బైడెన్ వ్యాఖ్యానించారు. జిఇ జెట్ ఇంజన్ల ఒప్పందం 5జి, 6జి స్పెక్ట్రమ్, ఆధునిక సాంకేతికత అభివృద్ధికి పరస్పర సహకారం, అణు సాంకేతికతలపై చర్చల్లో పురోగతి తదితర అంశాలపై చర్చించే అవకాశం వుందని భావిస్తున్నట్లు వైట్‌హౌస్ ఒక ప్రకటనలో పేర్కొంది. జి-20 సమావేశాల నేపథ్యంలోనే బైడెన్ ఇతర దేశాల నేతలతో కూడా భేటీ అవుతారని వైట్‌హౌస్ తెలిపింది.

మా భయాలు నిజమయ్యాయి

- త్రిపుర ఉప ఎన్నికలను రద్దు చేయాలి : సిపిఐ(ఎం)

అగర్తలా : త్రిపురలో ఉప ఎన్నికలు జరిగిన రెండు అసెంబ్లీ నియోజకవర్గాలైన బాక్సానగర్, ధన్‌పూర్‌ల ఫలితాలను చూసినట్లైతే లెఫ్ట్ ఫ్రంట్ వ్యక్తం చేసిన భయాందోళనలు నిజమేనని రుజువైందని సిపిఎం పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఆ ఎన్నికల ఫలితాలను రద్దు చేసి, పకడ్బందీ పర్యవేక్షణలో తాజాగా ఎన్నికలు నిర్వహించాలన్న తమ డిమాండ్ కూడా సమర్ధనీయమేనని పేర్కొంది. బాక్సానగర్ నియోజకవర్గంలో పోలైన ఓట్లలో బిజెపికి 89శాతం లభించాయి. ధన్‌పూర్ నియోజకవర్గంలో 71శాతం లభించాయి. రాష్ట్ర ఎన్నికల చరిత్రలోనే ఇది కనివినీ ఎరుగనిదని పొలిట్‌బ్యూరో ఒక ప్రకటనలో పేర్కొంది. బాక్సానగర్ సీటును ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల్లో సిపిఎం గెలిచిన తర్వాత, పెద్ద ఎత్తున రిగ్గింగ్ జరిగితే తప్ప 89శాతం ఓట్లు సాధించడం బిజెపికి అసాధ్యమని పేర్కొంది. పాలనాయంత్రాంగం, పోలీసులతో కుమ్మక్కై పెద్ద ఎత్తున రిగ్గింగ్ చేయడంతో ఈ ఎన్నికలు ఒక ప్రహసనంగా మారాయని విమర్శించింది. ఈ పరిస్థితుల్లో ఆ రెండు సీట్ల ఎన్నికలను రద్దు చేసి, గట్టి భద్రతా ఏర్పాట్ల మధ్య తిరిగి ఎన్నికలు నిర్వహించాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది.

ఇ-క్రాప్ ఇబ్బందులు

- డౌన్‌లోడ్, ఎర్రర్, సబ్మిట్ సమస్యలు
- రైతులకు పథకాల నష్టం
- కొత్త విధానంలోనూ కౌల్దార్లకు అన్యాయం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఇ-క్రాప్ ఉంటేనే రైతులకు పథకాలని ప్రభుత్వం చెప్పగా సదరు ఇ-క్రాప్ నమోదుల ప్రక్రియ ఏడాదేడాదీ మార్పులకు గురవుతోంది. ఒక సారి ఉన్న విధానం మరుసటి సీజన్‌కు ఉండట్లేదు. కొత్త విధానాన్ని క్షేత్ర స్థాయి సిబ్బంది ఆకళింపు చేసుకునేసరికే సమయమైపోతోంది. పై నుంచి వచ్చే ఒత్తిడితో ఆదరాబాదరగా నమోదుల వ్యవహారాన్ని మమ అనిపించడంతో అంతిమంగా రైతులు సర్కారీ స్కీంలను నష్టపోతున్నారు. కడకు పండించిన పంటలను సైతం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొనే వీల్లేని దారుణ పరిస్థితి. ఇ-క్రాప్ నిబంధనల్లో కౌలు రైతుల నమోదుకు స్పష్టమైన గైడ్‌లైన్స్ లేకపోవడంతో లక్షలాది కౌల్దార్లు తామే వాస్తవ సాగుదారులైనప్పటికీ గుర్తింపు కొరవడి అన్ని విధాలా నష్టపోతున్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్ సాగుల నమోదు (ఇ-క్రాప్) సెప్టెంబర్ 30 నాటికి పూర్తి చేయాలని వ్యవసాయశాఖ లక్ష్యాన్ని నిర్దేశించింది. కొన్ని చోట్ల గడువు సెప్టెంబర్ 15 అంటున్నారు. సరైన వానల్లేక ఈ మారు ఖరీఫ్ సాగు బాగా తగ్గింది. ఇప్పుడు పడుతున్న వర్షాలకు వీలున్న ప్రాంతాల్లో మెట్ట, ఆరుతడి పంటలు వేస్తున్నారు. సాధారణ సాగులో ఇప్పటికి 63 శాతం పంటలు సాగైనట్లు ప్రభుత్వం వెల్లడించింది.. కొన్ని చోట్ల 30 శాతం కంటే లోపు సేద్యం జరిగింది. అందుకే ఇ-క్రాప్ నమోదులు రాష్ట్రంలో 10-20 శాతం లోపే జరిగాయి. త్వరగా పూర్తి చేయాలని ఉన్నతాధికారులు వెంటపడుతున్నారు.

యాప్‌లో కొత్త ఫీచర్లు

అవినీతి, అక్రమాల ఆరోపణలతో ఇ-క్రాప్ యాప్‌లో ఈసారి జియోట్యాగింగ్ తీసుకొచ్చారు. ఆర్‌బికె సిబ్బంది నమోదు చేయాల్సిన పొలానికి 200 మీటర్ల పరిధిలోనే సర్వేనెంబర్ ఓపెన్ అవుతుంది. సిబ్బంది పొలాల వద్దకెళ్లి తీరాలి. గతంలో ఆఫీసుల్లో, ఎక్కడంటే అక్కడ కూర్చొని ఎంట్రీ చేసే వీలుండేది. కొత్త విధానంలో ఆ అవకాశం లేదంటున్నారు. మండల వ్యవసాయాధికారి (ఎఒ) సర్వేనెంబర్లను డౌన్‌లోడ్ చేసి గ్రామాల వారీగా ఆర్‌బికె సిబ్బందికి సెండ్ చేయాలి. వాటిని సిబ్బంది డౌన్‌లోడ్ చేసుకొని పొలాల వద్దకెళ్లి నమోదు చేయాలి. చాలా చోట్ల ఇప్పటికీ సర్వేనెంబర్ డౌన్‌లోడ్లు పూర్తి కాలేదు. ఒక పట్టాన డౌన్‌లోడ్ కావట్లేదు. పొలాల వద్దకెళ్లాక నిర్దేశిత సర్వే నెంబర్లు ఓపెన్ కావట్లేదు. ఓపెన్ అయ్యాక పది అంశాలు నమోదు చేయాలి. టెక్నికల్ ఎర్రర్స్ వలన చాలా సమయం పడుతోంది. ఎంట్రీలన్నీ పూర్తి చేశాక రైతుల నుండి డిజిటల్ వేలిముద్రలు తీసుకోవాలి. విఎఎ అథంటికేషన్ చేయాలి. అనంతరం విఆర్‌ఒ అథంటికేషన్ చేయాలి. ఈ ప్రాసెస్‌లో ఎర్రర్స్ వస్తున్నాయి. ఒక అధికారి నుంచి మరొక అధికారికి అథంటికేషన్ కోసం సెండ్, సబ్మిట్ చేసే క్రమంలో ఫార్మాట్, అందులోని అంశాలు కనిపించట్లేదు. దాంతో రైతులు, సిబ్బంది లబోదిబోమంటున్నారు. భూముల వివరాలను రెవెన్యూ డిపార్టుమెంట్ నుంచి తీసుకున్నారు. సర్వేనెంబర్లు, వాటి యజమా నుల సమాచారం తప్పుల తడకగా ఉన్నాయి. కౌలు రైతుల వివరాలు అసలే లేవు. సిసిఆర్‌సి, ఇతర గుర్తింపు పత్రాలు ఉన్నా కౌల్దార్ల పేర్లు ఎక్కించలేదు.

అక్రమాలకు ఆస్కారం

జియోట్యాగింగ్ వలన తప్పనిసరిగా సిబ్బంది ఫీల్డ్ విజిట్ చేయాల్సి ఉన్నా పంటల నమోదులో అక్రమాలకు వెసులుబాట్లు అలానే ఉన్నాయి. యాప్‌లో సర్వేనెంబర్ ఓపెన్ అయ్యాక రైతు వేయని పంటను వేసినట్లు రికార్డు చేసే అవకాశం ఇప్పటికీ ఉంది. అలా చేస్తే ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ, బ్యాంక్ రుణాలు తదితర విషయాల్లో అనర్హులకు లాభం, వాస్తవ రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. కొత్త యాప్‌లోనూ లోపాలున్నాయని రైతులు వాపోతున్నారు.

సిపిఐ బస్సు యాత్ర ముగింపు సభలో మాట్లాడుతున్న డి.రాజా

మోడీని ఓడించి దేశాన్ని కాపాడండి

- సిపిఐ బస్సు యాత్ర ముగింపు సభలో డి.రాజా

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

త్వరలో జరగనున్న ఎన్నికల్లో నరేంద్రమోడీని, బిజెపిని ఓడించడం ద్వారా దేశాన్ని కాపాడాలని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా పిలుపునిచ్చారు. 'రాష్ట్రాన్ని రక్షించండి.. దేశాన్ని కాపాడండి' అనే నినాదంతో ఆగస్టు 17న విశాఖపట్నంలో సిపిఐ చేపట్టిన బస్సు జాతా శుక్రవారం తిరుపతిలో ముగిసింది. తొలుత బాలాజీకాలనీ నుంచి నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగసభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హరినాథరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డి.రాజా మాట్లాడుతూ మోడీ కార్పొరేట్ శక్తుల పక్షాన నిలుస్తూ సామాన్యులు విస్మరిస్తున్నాడన్నారు. నియంతలా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల అజెండా ఏంటో బహిరంగ పరచాలన్నారు. నరేంద్రమోడీ కబంద హస్తాల నుంచి దేశాన్ని రక్షించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. గత తొమ్మిదేళ్లలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టని మోడీ ఆర్థికంగా మూడో శక్తిగా భారత్ ఎదుగుతుందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. దిగిరాని ద్రవ్యోల్బణం, గణనీయంగా పెరిగిన నిరుద్యోగం, నింగినంటుతున్న నిత్యావసర ధరలు, రూపాయి పతనంతో దేశం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. సనాతన ధర్మంపై తమిళనాడు మంత్రి

మిగతా 2లో

ప్రమాదంలో దెబ్బతిన్న టాటాఏస్ వాహనం, కారు

ఏకకాలంలో 4 వాహనాలు ఢీ

- ఐదుగురు దుర్మరణం
- మృతుల్లో నలుగురిది ఒకే కుటుంబం

ప్రజాశక్తి- నగరి (చిత్తూరు జిల్లా)

ఏకకాలంలో నాలుగు వాహనాలు ఢీకొనడంతో ఐదుగురు దుర్మరణం చెందారు. మృతుల్లో నలుగురు ఒకే కుటుంబానికి చెందిన వారు. చిత్తూరు జిల్లాలో శుక్రవారం చోటుచేసుకున్న ఈ విషాద ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... నగరి మున్సిపాల్టీ పరిధిలోని ధర్మాపురం వద్ద జాతీయ రహదారిపై టాటాఏస్ వాహనాన్ని అడ్డుగా పెట్టి రోడ్డు మరమ్మతు పనులు చేస్తున్నారు. తిరుపతి నుంచి చెన్నయ్ వెళ్తున్న సిమెంట్ లారీ అదుపు తప్పి ఆ వాహనాన్ని వేగంగా ఢీకొంది. అదే సమయంలో నగరి నుంచి పుత్తూరు వైపు వస్తున్న కారును, బైక్‌ను కూడా ఢీకొట్టింది. దీంతో, ఐదుగురు మృతి చెందారు. వారిలో బైక్‌పై వెళ్తున్న నగరిలోని మిట్టపాళేనికి చెందిన భూపాలన్ (29), ఆయన భార్య నీలావతి (26), కుమారులు నితిన్ (4), ఉమేష్ (3) ఉన్నారు. పుత్తూరు రామకృష్ణపురంలోని నీలావతి తల్లి ఇంటికి వెళ్తుండగా వీరు ఈ ప్రమాదానికి గురయ్యారు. రోడ్డు మరమ్మతు పనులు చేస్తున్న తమిళనాడు రాష్ట్రం కాంచీపురానికి చెందిన కార్మికుడు కన్నన్ (50) కూడా ఈ ప్రమాదంలో దుర్మణం చెందారు. విళుపురానికి చెందిన మణికంఠన్ (23), హరికృష్ణ (21), అలందూర్ పేటకు చెందిన దినేష్ (18) తీవ్ర గాయాలపాలై తిరుపతి రూయాలో చికిత్స పొందుతున్నారు. వీరిలో తిరునావుక్కరసు పరిస్థితి విషమంగా ఉంది. డిఎస్‌పి రవికుమార్, ఆర్‌డిఒ సుజన ఘటనా స్థలాన్ని చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ఉక్కు' ఊపిరి తీసే కొత్త కుట్ర!

- ప్లాంట్‌లో ప్రయివేట్ సంస్థ తిష్టకు ఢిల్లీ పెద్దల స్కెచ్?
- ఆక్సిజన్ ప్లాంట్‌కు మోకాలడ్డుతున్న బిజెపి

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పీకనులిమేందుకు ఢిల్లీలోని బిజెపి పెద్దలు కుట్రల పరంపర కొనసాగిస్తూనే ఉన్నారు. ఉక్కులోని ఆక్సిజన్ ప్లాంట్‌పై తాజాగా వీరి కన్ను పడింది. ఉక్కు ఉత్పత్తికి ఐరన్ ఓర్, బొగ్గు, విద్యుత్ ఎంత అవసరమో ఆక్సిజన్ కూడా అంతే అవసరం. అటువంటి ఆక్సిజన్ ప్లాంట్‌ను ప్రయివేటీకరించడం ద్వారా కేంద్రంలోని పాలకులు విశాఖ ఉక్కు ఊపిరిని తీసెయ్యాలని స్కెచ్ వేశారు. నెలల తరబడి కోల్, ఐరన్ ఓర్ రాకుండా కేంద్రం ఇప్పటికే అడ్డుపడుతోంది. ఆక్సిజన్ ప్లాంట్ కోసం ఓ ప్రయివేట్ సంస్థ ప్లాంట్‌లో తిష్ట వేసే ఏర్పాట్లు చేస్తుండడంతో విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికవర్గం మరోసారి భగ్గుమంటోంది. 'ఆక్సిజన్ ప్లాంట్ లేకుండా చేస్తే ఉక్కు ఊపిరి పోయినట్టే. ఈ కుట్రలను తిప్పికొడతాం' అని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ జె.అయోధ్యరాం తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్లాంట్‌లో చాలా కాలం నుంచి ఆక్సిజన్ సెపరేషన్ యూనిట్లు మూడు ఉన్నాయి. రోజుకు ఒక్కో యూనిట్ నుంచి 500 టన్నుల చొప్పున మూడింటి నుంచి 1500 టన్నులు ఉత్పత్తి అవుతోంది. ప్లాంట్ విస్తరణలో భాగంగా మరో రెండు యూనిట్ల నిర్మాణం చేశారు. అవి ఒక్కొక్కటీ 600 టన్నుల చొప్పున 1,200 టన్నులు ఆక్సిజన్ ఉత్పత్తి చేస్తున్నాయి. మొత్తం కలిపి విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో 2700 టన్నులు రోజుకు ఉత్పత్తి జరుగుతోంది. దీన్ని ఎస్‌ఎంఎస్, బ్లాస్ట్ ఫర్నేస్‌ల డిపార్టుమెంట్లలో వాడుతున్నారు. ప్లాంట్ విస్తరణలో మరింత ఆక్సిజన్ అవసరమైనందున 2010లో ఫ్రెంచ్‌కు చెందిన ఎయిర్ లిక్విడ్ కంపెనీతో 1,700 టన్నుల ఆక్సిజన్ తయారీకి ఒప్పందం జరిగింది. ఆ ప్లాంట్ నిర్మాణం పూర్తయి 2014లో ట్రయల్ రన్‌కు రాగా, ఒక పెద్ద కంపెనీలో మరో పెద్ద కంపెనీ వచ్చి ప్లాంట్ కడితే ఆ ప్లాంట్‌కు ఎలా లైసెన్సు ఇస్తారంటూ అప్పటి టిడిపి ప్రభుత్వం, అధికార పార్టీ పెద్దలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో లైసెన్స్ ఆగిపోయింది. ఆక్సిజన్ సరిపడా లేకుండా స్టీల్‌ప్లాంట్ ముందుకుపోయే అవకాశం లేనందున ఆ మొత్తం యూనిట్‌ను స్టీల్‌ప్లాంట్‌కు ఇవ్వాలని ఫ్రెంచ్ కంపెనీని కోరగా, రూ.1000 కోట్లు ఇస్తే కంపెనీ మొత్తాన్ని హేండోవర్ చేస్తామంటూ స్టీల్‌ప్లాంట్‌కు ఆ కంపెనీ చెప్పింది. 2014-15లో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం రూ.250 కోట్లు ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. కానీ, ఎయిర్ లిక్విడ్ కంపెనీ, స్టీల్‌ప్లాంట్ మధ్య సరైన అవగాహన లేనందున ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్‌కు ఈ విషయం వెళ్లింది. పదేళ్లపాటు దీనిపై ఎలాంటి నిర్ణయమూ జరగలేదు. తాజాగా దీనిపై ఫ్రెంచ్ కంపెనీ తరుపున ప్రముఖ న్యాయవాది శ్రీహరీష్ సాల్వే, వైజాగ్ స్టీల్ తరుపున ఓ మాజీ జడ్జి వాదనలు వినిపించినట్లు తెలుస్తోంది. ఎయిర్ లిక్విడ్ కంపెనీకి రూ.389 కోట్లు చెల్లించి ఆ కంపెనీని ఆపరేట్ చేసుకోవచ్చని ఆర్బిట్రేషన్‌లో చెప్పగా, వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఇప్పటికే రూ.80 కోట్లు చెల్లించింది.

తాజాగా ఏం నడుస్తోంది?

పదేళ్లపాటు మూలనపెట్టిన ఎక్విప్‌మెంట్ తుప్పుపట్టిన కారణంగా తాజాగా లైసెన్స్

మిగతా 2లో

పులివెందులలో టిడిపి కార్యకర్త హత్య

- వేటకొడవళ్లతో దాడి

2

అప్రూవర్‌గా మారిన 'మాగుంట'?

- ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో వేగం పెంచిన ఇడి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కేసులో ఉన్న ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి అప్రూవర్‌గా మారినట్లు తెలుస్తోంది. శుక్రవారం ఢిల్లీలోనే ఉన్న ఆయనను ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టర్ విభాగానికి చెందిన అధికారులు విచారణకు పిలిచారు. ఢిల్లీ లిక్కర్ కుంభకోణం కేసులో ముడుపుల వ్యవహారంపై పలు కోణాల్లో ఆయనను విచారించినట్లు ఢిల్లీ నుంచి చర్చ సాగుతోంది. ఆయన ఇచ్చిన సమాచారం ఆధారంగానే ఈ కేసులో ఇడి అధికారులు వేగం పెంచారని సమాచారం. ఇటీవలే ఆయన కుమారుడు రాఘవరెడ్డికి

మిగతా 2లో

సంపాదకీయం

ఆసియాన్ డిక్లరేషన్

పరస్పర సహకారం, శాంతి, సుహృద్భావ సందేశంతో ముందుకు సాగాలని ఇండోనేషియాలోని జకార్తాలో నిర్వహించిన 43వ ఆగ్నేయాసియా దేశాల కూటమి (ఆసియాన్) సదస్సు ఇచ్చిన పిలుపు ప్రస్తుత అనిశ్చిత పరిస్థితుల్లో ఎంతో ప్రాధాన్యత కలిగివుంది. చైనా ఎదుగుదలను ఓర్వలేని అమెరికా, దాని తైనాతీలు దక్షిణ చైనా సముద్ర వివాదాన్ని రాజేసేందుకు, చైనాకు వ్యతిరేకంగా ఆసియాన్ దేశాలను ఉసిగొల్పాలని చూశాయి. చైనా ఏమాత్రం నిగ్రహం కోల్పోకుండా చాలా పరిణితితో వ్యవహరించింది. ఆసియాన్ సదస్సుకు హాజరైన చైనా ప్రధానమంత్రి లీ కియాంగ్ ఆగ్నేయాసియా దేశాలతో సోదర సంబంధాలను పెంపొందించుకునేందుకు స్నేహ హస్తం చాచారు. మూడు రోజుల స్వల్ప వ్యవధిలోనే ఆసియాన్ భాగస్వామ్య దేశాలు 12 సదస్సులు నిర్వహించడం, 90 దార్శనిక పత్రాలు రూపొందించడం, పలు ఒప్పందాలు చేసుకోవడం ఆహ్వానించదగ్గ పరిణామం. సవాళ్లను అవకాశాలుగా, ప్రతికూల పరిస్థితులను సహకార సాధనాలుగా, వెలివేతలను సమీకృతంగా, విభేదాలను ఐక్యతగా మలచుకోవాలన్న ఇండోనేషియా అధ్యక్షులు జోకో విడోడో మాటలు ఆసియాన్ ఉదాత్త ఆశయాలకు దర్పణం పట్టాయి.

వాస్తవానికి దక్షిణ చైనా సముద్రం అంశాన్ని తురుపుముక్కగా చేసుకుని ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఉద్రిక్తతలు రెచ్చగొట్టాలని చూసిన అమెరికాకు భంగపాటు తప్పలేదు. చైనాకు అనుకూలంగా సభ్య దేశాలు వ్యవహరించడం అగ్రరాజ్యానికి మింగుడు పడటం లేదు. కొత్తగా పొడచూపుతున్న పరిస్థితులను, సవాళ్లను అధిగమించి ప్రాంతీయ శాంతి, సుస్థిరత, సౌభాగ్యాలను పెంపొందించేందుకు తన వంతు సహకారం అందించేందుకు సిద్ధమని ఆసియాన్ సదస్సులో చైనా ఉద్ఘాటించింది. ఈ సదస్సు ఆసియాన్ భాగస్వామ్యపక్ష దేశాల ఎజెండాకే పరిమితం కాకుండా ప్రపంచ భౌగోళిక రాజకీయ పరిస్థితులను, సవాళ్లపైనా దృష్టి సారించింది. ఈ కూటమి సభ్యులే కాకుండా చర్చల భాగస్వాములుగా ఉన్న చైనా, అమెరికా, రష్యా, జపాన్, ఇండియా, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాలను ఒక ఛత్రం కిందకు తీసుకురావడంలో ఈ సదస్సు విజయవంతమైందనే చెప్పాలి.

ఆసియాకు వెలుపల ఉన్న దేశంగా అమెరికా ఈ ప్రాంత దేశాల మధ్య తంపులు పెట్టడానికి యత్నిస్తే.. పొరుగుదేశంగా చైనా ఆసియాన్ దీర్ఘకాల అభివృద్ధి, సుస్థిరత సాధనకు కృషి సల్పిందని చెప్పవచ్చు. అమెరికా అధ్యక్షులు జో బైడెన్ స్థానంలో హాజరైన ఉపాధ్యక్షురాలు, ఆసియా సంతతికి చెందిన కమలా హారిస్ ఆసియాన్ దేశాలను విడదీసి వేరు కుంపట్లు పెట్టేందుకు ముమ్మరంగా లాబీయింగ్ చేశారు. ఇండో పసిఫిక్ వ్యూహం, ఆకస్, క్వాడ్ కూటములతో చైనాను ఒంటరిపాటు చేయాలని చూస్తున్న అమెరికా, జకార్తాలోనూ అదే ట్రిక్కులు ప్రయోగించాలని చూసింది. ఫిలిప్పీన్స్ వంటి దేశాలు దక్షిణ చైనా సముద్ర దీవుల విషయంలో వివాదాన్ని చర్చల ద్వారా పరిష్కరించుకుంటామని, ఇందులో ఎవరి జోక్యం అవసరం లేదని తేల్చి చెప్పింది. సహకార బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవడం ద్వారా 'కొత్త ప్రచ్ఛన్న యుద్ధాల'ను నివారించాలన్న చైనా పిలుపును ఈ సదస్సు ఆమోదించింది. ఆసియాన్ సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హాజరై స్వేచ్ఛ, పారదర్శకలతో కూడిన ఇండో పసిఫిక్ ప్రాంతంగా పురోగమించాలని ఆకాంక్షించారు. అనుసంధానత, వాణిజ్యం నుండి డిజిటల్ పరివర్తన వరకు వివిధ రంగాల్లో తీసుకోవాల్సిన 12 అంశాలను ఆయన ప్రతిపాదించారు. ఒకవైపు అమెరికాకు మోకరిల్లుతూ మరోవైపు బహుళ ధ్రువ ప్రపంచం గురించి మాట్లాడడం మోడీ చిత్తశుద్ధిని ప్రశ్నార్థకం చేస్తోంది. ఏదేమైనా వాతావరణ మార్పులపై ప్రాంతీయ కర్బన ఉద్గారాల తగ్గింపుతో సహా పలు ఒడంబడికలపై సదస్సు ఏకాభిప్రాయానికి రావడం ముదావహం. మయన్మార్‌లో నాలుగు వేల మందిని చంపి, వేలాది మందిని నిర్బంధించిన సైనిక ప్రభుత్వ చర్యకు వ్యతిరేకంగా 2021లో ఆసియాన్ ఆమోదించిన అయిదు అంశాల తీర్మానం అమలులో ఎలాంటి పురోగతి సాధించలేకపోయామని సదస్సు అంగీకరించింది. వైఫల్యాన్ని అంగీకరించడంతోనే ఆగిపోకుండా మయన్మార్‌లో శాంతి, సుస్థిరతకు రోడ్ మ్యాప్‌తో ముందుకు రావాల్సిన అవసరముంది. ఆగ్నేయాసియా శాంతి, సుస్థిరత కోసం కూటమిలోని దేశాలన్నీ మరింత సహకారంతో ముందుకు సాగాలి.

మంచి మాట

చే గువేరా చెప్పినట్లు ప్రతి ఫ్యాక్టరీ ఒక పాఠశాల కావాలి. అక్కడ ఇనుము, అల్యూమినియం, ఇతర వస్తువులను ఉత్పత్తి చేయడంతో పాటు సరికొత్త స్త్రీ పురుషులను, సరికొత్త సమాజాన్ని, సోషలిస్టు సమాజాన్ని ఉత్పత్తి చేయాలి.

- హ్యూగో చావెజ్

విశ్లేషణ

జీ20 శిఖరాగ్ర సమావేశాలు

వి. రాంభూపాల్

ప్రపంచంలో అత్యంత ప్రభావితమైన దేశాల కూటమిగా వున్న జీ20 దేశాల సదస్సుకు నేడు, రేపు మన దేశ రాజధాని ఆతిథ్యం ఇవ్వనున్నది. ఇప్పటికే అనేక హంగులతో, భద్రతా చర్యలతో సకల ఏర్పాట్లు చేశారు. మెట్రో రైల్వేస్టేషన్ల వద్ద కఠిన నిబంధనలు, ప్రధాన వేదిక ప్రగతి మైదాన్ వద్ద లాక్‌డౌన్‌ను తలపించే ఆంక్షలతో ఢిల్లీ నగరం సిద్ధమైంది. జీ20 దేశాల కూటమికి ప్రస్తుతం భారత ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యం వహిస్తున్నారు. ఈ బాధ్యత కాలపరిమితి త్వరలో ముగియనుండడం, విశ్వగురువుగా ప్రచారం చేసుకొని రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న బిజెపి తాపత్రయంతో పాటు మోడీ భజనలో తరిస్తున్న మీడియా కలిసి ఈ సమావేశాలను నభూతో నభవిష్యత్ అన్నట్టుగా మార్చేస్తున్నాయి. మోడీజీ కోసం జీ20 దేశాధినేతలు పోటీ పడుతున్నట్లు ప్రచార హోరు సాగుతున్నది. జీ20 ఏమిటి? అది ఎందుకు ఏర్పడింది? దాని లక్ష్యాలు ఏమిటి? ఆచరణ ఏమిటి? అనే విషయాలు మోడీ హోరులో కనిపించనంత దూరం వెళ్లిపోయాయి.

ఎన్నికల ప్రచారం కోసం

ఆర్‌ఎస్‌ఎస్ మార్గదర్శకత్వంలో నరేంద్ర మోడీ ఏది చేసినా సంచలనంగా వుండాలని కోరుకుంటారు. ప్రతి సంఘటనను భారీ ఈవెంట్‌గా మార్చి పెద్దఎత్తున ప్రచారం పొందాలని భావిస్తారు. అది నోట్ల రద్దు గాని, లాక్‌డౌన్ గాని, విదేశీ పర్యటనలు గాని, జీ20 సమావేశాలు గాని ఏదైనా ప్రచారహోరు సాగాలి, అందులో నుండి బలమైన నాయకుడిగా కీర్తించబడాలి, ఎన్నికల లబ్ధి పొందాలి. ఇది విధానం. అందులో భాగమే జీ20 సమావేశాల నిర్వహణ. ఈ జీ20 కూటమిలో ఐరోపా కూటమిని మినహాయిస్తే 19 దేశాలు వున్నాయి. ఈ దేశాలు వంతులవారీగా సమ్మిట్‌లు జరపాలి. అందుకోసం సభ్యదేశాలు ఐదు గ్రూపులుగా ఏర్పడ్డాయి. 2020 సమ్మిట్ మొదటి గ్రూపులోని సౌదీ అరేబియా నిర్వహించింది. రెండో గ్రూపులో మన దేశం వుంది. లెక్కప్రకారం మన దేశంలో ఈ సదస్సు 2021లో జరగాలి. అయితే నాల్గో గ్రూపులో వున్న ఇటలీ కోరిందని, అందుకు మన దేశం అంగీకరించినట్లు చెప్పుకుంది. ఆ తర్వాతి సంవత్సరం ఐదో గ్రూపులో వున్న ఇండోనేషియా జరిపింది. 2024లో దేశంలో జరిగే ఎన్నికల ప్రయోజనాలకు ఈ జీ20 సమావేశాలను ఉపయోగించుకోవాలని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ 2021, 2022 సంవత్సరాల్లో వచ్చిన అవకాశాలను వదులుకున్నారనే బలమైన విమర్శ వుంది. జీ20 సమావేశాలను 2024లో భారతదేశంలో జరగనున్న ఎన్నికల ప్రచారాంశంగా మార్చిందని బ్రిటన్‌కు చెందిన ప్రముఖ అంతర్జాతీయ పత్రిక 'గార్డియన్' విమర్శించింది. ఈ సమ్మిట్ 'లోగో' బిజెపి ఎన్నికల గుర్తు అయిన కమలం వుండడం, లోగో వెనుక బిజెపి జెండా కాషాయ రంగులో వుండడం ఇందులో భాగమే. జీ20 దేశాల అధినేతలకు భారత రాష్ట్రపతి భోజనానికి ఆహ్వానం పంపారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రెసిడెంట్ ఆఫ్ భారత్ అని రాశారు.

ప్రపంచ స్థూల జాతీయోత్పత్తిలో 85 శాతం, ప్రపంచ వాణిజ్యంలో 75 శాతం, ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతులకు ప్రాతినిథ్యం వహిస్తున్న అంతర్జాతీయ ఆర్థిక సహకార వేదిక జీ20. ఈ కూటమిలో మన దేశంతో పాటు అర్జెంటీనా, బ్రెజిల్, చైనా, జర్మనీ, ఇండోనేషియా, ఇండియా, జపాన్, ఆస్ట్రేలియా, కెనడా, ఫ్రాన్స్, ఇటలీ, మెక్సికో, దక్షిణ కొరియా, రష్యా, టర్కీ, అమెరికా, దక్షిణాఫ్రికా, సౌదీ అరేబియా, బ్రిటన్ దేశాలతో పాటు యూరోపియన్ యూనియన్ భాగస్వాములు. ఈ కూటమికి శాశ్వత కార్యాలయం ఇప్పటి వరకు ఎక్కడా లేదు. అందువల్ల సారథ్యం వహించిన దేశం ఎజెండా ఖరారు చేయడంతో పాటు, శిఖరాగ్ర సదస్సు, మంత్రిత్వ శాఖలు, అధికారుల సదస్సులు దేశంలోని వివిధ పట్టణాల్లో ఈ సంవత్సర కాలంలో నిర్వహించాలి. అందుకు అవసరమయ్యే ఖర్చులు, రక్షణ చర్యలు ఆ దేశమే భరించాలి. ప్రస్తుతం మన దేశం 32 రంగాల్లో అనేక నగరాలు, పట్టణాల్లో ఇలాంటి సమావేశాలను సుమారు 200 వరకు నిర్వహిస్తుంది. మన రాష్ట్రంలో విశాఖపట్నంలో ఒక సమావేశం జరిగింది. బెంగళూరు సమావేశానికి వచ్చిన విదేశాంగ మంత్రులు, అధికారులు పనిలో పనిగా అనంతపురం లోని లేపాక్షి, సాయిబాబా సమాధి, బళ్ళారి జిల్లా లోని హంపీ క్షేత్రాలను దర్శించారు.

> **అబద్ధాల మీద నిర్మితమైన బిజెపి అన్ని విషయాల్లో అబద్ధాలను ప్రచారం చేసినట్లుగానే జీ20 దేశాల ముందు కూడా దేశాభివృద్ధి గురించి బూటకపు ప్రచారం చేసుకుంటున్నది. ప్రపంచంలోని అనేక సంస్థలు మన దేశ ఆకలి, దారిద్ర్యం, అక్షరాస్యత, అసమానత, అసహనం, మత ఘర్షణల గురించి ఏకరువు పెడుతుంటే ... ఢిల్లీ భారీ హోర్డింగుల్లో దేశాభివృద్ధి గురించి కేంద్ర ప్రభుత్వం అబద్ధాలను ప్రచారం చేసుకుంటున్నది. జీ20 సదస్సులో పర్యావరణం, ఆర్థిక అసమానతల వంటి ప్రజా సమస్యలను చర్చించాలని కోరేందుకు ఢిల్లీ సూర్జిత్ భవన్‌లో సమావేశమైన 'వుయ్ 20' మేధావుల గొంతులను పోలీసుల ద్వారా ఎలా అణచివేశారో చూశాం. మణిపూర్‌లో జరుగుతున్న తీవ్ర హింస నేపథ్యంలో 'వసుధైక కుటుంబం' నినాదంతో ఈ సమావేశాలు జరుగుతుండడం పాలకుల వైరుధ్య విధానాలకు నిదర్శనం.**

ఇప్పుడు దేశాధినేతలతో శిఖరాగ్ర సదుస్సు ఢిల్లీలో జరుగుతుంది. అయితే ఈ సమావేశానికి రష్యా, చైనా దేశధినేతలు హాజరు కావడం లేదు. ఉక్రెయిన్ యుద్ధం గురించి ఎజెండాలో చేర్చినందున ఇండోనేషియా బాలిలో జరిగిన సమావే శానికి కూడా రష్యా అధ్యక్షుడు రాలేదు. అదే కారణంతో ఈ సంవత్సరం కూడా ఆయన హాజరు కావడం లేదు. చైనా అధ్యక్షుడు కూడా రాకపోవడంపై అనేక ఊహాగానాలు జరుగుతున్నాయి. మెక్సికో అధ్యక్షుడు రాకపై ఇంకా స్పష్టత లేదు.

జీ20 ఎందుకు ఏర్పడింది?

సోవియట్ యూనియన్‌లో సోషలిస్టు ఆర్థిక, రాజకీయ వ్యవస్థ కూలిపోవడంతో పెట్టుబడిదారీ వ్యవస్థకు తిరుగులేదని దాన్ని మరింతగా ముందుకు తీసుకు వెళ్లేందుకుగాను ప్రపంచీకరణ విధానాలను అన్ని దేశాల్లో వేగంగా అమలు చేయాలని ఒకవైపు ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్, డబ్ల్యుటివో లాంటి ఆర్థిక సంస్థలు మరోవైపు సామ్రాజ్యవాద దేశాలు వివిధ రూపాల్లో ఒత్తిళ్ళు తెచ్చి అమలు చేయించాయి. ఈ ఆర్థిక విధానాలు సర్వరోగ నివారిణిగా ఆయా దేశాధినేతల చేత, మీడియా చేత ప్రచారం చేయించి ప్రజలను నమ్మించారు. కాని పెట్టుబడిదారీ వ్యవస్థ ఉత్పత్తి విధానంలోని ఉత్పత్తి, పంపిణీ, వినిమయం మధ్య ఏర్పడే అంతర్గత వైరుధ్యాల ఫలితంగా ఆర్థిక అసమానతలు మరింత పెరిగి కొనుగోళ్ళ సంక్షోభం మరింతగా తీవ్రమైంది. 1997-98కు పూర్వం ఆసియా దేశాలను పులులుగా చిత్రికరించిన సామ్రాజ్యవాద దేశాలు, ఆ తర్వాత ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోవడానికి కారణం అయ్యాయి. ఇదే కాలంలోనే ఆఫ్రికా, లాటిన్ అమెరికాలోని అనేక దేశాలు ఆర్థిక సంక్షోభాలను ఎదుర్కోవలసి వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ జీ20 ఏర్పడింది. ఒక రకంగా ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న, వెనుకబడిన దేశాల ఆర్థిక వ్యవస్థలు తీవ్ర సమస్యల్లో కూరుకు పోయిన సందర్భంలో జీ20 కూటమి ఏర్పడింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల భాగస్వామ్యం అవసరమని గుర్తించి 1999లో ఇప్పుడున్న జీ20 దేశాల ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంకు గవర్నర్లు బెర్లిన్‌లో సమావేశం అయ్యారు. 2003 ఆగస్టు 20న జీ20 దేశాల కూటమి స్థాపించ´బడింది. 'ద్రవ్య మార్కెట్లు-ప్రపంచ ఆర్థిక వ్యవస్థ' అనే నినాదంతో తొలి జీ20 సదస్సు 2008 నవంబర్‌లో అమెరికా లోని వాషింగ్టన్ డి.సి లో జరిగింది. అప్పటి నుండి ప్రతి సంవత్సరం ఒక దేశంలో జరిగే ఈ సమావేశాల్లో సభ్యదేశాలు అంగీకరించే అంశాలపై చివరి రోజు ఉమ్మడిగా ప్రకటన చేస్తున్నారు. అయితే ఈ సమావేశాల్లో బయటకు కనిపించేది నాయక బృందం... కనిపించనిది ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్, డబ్ల్యుటివో, ఐఎల్ఓ (అంతర్జాతీయ కార్మిక సంస్థ), ఎడిబి (ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు)ల ప్రతినిధులు. నాయకుల చేత పలికించేది, తెర చాటునుంచి నడిపేది వీరే. 1973లో వచ్చిన చమురు సంక్షోభం నివారణ పేరుతో అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, ఇటలీ ఆ తర్వాత కెనడా దేశాలతో ఏర్పడిన జీ7 కూటమి సంక్షోభాలను పరిష్కరించకపోగా వాటిని మరింత తీవ్రం చేసింది. రోగమేదైనా మందు ఒక్కటే అన్నట్లుగా ఆసియా దేశాల్లో వచ్చిన సంక్షోభాలకు జీ20 కూటమి ఏర్పాటు పరిష్కారమని జీ7 దేశాలు సూచించాయి.

పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడడమే జీ20 లక్ష్యం

ప్రపంచ ఆర్థిక స్థిరత్వం- స్థిరమైన వృద్ధిని సాధించడానికి దాని సభ్యదేశాల మధ్య సమన్వయం, నష్టాలను తగ్గించే, భవిష్యత్‌లో ఆర్థిక సంక్షోభాలను నిరోధించే ఆర్థిక నిర్వహణను ప్రోత్సహించడం, కొత్త అంతర్జాతీయ ఆర్థిక నిర్మాణాన్ని రూపొందించడం లక్ష్యాలుగా జీ20 ఏర్పడింది. గత ఇండోనేషియా సమావేశంలో ఆరోగ్యం, డిజిటల్ అక్షరాస్యత, వాతావరణ మార్పు, ఆహార భద్రత, గురించి చర్చించి కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. అయితే వీటి అమలు ఎంతమేరకు జరిగిందనేది సందేహాస్పదమే. ఎందుకంటే ఇప్పటి వరకు జరిగిన సమావేశాలలో ప్రచార పటాటోపం తప్ప ఫలితం శూన్యం గనక. 2021 సదస్సులో వాతావరణ పరిరక్షణ కోసం బొగ్గును విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు సరఫరా చేయరాదని నిర్ణయించారు. అయితే ఆ తార్వతి సంవత్సరాల్లో విద్యుత్ ఉత్పత్తి కోసం బొగ్గు వాడకం మరింతగా పెరిగింది. 'పన్నుల విధాన' ప్రకటన కూడా ఇలాగే నిర్వీర్యం అయ్యింది. వాతావరణ కాలుష్యానికి కారణమైన సామ్రాజ్యవాద దేశాలు వాటిని నివారించడంలో అత్యంత బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయి. పెట్టుబడిదారీ దేశాలు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు ఆర్థిక అసమానతలను మరింతగా పెంచి అందరికీ విద్య, వైద్యం, నివాసం లాంటి కనీస వసతులను దూరం చేస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తిరోగమనంలో వుంది. అనేకమంది వేతన జీవులు ఉపాధి కోల్పోతున్నారు. కొత్త ఉద్యోగాలు తగ్గాయి. దీని ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోవడానికి కారణమవుతున్నది. ఉన్న కొద్దిపాటి కొనుగోళ్లను కొల్లగొట్టి లాభపడడానికి జీ7 దేశాల కూటమి అనేక రూపాల్లో ప్రయత్నిస్తుంది. ఈ పోటీ నుండి తమను తాము కాపాడుకోవడానికి అనేక దేశాలు ప్రాంతీయ ఆర్థిక కూటములుగా ఏర్పడుతున్నాయి. వ్యవస్థలో వున్న లోపాలను కూటములతో పరిష్కరించాలని ప్రయత్నిస్తున్నాయి. అందుకే ఆర్థిక సంక్షోభాలు మరింతగా తీవ్రమవుతూనే వున్నాయి

మోడీ అభివృద్ధి బూటకపు ప్రచారం

అబద్ధాల మీద నిర్మితమైన బిజెపి అన్ని విషయాల్లో అబద్ధాలను ప్రచారం చేసినట్లుగానే జీ20 దేశాల ముందు కూడా దేశాభివృద్ధి గురించి బూటకపు ప్రచారం చేసుకుంటున్నది. ప్రపంచంలోని అనేక సంస్థలు మన దేశ ఆకలి, దారిద్ర్యం, అక్షరాస్యత, అసమానత, అసహనం, మత ఘర్షణల గురించి ఏకరువు పెడుతుంటే...ఢిల్లీ భారీ హోర్డింగుల్లో దేశాభివృద్ధి గురించి కేంద్ర ప్రభుత్వం అబద్ధాలను ప్రచారం చేసుకుంటున్నది. జీ20 సదస్సులో పర్యావరణం, ఆర్థిక అసమానతల వంటి ప్రజా సమస్యలను చర్చించాలని కోరేందుకు ఢిల్లీ సూర్జిత్ భవన్‌లో సమావేశమైన 'వుయ్ 20' మేధావుల గొంతులను పోలీసుల ద్వారా ఎలా అణచివేశారో చూశాం. మణిపూర్‌లో జరుగుతున్న తీవ్ర హింస నేపథ్యంలో 'వసుధైక కుటుంబం' నినాదంతో ఈ సమావేశాలు జరుగుతుండడం పాలకుల వైరుధ్య విధానాలకు నిదర్శనం. తన నినాదంగా, విధానంగా వున్న 'ఒకే' మాటను ఈ సదస్సుకు కూడా 'ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒక భవిష్యత్తు'గా మార్చారు. మాటల గారడీ కొంత కాలం మరిపించగలదేమో కాని, ప్రజల బతుకులను మార్చలేదు. ఎన్నికల కోసం చేసే జిమ్మిక్కులు మరెంతో కాలం సాగవు.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

సెటైర్

ఇండియా, దటీజ్ భారత్

సుబ్రమణ్యం

"భరత్ అను నేను, హామీ ఇస్తున్నాను" అని పాడుకుంటూ మా ఇంట్లోకి హుషారుగా వచ్చేడు కాశ్యప్, మావాడి క్లాస్‌మేట్. వాళ్ళిద్దరూ ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నారు. వాడు వచ్చేసరికి మా అబ్బాయి ధీరజ్ టిఫిన్ తింటున్నాడు.

"ఒరేయ్! ఇక మన హీరో రాజకీయాల్లోకి వచ్చేస్తున్నట్టే" అని కాశ్యప్ ఉత్సాహంగా ప్రకటించేడు. మా వాడికి అర్థం కాలేదని వాడి క్వశ్చన్‌మార్క్ ముఖమే చెప్పేస్తోంది. "నీకు అర్థం కాలేదు కదూ? మహేశ్‌బాబు భరత్ అను నేను సినిమా రిలీజ్ అయినప్పుడే మా ఆలిండియా మహేశ్‌బాబు ఫ్యాన్స్‌కి అర్థం ఐపోయింది. ఇదిగో, ఇప్పుడు క్లియర్ అయిపోయింది. వచ్చే ఎన్నికల్లో మా వాడు రంగంలోకి దిగడం ఖాయం. నిండు చందురుడు ఒక వైపు, చుక్కలు ఒకవైపు" అంటూ కాశ్యప్ ఉత్సాహంగా చెప్పుకుపోతున్నాడు. వాళ్ళిద్దరికీ దోసెలు వడ్డిస్తున్న నా భార్య కూడా మహేశ్‌బాబు అభిమాని. ఇంక ఆమెకి కూడా ఉత్సాహం వచ్చేసింది. "ఇంకో దోసె వేసుకోవయ్యా, మొహమాటపడకు" అంటూనే తన సందేహాన్ని వ్యక్తం చేసేసింది. "మనవాడు రాజకీయాల్లోకి రావాలని, ఆ సినిమాలోలాగా దేశాన్ని మొత్తం ఒక ఊపు ఊపాలని నేనూ అనుకుంటున్నాననుకో, కాని, ఇప్పటికే ఆలస్యం అయిపోయిందేమో, ఎన్నికల హడావుడి మొదలైపోయింది, మరో పక్క జమిలి ఎన్నికలు అంటున్నారు" అంటూ నా ప్రియాతి ప్రియమైన సతీమణి అన్నపూర్ణ అంటూంటే తన రాజకీయ పరిజ్ఞానం చూసి ముచ్చటేసింది నాకు.

"ఎప్పుడొచ్చేం అన్నది కాదాంటీ, బుల్లెట్ దింపామా లేదా అన్నదే ముఖ్యం" అంటూ అన్నపూర్ణ సందేహాన్ని పటాపంచలు చేసేశాడు కాశ్యప్. "నీ హీరో రాజకీయాల్లోకి వస్తున్నాడని ఎవరు చెప్పేర్రా?" అని ధీరజ్ అడిగేడు. "ఎవరో ఏమిటి? ఇప్పుడు జి-20 సమావేశాలు జరుగుతున్నాయి కదా; వాటిలోనే మనవాడి పేరు ప్రకటించేస్తారు" అన్నాడు కాశ్యప్. "నీకెలా తెలిసిందీ అని అడుగుతున్నాను" అని రెట్టించేడు మావాడు. "అదేంటి? క్లియర్‌గా కనపడుతూంటే! ఇండియా అని ఉన్న చోటల్లా భరత్ అని మార్చేస్తున్నాడు మోడీ. మనవాడి మీద ఎంత నమ్మకం లేకపోతే అలా చేస్తాడు?" అని తన పరిజ్ఞానాన్ని బైటపెట్టేడు కాశ్యప్.

విరగబడి నవ్వుతూ "వార్నీ! అది భరత్ కాదురా, భారత్" అన్నాడు ధీరజ్. అన్నపూర్ణ ఉత్సాహం పాలపొంగులా చప్పబడిపోయింది. కాని కాశ్యప్ ఇంకా వదల్లేదు. "బి-హెచ్-ఎ-ఆర్-ఎ-టి-దీన్నెలా చదువుతార్రా. మన క్లాసులో భరత్ గాడు ఉన్నాడు కదా. వాడు కూడా ఇలానే తన పేరు ఇంగ్లీషులో రాస్తాడు. మరి నువ్వేమో "భ" ని సాగదీసి "భా" అని చదవాలంటున్నావు." అని గింజుకున్నాడు. కాని ధీరజ్ తేల్చేశాడు. భరత్ కాదు, భారత్ అని నిర్ధారించేడు.

"మరి, ఇండియా అని మన దేశాన్ని అంటాం కదా, మళ్ళీ ఈ భారత్ ఎందుకు?" అనడిగేడు కాశ్యప్. "ఈ మధ్య ప్రతిపక్షాలన్నీ తమ కూటమికి "ఇండియా" అన్న అక్షరాలు కలిసొచ్చేలా పేరు ప్రకటించేయి కదా, దానికి పలుకుబడి పెరిగిపోతోందేమో అని భయపడి ఎక్కడా ఇండియా అన్న పదం రాకుండా చేసెయ్యాలని మోడీ అనుకున్నట్టున్నాడు. అందుకే గవర్నమెంట్ ఆఫ్ ఇండియా బదులు గవర్నమెంట్ ఆఫ్ భారత్ అని వాడడం ప్రారంభించారు." అని ధీరజ్ వివరించేడు.



"మరి ఒక దేశం పేరును అలా మార్చెయ్యవచ్చా?" అని అడిగింది అన్నపూర్ణ. "మన రాజ్యాంగంలో 'ఇండియా, దటీజ్ భారత్' అని ఉందమ్మా. అందుచేత రెండు పేర్లలో దేన్నైనా వాడుకోవచ్చు." అని చెప్పేడు ధీరజ్.

"మరి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ఇండియన్ కాన్స్టిట్యూషన్, సుప్రీం కోర్ట్ ఆఫ్ ఇండియా, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎల్ఐసి ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ పీనల్ కోడ్, ఇండియన్ రైల్వేస్, ఎయిర్ ఇండియా-ఇలా ఉన్న పేర్లన్నింటినీ ఇప్పుడు మార్చేస్తారా? అని కాశ్యప్ అడిగేడు." ఏమో మరి, చూడాలి" అని లేచేడు ధీరజ్

*****

అధినేత అసహనంగా పచార్లు చేస్తున్నాడు. అతని ముఖ్య సలహాదారుడు దీర్ఘాలోచనలో పడ్డాడు. "అసలు ఇండియా అన్న పేరు ఎక్కడా ఉండకుండా చేయాలని కదా మన సుప్రీం కమాండర్ చెప్పేరు? వచ్చే పార్లమెంట్‌లో దానిమీద ఒక చట్టం చేయలేమా?" అని అధినేత అడిగేడు. వెంటనే ముఖ్య సలహాదారుడు న్యాయ సలహా కోసం కబురంపేడు. న్యాయ సలహాదారుడు అటువంటి చట్టం చేయడానికి అవకాశం లేదని, ఆ పదాన్ని నిషేధించాలంటే ముందు రాజ్యాంగాన్నే సవరించాల్సి వుంటుందని, దానికి చాలా తతంగం ఉందని చెప్పేడు. ప్రధాన ప్రతిపక్షాల్లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) ఇలా చాలా పార్టీలు ఉన్నాయని, వాటిని ఆ పేర్లతోటే ఎన్నికల కమిషన్ గుర్తించిందని చెప్పాడు. ముఖ్య సలహాదారుడు అధినేత దగ్గరగా కూచుని ఇండియా అన్న పదం మీద ఎంత చర్చ జరిగితే ప్రతిపక్ష కూటమికి అంత లాభం అని చెప్పేడు. రాముడి పేరుమీదో, దేశభక్తి పేరు మీదో, ఆవు పేరు చెప్పో, హనుమంతుడి జపం చేసో, లేకపోతే యూనిఫార్మ్ సివిల్ కోడ్ అనో మనమే దేశ ప్రజల దృష్టిని పక్కకు మళ్ళించాలి తప్ప "ఇండియా" కూటమి ఉచ్చులో పడి ఇండియా పేరు చుట్టూ తిరిగితే ప్రజలు ఆ ఇండియా కూటమి గురించే ఎక్కువగా మాల్లాడుకుంటారని, మనల్ని మరిచిపోయే ప్రమాదం కూడా వుండొచ్చని అని నచ్చజెప్పేడు.

మొత్తానికి దేశబత్తులందరికీ 'ఇండియా' అన్న పేరు దడ పుట్టిస్తోంది.

*****

"భారతదేశానికి సముద్ర మార్గం కనుక్కోడానికి బయలుదేరిన కొలంబస్ బృందానికి అల్లంతదూరాన భూమి కనపడేసరికి "అదుగో! వచ్చేశాం ఇండియా! " అని అరిచారు. అప్పటి నుండీ ఆ ప్రాంతంలోని దీవులని వెస్ట్ ఇండీస్ అని, అమెరికా ఖండంలో అప్పుడు జీవిస్తున్న మూలవాసుల్ని రెడ్ ఇండియన్స్ అని పిలవడం ప్రారంభించారు." చెప్పుకుపోతోంది చరిత్ర మేడమ్. క్లాస్‌లో ఒక చెయ్యి పైకి లేచింది. "మేడమ్! వెస్ట్ 'ఇండీస్', రెడ్ 'ఇండియన్స్' అని ఎందుకన్నారు? వెస్ట్ 'భరతీస్' అని, రెడ్ 'భరతియన్స్' అని ఎందుకనలేదు? అని అడిగేడు నారద్. మేడమ్ కి ఏం చెప్పాలో తెలియలేదు.

"ఇండియన్ ఓషన్" అని అంటున్నారే తప్ప "భరతియన్ ఓషన్" అని ఎందుకు అనలేదు? అని నారద్ జాగ్రఫీ టీచర్ని అడిగితే ఆయన కూడా సమాధానం చెప్పలేదు. నారద్ హెడ్మాస్టర్, డిఇవో తో కలిసి విజిట్ కి క్లాస్ కి వచ్చినప్పుడు " సార్, నా డౌట్లకి సమాధానాలు ఇవ్వడం లేదు సార్!" అని ఫిర్యాదు చేసేరు. ఆ ఫిర్యాదు మీద వెంటనే ఎంక్వైరీ వేసేరు. సిలబస్‌లో లేని ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం కుదరదని తేల్చేరు. టీచర్లయితే ఊపిరి పీల్చుకున్నారు కాని నారద్ సందేహం తీరలేదు. ఇంటికెళ్ళి తండ్రినడిగేడు.

"మన దేశం స్వతంత్రం వచ్చిన తర్వాతనే ఇండియా అయింది. దానిని భారత్ అని కూడా అనవచ్చునని రాజ్యాంగం చెప్పింది. అంతకు మునుపు ఇండియా, పాకిస్తాన్ బంగ్లాదేశ్ అంతా కలిపి బ్రిటిష్ ఇండియాగా, బ్రిటిష్ వాళ్ళకి వలసగా ఉండేది." వివరించేడు నారద్ తండ్రి బ్రహ్మ. "మరి అంతకు ముందు?" అడిగేడు నారద్. అంతకు ముందు మన దేశం వందల చిన్న చిన్న రాజ్యాలుగా ఉండేది. బ్రిటిష్ పాలన ఉన్నప్పుడు కూడా చాలా రాజ్యాలు ఇక్కడ ఉండేవి." అని బ్రహ్మ చెప్పేడు. "ఐతే మరి వాటిల్లో భారత్ అనే రాజ్యం ఏదైనా ఉందా?" అడిగేడు నారద్. లేదన్నాడు బ్రహ్మ..

"దుష్యంతుడికి శకుంతలకి పుట్టినవాడు భరతుడు గనుక మన దేశానిక ఆ పేరు వచ్చిందని తెలుగు మాస్టారు చెప్పేరు. కాని చరిత్ర చూస్తే ఆ పేరుతో ఏ దేశమూ ఉన్నట్టు కనపడదు. మరి ఈ భారత్ అన్న పేరు ఎక్కడినుంచి వచ్చింది?" నారద్ సందేహం అలాగే ఉండిపోయింది.

. ఆ వీధి చివరి ఇంట్లో ఉంటున్న హిస్టరీ లెక్చరర్ గారిని కలిసేడు. "బ్రిటిష్ వాడి పాలన పోవాలని, వాళ్ళ ఏలుబడికింద ఉన్న ప్రాంతంలోని ప్రజలందరూ జాతీయ స్ఫూర్తితో ఐక్యంగా ముందుకు కదలాలని నడిచిన జాతీయోద్యమంలో ఇండియా అన్న పేరుకు బదులు భారత్ అని, హిందూస్తాన్ అని వాడడం మొదలైంది. ముస్లిం లీగ్ పాకిస్తాన్ కావాలని ఆందోళన మొదలుపెట్టినప్పుడు పాకిస్తాన్, హిందూస్తాన్‌గా రెండు దేశాలుగా విడిపోవాలని అనడం మొదలుబెట్టారు. ఆ తర్వాత విభజన సందర్భంగా లక్షలాది మందిని బలి తీసుకున్న మత ఘర్షణలు జరిగాయి. ఆ విషాదం నుండి బైట పడిన తర్వాత రాజ్యాంగ సభలో అప్పుడే జరిగిన మత ఘర్షణల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మతప్రసక్తి లేని పాలన ఉండాలని నిర్ణయించారు. కనుక హిందూస్తాన్ అన్న పేరు బదులు ఇండియా అన్నది వాడాలని నిర్ణయించారు. అది ఇంగ్లీషువాడు పెట్టిన పేరుగనుక వేరే పేరు ఉండాలని కొందరు పట్టుబట్టినప్పుడు రాజీ మార్గంగా ఇండియా, భారత్ అన్న రెండు పేర్లూ వాడవచ్చునని నిర్ణయించారు." ఇదీ ఆయన చెప్పిన వివరణ. "అంటే ఇండియా అన్న పేరుకి, భారత్ అన్న పేరుకి పోటీ లేనట్టే కదా?" నారద్ అడిగేడు. ఏమీ లేదని లెక్చరర్ గారు క్లారిఫై చేసేరు.

"సార్! మరి గవర్నమెంట్ ఆఫ్ భారత్ అని ఎందుకు మార్చినట్టు? ఇండియా అన్న పేరుకి భారత్ అన్న పేరుకి మధ్య పోటీ ఎందుకు తెచ్చినట్టు?" అని నారద్ రెట్టించేడు. "ఇంతవరకూ తెచ్చిన తగువులన్నీ ఎందుకోసమో ఇది కూడా అందుకోసమే. పేదరికం, ఆకలి, నిరుద్యోగం, వగైరా సమస్యలు నేటి వాస్తవం. దానిని కప్పిపుచ్చి జనాల దృష్టిని మరల్చడానికి దేన్నైనా వాడుకుంటారు" అని లెక్చరర్ గారు ముగించేరు.

*****

మర్నాడు తనపక్కన కూచున్న మిత్ర బృందానికి నారద్ ఇలా చెప్పేడు. "ఇండియా అంటే ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయెన్స్."

బృందంలో ఒకడు "మరి భారత్' అంటేనో? అని అడిగేడు. నారద్ కాస్సేపు ఆలోచించి "బహుశా-భగవత్ రాజ్ అదానీ ట్రస్ట్- అయివుంటుందేమో" అన్నాడు.

★

జనవాక్యం

నూజివీడులో డిగ్రీ కాలేజీ ఏదీ!

నూజివీడులో ప్రతి సంవత్సరం ప్రభుత్వ ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేస్తున్న విద్యార్థుల సంఖ్య 350 వరకు ఉంటుంది. వీరందరూ పేద విద్యార్థులు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో సుమారు 1000 నుండి 1500 మంది విద్యార్థులు ఉంటారు. ఒకప్పుడు నూజివీడులో విద్యను అభ్యసించడానికి రాష్ట్రం నలుమూలల నుంచి విద్యార్థులు వచ్చేవారు. కారణం ఏంటంటే అప్పట్లో ధర్మ అప్పారావు కళాశాల రాష్ట్రం మొత్తం పేరుగాంచింది. ఈ కళాశాల అప్పట్లో ఎయిడెడ్‌గా కొనసాగేది. ఇప్పుడు ఈ ధర్మ అప్పారావు కళాశాల ప్రైవేట్ పరమైంది. ఇంతవరకు గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ ఊసే లేదు. జగన్మోహన్ రెడ్డి గారు అధికారం లోకి రాకముందు నియోజవర్గానికి ఒక డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చారు. అధికారానికి వచ్చి నాలుగేళ్లైనా కనీసం శంకుస్థాపన రాయి కూడా పడలేదు. దాంతో పేద పిల్లలకు విద్య దూరమవుతోంది. తక్షణమే నూజివీడు డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేయాలి.

- కె. లెనిన్,
సెల్ : 8885900618

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

కెమెరాకు చిక్కిన మరో రెండు చిరుతలు

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల కాలినడక మార్గంలో చిరుతల అలజడి ఇపుడపుడే తగ్గేలా లేదు. తిరుమల నడక మార్గంలో అధికారులు ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాలకు తాజాగా మరో రెండు చిరుతల కదలికలు చిక్కాయి. తిరుమలలో స్పెషల్ టైప్ క్వార్టర్స్ సమీపంలో ఒకటి, నరసింహస్వామి ఆలయ సమీపంలో మరో చిరుత సంచరిస్తున్నట్టు గుర్తించారు. రెండు చిరుతలను బంధించేందుకు ఆయా ప్రాంతాల్లో బోన్లు ఏర్పాటు చేయనున్నట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు.

12న శ్రీవారి ఆలయంలో బ్రేక్ దర్శనాలు రద్దు

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 12న బ్రేక్ దర్శనాలను టిటిటి రద్దు చేసింది. శ్రీవారి ఆలయంలో ఈ నెల 18 నుండి 26వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 12న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు టిటిడి ప్రకటించింది. ఈ కారణంగా 11న సోమవారం సిఫార్సు లేఖలు స్వీకరించబడవని పేర్కొంది. ఈ విషయాన్ని యాత్రికులు గమనించాలని కోరింది.

తెలంగాణాలో డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లా స్థాయి నియామక కమిటీ (డిఎస్‌సి) నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ శుక్రవారం విడుదల చేసింది. ఈ నెల 15 నుంచి జిల్లాల వారీగా ఖాళీలు, ఇతర వివరాలన్నీ విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని ప్రకటించింది. ఇప్పటికే అతి తక్కువ పోస్టులతో డిఎస్‌సి నోటిఫికేషన్‌ను వేశారంటూ అభ్యర్థులు, నిరుద్యోగులు మండిపడుతున్నారు. సిఎం కెసిఆర్ అసెంబ్లీలో హామీ ఇచ్చినట్టుగా 13,086 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అందుకోసం ఆందోళనలు చేపట్టారు. అయినా విద్యాశాఖ అధికారులు 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకే నోటిఫికేషన్ జారీ చేయడం గమనార్హం. అయితే, పాఠశాల విద్యాశాఖ అధికారులు రూపొందించిన డిఎస్‌సి నోటిఫికేషన్‌లోఉపాధ్యాయ పోస్టుల భర్తీ, ఆన్‌లైన్‌లో డిఎస్‌సి రాతపరీక్షలు, దరఖాస్తు విధానం, ఫీజు వివరాలను మాత్రమే పొందుపరిచారు. రోస్టర్ పాయింట్ల ప్రకారం సబ్జెక్టుల వారీగా, జిల్లాల వారీగా, మాధ్యమం వారీగా ఏ జిల్లాలో ఎన్ని పోస్టులున్నాయన్న వివరాలను ప్రకటించలేదు. రిజర్వేషన్ కేటగిరీల వారీగా ఉపాధ్యాయ పోస్టుల సమాచారం ఇవ్వలేదు. దీంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

ప్రజా చైతన్య స్ఫూర్తి గరికపాటి రాజారావు

రాష్ట్ర వ్యాప్తంగా 60వ వర్ధంతి

ప్రజాశక్తి-యంత్రాంగం

సమాజంలోని రుగ్మతలను రూపుమాపడానికి కళాకారుడు అవసరమని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి గరికపాటి అని పలువురు వక్తలు అన్నారు. ప్రజానాట్య మండలి (పిఎన్‌ఎం) వ్యవస్థాపకులు డాక్టర్ గరికపాటి రాజారావు 60వ వర్ధంతిని శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన గరికపాటి రాజారావు వర్ధంతి సభలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్ మాట్లాడుతూ... కళ.. కళ కోసం కాదని... ప్రజల కోసమని వెలుగెత్తి చాటిన ప్రజా కళాకారులు గరికపాటి అని కొనియాడారు. తుదిశ్వాస విడిచే వరకు మొక్కవోని దీక్షతో పని చేశారని చెప్పారు.

నాటికలు, వీధి నాటకాల ద్వారా లక్షలాది మంది ప్రజల్లో చైతన్య కలిగించారని తెలిపారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు పి.మంగరాజు మాట్లాడుతూ కళారూపాల్లో ప్రతి సన్నివేశంలోనూ పాలకుల మోసాలను తెలియజేయడంతోపాటు పేదలు పడే ఇతివృత్తాలను ఎంచుకుని తన కళారూపాల్లో చెప్పేవారన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ పాటను ప్రజా ఆయుధంగా మలిచిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జానపద వృత్తికళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎ.జగన్, విజయవాడ ఎంబివికె బాధ్యులు యువి రామరాజు తదితరులు పాల్గొన్నారు. గుంటూరులో రాజారావు చిత్రపటానికి గుఱ్ఱం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు పూలమాలలేసి నివాళులర్పించారు. తాడేపల్లి మండలం కొలనుకొండలో సభ నిర్వహించగా ఇప్టా జాతీయ కార్యదర్శి గని మాట్లాడారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పోరంకిలో పిఎన్‌ఎం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.మంగరాజు, అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. వీర తెలంగాణా రైతాంగ పోరాటానికి మద్దతుగా రాజారావు రూపొందించిన మా భూమి, ముందడుగు వంటి నాటకాలు ప్రజలను ఉర్రూతలూగించాయని గుర్తు చేశారు. కర్నూలులో జరిగిన సభలో సాహితీ స్రవంతి రాష్ట్ర నాయకులు జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై కళారూపాల ద్వారా ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. పశ్చిమగోదావరి, విశాఖ, కాకినాడ, పార్వతీపురం మన్యం జిల్లాల్లో గరికపాటి వర్ధంతి సభలు నిర్వహించారు. మూఢనమ్మకాలు, జంతుబలులకు వ్యతిరేకంగా అశాస్త్రీమైన పద్ధతులను నిరసిస్తూ వీధి నాటకాల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేసిన గొప్ప కళాకారుడని కొనియాడారు.

గుంటూరు జిల్లా తాడేపల్లిలో గరికపాటికి నివాళులర్పిస్తున్న నాయకులు

కేంద్ర నిధులకోసం కొత్త విధానం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఒకవైపు రాష్ట్రాలకు ఇవ్వాల్సిన నిధుల్లో కోతలు పెడుతున్న కేంద్రం... ఆ నిధుల విడుదకు మాత్రం అనేక కొత్త విధానాలను అమలు చేస్తోంది. దీంతో నిధుల రాక మరింత ఆలస్యమవుతోందని అధికారులు అంటున్నారు. ఇప్పటికే ఇప్పటికే సింగిల్ నోడల్ ఏజెన్సీ ఖాతాలు, కేంద్ర ఆధీనంలోని పిఎఫ్‌ఎంఎస్‌కు అనుసంధానం వంటి చర్యల వల్ల నిధుల రాక తగ్గిందని చెబుతున్నారు. తాజాగా 'జస్ట్ ఇన్ టైమ్' అంటూ మరో కొత్త విధానానికి కేంద్రం తెరలేపింది. రాష్ట్రాలకు కేంద్రం అందించే నిధులను సక్రమంగా, సకాలంటో అందించేందుకు ఈ విధానాన్ని రూపొందించినట్లు కేంద్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఆచరణలో మరింత జాప్యం జరిగే అవకాశం ఉందని అంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌తోపాటు బీహార్, గుజరాత్, అసోం రాష్ట్రాల్లో మాత్రమే ప్రస్తుతానికి ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. కేంద్ర పథకాలకు వచ్చే నిధుల కోసం ప్రస్తుతం సింగిల్ నోడల్ ఏజెన్సీ ఖాతాలను అమలు చేయాలంటూ ఉన్న నిబంధనను నూతన విధానంలో స్టేట్ లింక్‌డ్ స్కీమ్‌లకు అనుగుణంగా రాష్ట్ర ఖజానా ఖాతాలను నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ ఖాతాలు కూడా రిజర్వ్‌బ్యాంకుకు అనుసంధానంగా ఉండాలని స్పష్టం చేసింది. అప్పుడే కేంద్ర వాటా నిధులను విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. రిజర్వ్‌బ్యాంకులో ఖాతాలు ప్రారంభించిన అనంతరం ఇతర అంశాలకు పిఎఫ్‌ఎంఎస్‌ను సంప్రదించాలని, అప్పుడే ఈ ఖాతాల వివరాలు ఎస్‌ఎన్‌ఏ-స్పార్ష్ ప్లాట్‌ఫారంకి కూడా అనుసంధానం కానున్నాయి. పథకాలకు సంబంధించిన రాష్ట్ర స్కీమ్ మేనేజర్లు ఒక్కో స్టేట్ లింక్‌డ్ స్కీమ్‌లను ఆర్‌బిఐ నుంచి వచ్చిన అధికారిక పత్రాల ద్వారా ఖాతాలను నిర్వహించాలని కూడా పేర్కొంది. అయితే, దీనివల్ల ఖాతాల నిర్వహణలో రాష్ట్రాల స్వతంత్రత పోతుందని, ప్రక్రియ కూడా ఆలస్యంతో కూడుకున్నదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఏడేళ్ల తర్వాత మహిళ హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్ : 2016లో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా ఎస్‌పి మాధవరెడ్డి శుక్రవారం తెలిపిన వివరాల మేరకు.. నల్లమాడ మండలం పెమలకుంటపల్లి తండాకు చెందిన వడితే జీవిలీబాయి (45) వితంతువు. కుటుంబ పోషణ నిమిత్తం జివిలీబాయి కేరళకు వెళ్లారు. అప్పుడప్పుడూ గ్రామానికి వచ్చి పోతుండేవారు. ఈ క్రమంలో ముదిగుబ్బ మండలం సంకేపల్లి గ్రామంలోని మామిడి తోట దగ్గర ఉండే బుక్కపట్నం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన మంగలి రామచంద్రతో ఏర్పడిన పరిచయం సహజీవనానికి దారితీసింది. 2016 ఆగస్టు 7న జీవిలీబాయి అదృశ్యమయ్యారు. ఆమె తల్లి నల్లమాడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ కేసు ఛేదించారు. వివాహేతర సంబంధం, ఆర్థిక వివాదాల నేపథ్యంలోనే కర్రతో కొట్టి చంపి, అక్కడే తోటలో పాతిపెట్టినట్లు నిందిడుతు నేరాన్ని అంగీకరించాడు. నిందితుడిని రిమాండ్‌కు పంపి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌పి తెలిపారు.

జిఇఆర్ వివరాలు బయట పెట్టాలి

- నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

విద్యాశాఖ సౌజన్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జిఇఆర్)లో విస్తుగొలిపే వాస్తవాలు వెలుగు చూశాయని, వాటిని ప్రభుత్వం ఎందుకు బయటపెట్టలేదని జనసేన పార్టీ పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ప్రశ్నించారు. తెనాలిలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 5-18 ఏళ్లలోపు పిల్లలు ఏ కారణం చేతనైనా చదువుకు దూరంగా ఉంటే వారిని గుర్తించి ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల్లో చేర్పించేందుకు చేపట్టిన కార్యక్రమం జిఇఆర్ అని, ఈ సర్వేలో రాష్ట్ర వ్యాప్తంగా 62,754 మంది విద్యార్థులు చనిపోయినట్లు తేలిందన్నారు. అత్యధికంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 10,545 మంది, అనంతపురంలో 4165, గుంటూరు జిల్లాలో 6422 మంది విద్యార్థులు, ఇలా జిల్లాల వారీగా లెక్కలు తేలాయని చెప్పారు. ప్రభుత్వం ఈ లెక్కలను ఎందుకు బయట పెట్టలేదని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 3.82 లక్షల మంది విద్యార్థులు డ్రాపౌట్స్‌గా ఉన్నారని, 2.29 లక్షల మంది ఏమయ్యారో కూడా తెలియదని సర్వేలో తేలిందని చెప్పారు. దీనిపై ముఖ్యమంత్రి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాల విద్యార్థులకు కూడా గంజాయి అందుతున్నట్లు సమాచారం ఉందని, దీనిపైనా ప్రభుత్వం నిగ్గుతేల్చాలన్నారు. సమావేశంలో జనసేన పార్టీ నాయకులు బి.రవికాంత్, డి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పర్యటనపై
చంద్రబాబుకు మాట్లాడే అర్హత లేదు

- మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అధికారంలో వున్నప్పుడు జల్సాలకు, విదేశీ పర్యటనలకు ప్రజాధనాన్ని విచ్చలవిడిగా ఖర్చు చేసిన చంద్రబాబుకు.. సొంత ఖర్చులతో లండన్‌లోని కూతుర్ల వద్దకు వెళ్లిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురించి మాట్లాడే అర్హత లేదని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అధికారంలో వున్నప్పుడు విదేశీ ప్రయాణాల కోసం రూ.100 కోట్లు, నవ నిర్మాణ దీక్షలకు రూ.80 కోట్లు ఖర్చు చేశారన్నారు. విదేశీ ప్రయాణాలకు, రాష్ట్రంలో తిరగడానికి బుల్లెట్ ప్రూఫ్ బస్సు పెట్టుకుని రూ.కోట్లు ప్రజాధనాన్ని వృథా చేసి ఇప్పుడు చంద్రబాబు నీతులు చెబుతున్నారని విమర్శించారు. ఓటుకు నోటు కేసులో పారిపోయి వచ్చే ముందు హైదరాబాద్‌లోని లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్ మరమ్మతులకు రూ.10 కోట్లు, సిఎం కార్యాలయానికి మరో రూ.10 కోట్లు ఖర్చు చేశారని, ఇది దుబారా కాదా? అని అన్నారు. పేదల ఖాతాల్లో రూ.2.31 లక్షల కోట్లు జగన్‌మోహన్‌రెడ్డి జమచేశారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమాన్ని నేరుగా ప్రజలకు ఎందుకు ఇవ్వలేకపోయారని చంద్రబాబును ప్రశ్నించారు. అమరావతి ముడుపుల కేసులో చంద్రబాబును అరెస్టు చేసి విచారించాలని డిమాండ్ చేశారు.

ది తెనాలి పి అండ్ టి ఎంప్లాయీస్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్, తెనాలి

సర్వసభ్య సమావేశము నోటీసు

తేది:09-09-2023

ది తెనాలి పి అండ్ టి ఎంప్లాయిస్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్, తెనాలి, 60వ వార్షిక సర్వసభ్య సమావేశము ది.02-10-2023న సోమవారం ఉదయం 10-00 గం॥లకు సొసైటీ అధ్యక్షులు బి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరుపబడును.

వేదిక: తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రం, ఎన్.జి.ఓ.హోమ్ ప్రక్కన, కొత్తపేట, తెనాలి.

కావున సొసైటీ సభ్యులందరూ సర్వసభ్య సమావేశమునకు హాజరు కావలసినదిగా తెలియజేయడమైనది.

తెనాలి, 09-09-2023.

సి. హెచ్. భాగ్యరాజు, కార్యదర్శి,
సెల్:8247855517, 08644-229200, 220099

బహిరంగ ప్రకటన
బ్రాంచి ఆఫీసు బదిలీ

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు తమ రిజిష్టర్డు కార్యాలయము, ముంబయి - పూణే రోడ్డు, అకుర్డీ, పూణె - 411035 మరియు కార్పొరేటు కార్యాలయము 4వ అంతస్తు, బజాజ్ ఫిన్ సెర్వ్, విమాన్ నగర్, పూణె - అహ్మద్‌నగర్ రోడ్డు, పూణే, మహారాష్ట్ర-411014 వారు ఇందుమూలముగా తమ ఖాతాదారులకు మరియు సంబంధించిన వారికి తెలియజేయునది ఏమనగా తమ కార్యాలయం **1వ అంతస్తు, శ్రీనివాస క్యాస్టిల్, డి.నెం.22-4-45, ఎస్ ఎన్ పార్క్ రోడ్డు, అష్టలక్ష్మీ గుడి ఎదురుగా, తెనాలి-522201 వారు తేది.16.09.2023** నుండి సదరు కార్యాలయంలో జరిగే గోల్డ్ లోన్ సేవలను మూసివేసి మా నూతన బ్రాంచి చిరునామా **ఎస్.బి.ఐ బ్యాంక్ & ప్రిన్సెస్ హోటల్ ప్రక్కన, గాంధీ చౌక్, తెనాలి-522001** నందు గోల్డ్ లోన్ సేవలు అందుబాటులో ఉంటాయి. గోల్డ్ లోన్ సంబంధిత సేవలు & సందేహాల కొరకు మా బ్రాంచి ఖాతాదారులందరూ మరియు సంబంధించినవారు మార్పు గమనించి మా నూతన గోల్డ్ లోన్ కార్యాలయం **ఎస్.బి.ఐ బ్యాంక్ & ప్రిన్సెస్ హోటల్ ప్రక్కన, గాంధీ చౌక్, తెనాలి-522001** వద్ద ఇప్పటి నుండి సంప్రదించవలెను.

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్
4 వ అంతస్తు, బజాజ్ ఫిన్ సెర్వ్ కార్పొరేట్ ఆఫీస్, పూణె - అహ్మద్ నగర్ రోడ్, విమాన్ నగర్, పూణె, మహారాష్ట్ర 411 014, ఫోన్: 020-71505050
ప్రదేశం : తెనాలి — తేది : 08.09.2023

ఐటి నోటీసుపై చంద్రబాబును విచారించాలి

- రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస/ అమరావతి బ్యూరో

రూ.119 కోట్లకు లెక్కలు చూపకపోవడంతో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఐటి శాఖ నోటీసులు జారీ చేసిందని, చంద్రబాబును తక్షణమే అరెస్టు చేసి విచారణ చేయాలని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా పలాసలోని ప్రగతి భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. టిడిపి పాలనలో కోట్లాది రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. అమరావతి గ్రాఫిక్స్ చూపించారని విమర్శించారు. తన అనుయాయులు, సామాజిక తరగతిని బలంగా తయారు చేసుకునేందుకే అధికారాన్ని ఉపయోగించుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం చంద్రబాబునాయుడు పరిస్థితి ఒలింపిక్స్ క్రీడల్లో పతకం సాధించి డోపింగ్‌లో దొరికిపోయిన చందంగా ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న విషయాలను జాతీయ పత్రికలు రాస్తున్నా, రాష్ట్రంలో పచ్చ మీడియా, కొన్ని ఛానళ్లు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. 2024 ఎన్నికలు చంద్రబాబుకు చిట్టచివరివన్నారు. లోకేష్ పాదయాత్ర ఉదయం ఒక జిల్లా, సాయంత్రం ఒక జిల్లాలో సాగుతోందని, ఇది ఎలా సాధ్యమైందో అర్థం కావడం లేదన్నారు. జన్మభూమి కమిటీల దౌర్జన్యం కావాలా..? సచివాలయ వ్యవస్థ కావాలా..?, వందల హామీలు ఇచ్చి నెరవేర్చని బాబు కావాలా..? ఇచ్చిన హామీలను నెరవేర్చిన జగన్ కావాలో తేల్చుకోవాలని ప్రజలను కోరారు.

మంత్రి అప్పలరాజు

ఐటి నోటీసులపై మౌనం తగదు : వైసిపి

అమరావతి నిర్మాణ కాంట్రాక్టు సంస్థల నుంచి ముడుపుల అందుకున్నట్లు వస్తున్న ఆరోపణల్లో ఐటి ఇచ్చిన నోటీసులపై చంద్రబాబు నాయుడు మౌనం వీడి వాస్తవాలను ప్రజల ముందు వుంచాలని వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కారుమూరి వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఐటి నోటీసులపై చంద్రబాబు మౌనం అర్థాంగీకారమేనని తెలుస్తుందన్నారు. చంద్రబాబు తప్పు చేయకుంటే స్టే తెచ్చుకోకుండా విచారణను ఎదుర్కోవాలని సూచించారు. రాష్ట్రంలో ఐటి నోటీసులపై ఇంత చర్చ జరుగుతున్నా నోరుమెదపకపోవడం సరైందికాదన్నారు.

నోటీసులు రాజకీయాల్లో భాగమే

మళ్లీ టిడిపి నుండే పోటీ : ఎంపి కేశినేని

ప్రజాశక్తి - కంచికచర్ల (ఎన్‌టిఆర్ జిల్లా)

రాష్ట్రాభివృద్ధికి 40 ఏళ్లుగా కష్టపడి నీతి, నిజాయితీతో పనిచేసిన టిడిపి అధినేత చంద్రబాబుకు ఐటి నోటీసులు ఇవ్వడం రాజకీయాల్లో భాగమేనని విజయవాడ ఎంపి కేశినేని నాని కొట్టిపారేశారు. చంద్ర బాబుకు సంబంధించిన వ్యక్తులకు ఆదాయ పన్ను (ఐటి) శాఖ వారు నోటీసులు ఇచ్చినట్లు ఎక్కడో డైరీలో రాసుకుని ఉంటారని, అంత మాత్రాన చంద్రబాబుకు నోటీసులు ఇచ్చినట్లు కాదని అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్లలో శుక్రవారం జరిగిన ఓ ప్రయివేటు కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఒకవేళ నిజంగా ఐటి నోటీసులు వస్తే వాటికి సమాధానం చెప్పే దమ్ము, ధైర్యం, నిబద్ధత చంద్రబాబుకు ఉన్నాయన్నారు. ప్రస్తుతం రాజకీయాలు కలుషితమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిలో భాగంగానే ఐటి నోటీసులు ఇచ్చి చంద్రబాబును ఇబ్బంది పెట్టాలని కొంతమంది లక్ష్యంగా చేసుకుని ఉండొచ్చన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి నుంచే విజయవాడ ఎంపిగా పోటీ చేసి మూడోసారి పార్లమెంట్‌లో అడుగు పెడతానని చెప్పారు. కొంతమంది నాయకుల పనితీరు, పోకడలు నచ్చక సీనియర్లు గత ఎన్నికల ముందు పార్టీని వీడారని, ఇటీవల కాలంలో తన విజ్ఞప్తి మేరకు తిరిగి పార్టీలోకి వచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి వాసిరెడ్డి ప్రసాద్, ఎఎంసి మాజీ ఛైర్మన్ నన్నపనేని లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు దాములూరి మధు, కన్నెగంటి జీవరత్నం, దాసరి ప్రభు తదితరులు పాల్గొన్నారు.

ఎంపి కేశినేని నాని

ఓరిక్స్ లీజింగ్ & ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్
(గతంలో ఒఎయిస్ ఆటో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌గా పేరుగలది)(ఓరిక్స్ ఆటో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సర్వీసెస్ లిమిటెడ్ యొక్క ఒక సబ్సిడరీ)
రిజిష్టర్డు ఆఫీసు: ప్లాట్ నం.94, మరోల్ కొ-ఆపరేటివ్ ఇండస్ట్రీయల్ ఎస్టేట్, అంధేరి-కుర్ల రోడ్, అంధేరి (ఈస్ట్), ముంబయి-400 059
Tel.: + 91 22 2859 5093 / 6707 0100 | Fax: +91 22 2852 8549
Email: info@orixindia.com | www.orixindia.com | CIN: U74900MH2006PLC163937

స్వాధీనతా ప్రకటన
(సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(1))

ఏదైతే, క్రింది సంతకందారు, **ఆరిక్స్ లీజింగ్ & ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(12) ద్వారా సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, తేది **29.10.2021** నాటి నోటీసు జారీచేసి, **మెసర్స్ సూపర్‌వైజ్ ప్రొఫెషనల్స్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు సహ-రుణగ్రహీతలు మామిడి అవనవ గుప్త, మామిడి లక్ష్మి వెంకట నాగ దమయంతి** తాకట్టుదారులును డిమాండ్ నోటీసు తేది నుండి చెల్లించు/రియలైజేషన్ తేది వరకు తదుపరి వడ్డీ& ఇతర చార్జీలతోపాటు సదరు నోటీసు స్వీకరణ 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలు **రూ.2,17,47,011.62 పై.లు (రూపాయలు రెండు కోట్ల పదిహేడు లక్షల నలభై ఏడు వేల పదకొండు మరియు అరవై రెండు పైసలు మాత్రమే)**లను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.

1. రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలకు సదరు నోటీసు బట్వాడాలో వివాదం ఏర్పడి మరియు తదుపరి వడ్డీ& ఇతర చార్జీలతోసహా పూర్తి నోటీసు మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీతలు మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సదరు రూల్స్ యొక్క రూల్ 9తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని ఇందు దిగువ వివరించిన ఆస్తిని **08 సెప్టెంబర్, 2023న స్వాధీనంచేసుకున్నారు.**
2. ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలు మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, డిమాండ్ నోటీసు తేది నుండి చెల్లించు/ రియలైజేషన్ తేదీ వరకు తదుపరి వడ్డీ& ఇతర చార్జీలుతోపాటు **రూ.2,17,47,011.62 పై.లు (రూపాయలు రెండు కోట్ల పదిహేడు లక్షల నలభై ఏడు వేల పదకొండు మరియు అరవై రెండు పైసలు మాత్రమే)**లను చెల్లించుటకులోబడి ఉంటుంది.

ఆస్తి వివరణ

షెడ్యూలు-ఎ ఆస్తి
(పత్రం నం.6015/2008)

వరలక్ష్మి స్ట్రీట్ భవన మూల, లబ్బీపేట్, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర. వద్దగల పాత అసెస్మెంట్ నం.25844/2, ప్రస్తుత అసెస్మెంట్ నం.218503, ఎన్‌టిఎస్ నం.452, బ్లాక్ నం.19, రెవెన్యూ వార్డు నం.10, పాత వార్డు నం.24, కొత్తవార్డు నం.28, మున్సిపల్ నం.39-1-89 గల "కళ్యాణ్ బిల్డింగ్ కమర్షియల్ కాంప్లెక్స్"గా పేరుగల ఇండస్రీయటల్ ఎస్టేట్ కాంప్లెక్స్‌లో 445.15చ.గ.లు లేదా 373.20చ.మీ.ల విస్తీర్ణపు పూర్తి ల్యాండ్‌నకుగాను 35చ.గ.ల విడదీయలేని ల్యాండ్ భాగంతోపాటు సుమారు విస్తీర్ణం 642.76చ.అ.ల సూపర్ బిల్ట్‌అప్ ఏరియాగల 2వ అంతస్తుపై భాగం మొత్తం మరియు సరిహద్దులు: **తూర్పు: సరైన హక్కులతో దారి మరియు ఈ ఒపెన్ టు స్కైకి ప్రక్కన, దక్షిణం: వెండీ ఆస్తి, పడమర: సరైన హక్కులుతో దారి మరియు ఈ ఒపెన్ టు స్కైకి ప్రక్కన, ఉత్తరం: 1/2 విడదీయలేని హక్కులతో ఉమ్మడి కారిడార్.**

షెడ్యూలు-ఎ ఆస్తి
(పత్రం నం.6016/2008)

వరలక్ష్మి స్ట్రీట్ భవన మూల, లబ్బీపేట్, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర. వద్దగల పాత అసెస్మెంట్ నం.25844/2, ప్రస్తుత అసెస్మెంట్ నం.218503, ఎన్‌టిఎస్ నం.452, బ్లాక్ నం.19, రెవెన్యూ వార్డు నం.10, పాత వార్డు నం.24, కొత్తవార్డు నం.28, మున్సిపల్ నం.39-1-89 గల "కళ్యాణ్ బిల్డింగ్ కమర్షియల్ కాంప్లెక్స్"గా పేరుగల ఇండస్రీయటల్ ఎస్టేట్ కాంప్లెక్స్‌లో 445.15చ.గ.లు లేదా 373.20చ.మీ.ల విస్తీర్ణపు పూర్తి ల్యాండ్‌నకుగాను 15చ.గ.ల విడదీయలేని ల్యాండ్ భాగంతోపాటు సుమారు విస్తీర్ణం 1102చ.అ.ల విస్తీర్ణం గల 2వ అంతస్తుపై భాగం మొత్తం మరియు సరిహద్దులు: **తూర్పు: సరైన హక్కులతో దారి మరియు ఈ ఒపెన్ టు స్కైకి ప్రక్కన, దక్షిణం: మెట్లు, బాత్‌రూమ్ గోడ, పడమర: సరైన హక్కులుతో దారి మరియు ఈ ఒపెన్ టు స్కైకి ప్రక్కన, ఉత్తరం: వెండీ ఆస్తి.**

షెడ్యూలు-ఎ ఆస్తి
(పత్రం నం.6017/2008)

వరలక్ష్మి స్ట్రీట్ భవన మూల, లబ్బీపేట్, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర. వద్దగల పాత అసెస్మెంట్ నం.25844/2, ప్రస్తుత అసెస్మెంట్ నం.218503, ఎన్‌టిఎస్ నం.452, బ్లాక్ నం.19, రెవెన్యూ వార్డు నం.10, పాత వార్డు నం.24, కొత్తవార్డు నం.28, మున్సిపల్ నం.39-1-89 గల "కళ్యాణ్ బిల్డింగ్ కమర్షియల్ కాంప్లెక్స్"గా పేరుగల ఇండస్రీయటల్ ఎస్టేట్ కాంప్లెక్స్‌లో 445.15చ.గ.లు లేదా 373.20చ.మీ.ల విస్తీర్ణపు పూర్తి ల్యాండ్‌నకుగాను 30చ.గ.ల విడదీయలేని ల్యాండ్ భాగంతోపాటు సుమారు విస్తీర్ణం 1000చ.అ.ల విస్తీర్ణం గల 2వ అంతస్తుపై భాగం మొత్తం మరియు సరిహద్దులు: **తూర్పు: సరైన హక్కులతో దారి మరియు ఈ ఒపెన్ టు స్కైకి ప్రక్కన, దక్షిణం: మెట్లు, బాత్‌రూమ్ గోడ, పడమర: సరైన హక్కులుతో దారి మరియు ఈ ఒపెన్ టు స్కైకి ప్రక్కన, ఉత్తరం: వెండీ ఆస్తి.**

షెడ్యూలు-ఎ ఆస్తి
(పూర్తి ల్యాండ్)

వరలక్ష్మి స్ట్రీట్ భవన మూల, లబ్బీపేట్, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర. వద్దగల "కళ్యాణ్ బిల్డింగ్ కమర్షియల్ కాంప్లెక్స్"గా పేరుగల ఇండస్రీయటల్ ఎస్టేట్ కాంప్లెక్స్‌లో పాత అసెస్మెంట్ నం.25844/2, ప్రస్తుత అసెస్మెంట్ నం.218503, ఎన్‌టిఎస్ నం.452, బ్లాక్ నం.19, రెవెన్యూ వార్డు నం.10, పాత వార్డు నం.24, కొత్తవార్డు నం.28, మున్సిపల్ నం.39-1-89 గల 445.15చ.గ.లు లేదా 373.20చ.మీ.ల విస్తీర్ణపు పూర్తి ల్యాండ్ మొత్తం మరియు సరిహద్దులు: **తూర్పు: జి. జయశ్రీ ఆస్తి, దక్షిణం: వి. జయంతి ఆస్తి, పడమర: వరలక్ష్మి స్ట్రీట్‌గా పిలువబడు మున్సిపల్ రోడ్, ఉత్తరం: మహాత్మ గాంధీ రోడ్‌గా పిలువబడు మున్సిపల్ రోడ్డు.**

తేదీ: 08.09.2023
ప్రదేశం: విజయవాడ
రుణ ఖాతా నం. : LN0000000010815

సం/-
అధీకృత అధికారి,
ఆరిక్స్ లీజింగ్ & ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్

ఐకెఎఫ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
IKF Home Finance
ప్లాట్ నెం.30/ఏ, సర్వేనెం.83/1, మై హోమ్ ట్విట్జా, 11వ అంతస్తు, డైమాండ్ హిల్స్, లుంబిని అవెన్యూ 400/20/132కెవి జిఐఎస్ సబ్‌స్టేషన్ ప్రక్కన, ఎపిఐఐసి హైదరాబాద్ నాలెడ్జ్ సిటి, రాయిదుర్గ్, హైదరాబాద్-081, ఫోన్: 040-23412083.

స్థిరాస్తుల విక్రయం కొరకు అమ్మకం ప్రకటన
అనుబంధం-IV-ఎ [రూల్ 9(1)తో చదవగల రూల్ 8(6) నిబంధన చూడండి]

ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నిబంధనలతో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల యొక్క అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం నోటీసు.

13) 1% టిడిఎస్ వర్తించబడును మరియు గరిష్టంగా ప్రకటించిన బిడ్ మొత్తం మీద అత్యధిక బిడ్డర్ ద్వారా చెల్లించబడుతుంది. యజమాని/రుణగ్రహీత(లు) యొక్క పాన్‌లో అత్యధిక బిడ్డర్ ద్వారా పేమెంట్ చెల్లించాల్సిన అవసరం ఉంటుంది మరియు ఒక చలాన్ కాపీ మా కంపెనీకి దాఖలు చేయాల్సి ఉంటుంది.
14) పై వివరాలకు సెక్యూర్డ్ క్రెడిటార్'స్ వెబ్‌సైట్ **http://surl.li/kqiup** లో పొందుపరిచిన క్రింది లింక్‌ను చూడవచ్చు.
15. దయచేసి **https://www.tatacapital.com/property-disposal.html** లింక్‌ని కూడా సందర్శించండి.
దయచేసి గమనించండి టిసిహెచ్‌ఎఫ్ఎల్ ఈ ఆస్తి అమ్మకం/ వేలం కోసం పేర్కొన్న వేలం భాగస్వామితో పాటు ఏ బ్రోకర్/ఏజెంట్‌ను నిమగ్నం చేయలేదు. ఆసక్తి ఉన్న పార్టీలు ఈ విషయంలో అన్ని సందేహాలు మరియు విచారణల కోసం దిగువ సంతకం చేసిన ఆధీకృత అధికారిని మాత్రమే సంప్రదించాలి.

ప్రదేశం: ఆంధ్రప్రదేశ్
తేది: 09.09.2023
సం/- అధీకృత అధికారి
టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఏడు స్థానాల్లో నాలుగింట 'ఇండియా' గెలుపు

త్రిపురలో రిగ్గింగ్‌తో గట్టెక్కిన బిజెపి

ఉత్తరప్రదేశ్‌లో ఘోర పరాభవం

కేరళలో కాంగ్రెస్‌కు 'సానుభూతి'

న్యూఢిల్లీ : ఆరు రాష్ట్రాల్లో ఏడు శాసనసభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో ప్రతిపక్ష 'ఇండియా' ఫోరం పార్టీలు 4 స్థానాల్లో విజయం సాధించాయి. బిజెపి మూడు స్థానాల్లో గెలుపొందింది. కాంగ్రెస్, జెఎంఎం, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ ఒక్కొక్క స్థానాన్ని కైవసం చేసుకున్నాయి.

అధికార దుర్వినియోగంతో పోలింగ్ కేంద్రాలను ఆక్రమించి బిజెపి రిగ్గింగ్‌కు పాల్పడినట్లు విమర్శలు ఎదుర్కొన్న త్రిపురలోని ధనపుర్, బొక్సానగర్.. రెండు స్థానాల్లోనూ ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. దీంతో పాటు ఉత్తరాఖండ్‌లోని భగేశ్వర్ స్థానంలోనూ కాషాయ పార్టీ గెలుపొందింది. కాగా పశ్చిమ బెంగాల్‌లోని ధూప్‌గురి స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో తృణమూల్ కాంగ్రెస్ విజయం సాధించింది. త్రిపురలో హింసాకాండపై ఎన్నికల సంఘానికి ఇప్పటికే ఫిర్యాదు చేసిన సిపిఎం ఓట్ల లెక్కింపును కూడా బహిష్కరించిన సంగతి తెలిసిందే. కాగా జార్ఖండ్‌లోని దుమ్రి స్థానంలోనూ, ఉత్తరప్రదేశ్‌లోని ఘోసి స్థానంలోనూ ప్రతిపక్ష 'ఇండియా' ఫోరం బిజెపిని మట్టి కరిపించాయి. దుమ్రిలో జెఎంఎం, ఘోసిలో సమాజ్‌వాదీ పార్టీ విజయఢంకా మోగించాయి. ఇది మతతత్వ రాజకీయాలపై ప్రగతిశీల రాజకీయాలకు దక్కిన విజయమని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ అభివర్ణించారు. 'ఇండియా' విజయం దిశగా భారత్ ప్రయాణానికి ఇది తొలి అడుగు అని ఆయన తెలిపారు.

జార్ఖండ్ : జార్ఖండ్‌లో దుమ్రి స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) అభ్యర్థి బేబీ దేవీ ఎజెఎస్‌యు అభ్యర్థి యశోదా దేవీపై 17 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. బేబీ దేవీకి 1,35,480 ఓట్లు లభించగా, యశోదాకు 1,18,380 ఓట్లు లభించాయి. జార్ఖండ్ మాజీ మంత్రి జగరన్నాథ్ మహతో మరణంతో ఇక్కడ ఉప ఎన్నిక నిర్వహించారు. బేబీ దేవీ జగరన్నాథ్ భార్య.

పశ్చిమ బెంగాల్‌లోని ధూప్‌గురి ఉప ఎన్నికలో తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి, కాలేజీ ప్రొఫెసర్ నిర్మలచంద్ర రాయ్ 4,313 మెజార్టీతో విజయం సాధించారు. ఆయనకు 96,961 ఓట్లు లభించాయి. ఈ స్థానంలో 2021లో జమ్ముకాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాద దాడుల్లో మరణించిన సిఆర్‌పిఎఫ్ జవాను భార్య తాపసి రాయ్‌ని బరిలో నిలిపి సానుభూతి ఓట్లతో గెలవాలని బిజెపి వ్యూహం పన్నినా ఆ పార్టీ రెండో స్థానానికి పరిమితమైంది. బిజెపికి 92,648 ఓట్లు లభించినట్లు అధికారులు తెలిపారు. సిపిఎం నుంచి పోటీ చేసిన ఈశ్వరచంద్ర రాయ్‌కి 13,666 ఓట్లు లభించాయి.

ఉత్తరాఖండ్‌లోని భగేశ్వర్ స్థానంలో బిజెపి అభ్యర్థి పార్వతి దాస్ సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి బసంత్ కుమార్‌పై 2400 ఓట్ల తేడాతో గెలుపొందారు. బిజెపి నేత చందన్‌రామ్‌దాస్ మృతితో ఇక్కడ పోలింగ్ అనివార్యమైంది. పార్వతిదాస్ ..చందన్ భార్య కావడంతో సానుభూతితో ఆమె విజయం సాధించారు.

ఉత్తరప్రదేశ్‌లోని ఘోషి స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో బిజెపి ఘోర పరాభవాన్ని చవిచూసింది. సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి సుధాకర్ సింగ్ సమీప ప్రత్యర్థి అయిన బిజెపి నేత దారా సింగ్ చౌహాన్‌పై విజయం సాధించారు. అయితే ఈ వార్త రాసే సమయానికి అధికారికంగా ధ్రువీకరించలేదు. 2022లో ఈ స్థానం నుంచి సమాజ్‌వాదీ పార్టీ తరుపన పోటీ చేసి గెలుపొందిన దారాసింగ్ ఆ తర్వాత బిజెపి గూటికి చేరారు. అయితే ఈ దఫా ఆయనకు ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాలైన అప్నాదళ్ (సోనేలాల్), నిర్బల్ ఇండియన్ సోషిత్ హమారా ఆమ్ దళ్ (నిషద్) పార్టీ, సుహేల్ దేవ్ భారతీయ సమాజ్ పార్టీ మద్దతు ఇచ్చాయి. సమాజ్‌వాది పార్టీకి ఇండియా ఫోరం పార్టీలు కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, ఆర్‌ఎల్‌డి, ఆప్, సిపిఐ(ఎంఎల్)- లిబరేషన్, సుహేల్ దేవ్ స్వాభిమాన్ పార్టీ మద్దతు ఇచ్చాయి.

త్రిపురలో రిగ్గింగ్ !

త్రిపురలో తీవ్ర హింసాకాండ చోటుచేసుకున్న బొక్సానగర్‌లో 66 శాతం (30237) ఓట్ల భారీ మెజార్టీతో బిజెపి అభ్యర్థి తఫాజ్జల్ హోస్సాయిన్ గెలుపొందారు. ఆయనకు మొత్తం 34,146 ఓట్లు రాగా సిపిఎం అభ్యర్థికి 3,909 ఓట్లే వచ్చాయి. పోలింగ్ కేంద్రాలను ఆక్రయించి రిగ్గింగ్‌కు పాల్పడ్డారన్న విమర్శలకు ఈ భారీ మెజార్టీ లభించడం బలం చేకూర్చుతోందని విశ్లేషకులు పేర్కొన్నారు. సిపిఎంకు కంచుకోటగా ఉన్న ఈ ప్రాంతంలో 4 వేలు లోపే ఓట్లు లభించడం అధికార పార్టీ స్థానిక నేతలను సైతం విస్మయానికి గురి చేసింది. ఇదే రాష్ట్రంలోని రెండో స్థానమైన ధనపుర్ స్థానంలోనూ బిజెపి అభ్యర్థి బిందు దేవనాథ్ 18,871 భారీ ఓట్ల వ్యత్యాసంతో విజయం సాధించారు. ఆయనకు 30017 ఓట్లు లభించగా సమీప ప్రత్యర్థి సిపిఎం నేత కౌశిక్ చంద్రకు 11,146 ఓట్లు లభించాయి. తీవ్రస్థాయిలో ఎన్నికల అక్రమాలకు బిజెపి పాల్పడిన నేపథ్యంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియను సిపిఎం బహిష్కరించింది. ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదు చేసింది. బొక్సానగర్‌లో సిపిఎం ఎమ్మెల్యే శ్యామూల్ హక్ మృతి కారణంగా ఉప ఎన్నిక నిర్వహించారు. ధనపుర్ ఎమ్మెల్యేగా ఉన్న ప్రతిమా భౌమిక్‌ను కేంద్ర మంత్రిగా నియమించిన నేపథ్యంలో రాజీనామా చేయగా అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది.

పుతుప్పల్లిలో చాందీ ఊమెన్ విజయం

కేరళలో మాజీ ముఖ్యమంత్రి ఊమెన్ చాందీ మృతితో ఉప ఎన్నిక నిర్వహించిన పుతుప్పల్లిలో ఆయన కుమారుడు, యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థి చాందీ ఊమెన్ 37,719 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. కొట్టాయం జిల్లాలో కాంగ్రెస్‌కు పెట్టనికోటగా వున్న ఈ నియోజకవర్గానికి ఊమెన్ చాందీ 1970 నుండి ఈ ఏడాది జులై 18న మరణించేవరకు ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చారు. ఆయన మృతితో ఈ సీటుకు ఉప ఎన్నిక అవసరమైంది. సిపిఎంకి చెందిన ఎల్‌డిఎఫ్ అభ్యర్థి జైక్ సి.థామస్ 41,644 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. బిజెపి అభ్యర్థి లిజిన్ లాల్‌కు కేవలం 6,447 ఓట్లు లభించాయి. మూడవ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఆప్ అభ్యర్థి లూక్ థామస్‌కు 829ఓట్లు లభించాయి. ఊమెన్ చాందీ మృతి పట్ల ప్రజల్లో సానుభూతి నెలకొనడంతో ఆయన కుమారుడు విజయం సాధించారు. తన ఈ విజయం తండ్రిదేనని, ఆయన 13వసారి విజయం సాధించారని చాందీ ఊమెన్ వ్యాఖ్యానించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎం.వి.గోవిందన్ మాట్లాడుతూ, బిజెపి ఓట్లలో ప్రధాన వాటా యుడిఎఫ్‌కు అనుకూలంగా పడ్డాయన్నారు. 'సానుభూతి గురించి మాకు తెలుసు, ఈ విజయానికి గల కారణాలను సిపిఎం పరిశీలిస్తుంది. ఈ సానుభూతి పవనాలు వీస్తున్నపుడు కూడా పుతుప్పల్లిలో ఎల్‌డిఎఫ్ రాజకీయ పునాదులు చెక్కుచెదరలేదు." అని వ్యాఖ్యానించారు.

ఉత్తరప్రదేశ్‌లో విజయోత్సవాలు జరుపుకుంటున్న సమాజ్‌వాదీ పార్టీ కార్యకర్తలు

బిజెపితో జెడిఎస్ పొత్తు

బెంగళూరు : వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కర్ణాటకలో జెడి(ఎస్), బిజెపి మధ్య పొత్తు ఖరారైంది. జెడిఎస్‌కు 4 స్థానాలు కేటాయించేందుకు బిజెపి అంగీకరించింది. బిజెపి నేత, కర్ణాటక మాజీ సిఎం బిఎస్ యడ్యూరప్ప శుక్రవారం ఈ విషయాన్ని ధ్రువీకరించారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి రాష్ట్రంలో బిజెపి, జెడి(ఎస్) మధ్య పొత్తు ఖరారైందని తెలిపారు. జెడి(ఎస్)కు నాలుగు లోక్‌సభ సీట్లు ఇచ్చేందుకు అమిత్ షా అంగీకరించారని ఆయన చెప్పారు. జెడి(ఎస్) అధినేత హెచ్‌డి దేవెగౌడ ఇటీవల బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిశారు. బిజెపి, జెడి(ఎస్) మధ్య పొత్తు గురించి ఈ సందర్భంగా ఒక స్పష్టత వచ్చింది. మాండ్య, హసన్, బెంగళూరు (రూరల్), చిక్‌బల్లాపూర్ స్థానాలను జెడి(ఎస్) కోరింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కర్ణాటకలోని మొత్తం 28 ఎంపి స్థానాల్లో బిజెపి సొంతంగా 25 స్థానాల్లో గెలిచింది. స్వతంత్ర అభ్యర్థి విజయానికి సహకరించడం ద్వారా 26 సీట్లు దక్కించుకుంది. కాంగ్రెస్, జెడి(ఎస్) చెరొక సీటులో విజయం సాధించాయి. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఘోర పరాజయం పాలైన సంగతి విదితమే.

ఆధార్ అప్‌డేట్ గడువు పొడిగింపు

న్యూఢిల్లీ : యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యుఐడిఎఐ) ఆధార్‌ను ఉచితంగా అప్‌డేట్ చేసుకునేందుకు గడువును మరో మూడు నెలలు పాటు పొడిగించింది. ప్రస్తుతం గడువు సెప్టెంబరు 14తో ముగియనున్న నేపథ్యంలో డిసెంబరు 14 వరకు ఉచితంగా అప్‌డేట్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఆధార్ యూజర్ల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు డిసెంబరు 14 వరకు పొడిగించాలని నిర్ణయించినట్లు పేర్కొంది. సాధ్యమైనంత వరకు ఎక్కువ మంది ఆధార్‌కార్డును అప్‌డేట్ చేసుకునేలా ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. మై ఆధార్ పోర్టల్ ద్వారా ఉచితంగా ఆధార్ డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పింది. అలాగే ఆధార్ జారీ పదేళ్లు దాటిన వారి వివరాలను మళ్లీ అప్‌డేట్ ప్రక్రియను యుఐడిఎఐ ప్రారంభించింది. అడ్రస్, వ్యక్తిగత వివరాలు మార్చుకోవాలనునేవారు అందుకు సంబంధించిన ఐడి ప్రూఫ్, అడ్రస్ ప్రూఫ్ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. సాధారణంగా ఈ వివరాలను అప్డేట్ చేసుకోవాలంటే ఆధార్ కేంద్రాలకు వెళ్లి రూ.50 వరకు చెల్లించాల్సి ఉంటుంది. డిసెంబరు 14 వరకు డబ్బులు చెల్లించాల్సిన పని లేదు. myaadhaar.uidai.gov.in వెబ్‌సైట్‌లోనూ ఉచితంగానే ఆధార్ వివరాలు అప్‌డేట్ చేసుకోవచ్చు.

కులవివక్షకు పాల్పడుతున్న మోడీ : కాంగ్రెస్

న్యూఢిల్లీ : జి-20 సమావేశాల సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇవ్వనున్న విందుకు సంబంధించిన ఆహ్వాన లేఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గేకు అందలేదు. దీంతో ప్రధాని మోడీపై ఆ పార్టీ విమర్శలు గుప్పిస్తోంది. ప్రధాని మోడీ కులవివక్షకు పాల్పడుతున్నట్లు ఆ పార్టీ ఆరోపించింది. 'మోడీ హై తో మను హై' అంటూ కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారు. తమిళనాడుకు చెందిన కాంగ్రెస్ నేత మోహన్ కుమారమంగళం ప్రధాని మోడీపై ఘాటు విమర్శలు చేశారు. మహర్షి మనువు సిద్ధాంతాలను ప్రధాని మోడీ పాటిస్తున్నట్లు ఆరోపించారు. మను మహర్షి సూత్రాలను మోడీ అవలంభిస్తున్నట్లు కుమారమంగళం విమర్శించారు. అందుకే దళిత నేత అయిన మల్లిఖార్జున్ ఖర్గేను జి-20 విందుకు ఆహ్వానించలేదని అన్నారు. అయోధ్యలో భూమి పూజకు ఆనాటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను ఆహ్వానించలేదని, ఇక కొత్త పార్లమెంటు భవనం ఓపెనింగ్ సెర్మనీకి రాష్ట్రపతి ముర్మును ఆహ్వానించలేదని కుమారమంగళం ఆరోపించారు.

మణిపూర్‌లో మళ్లీ హింస

ఇంఫాల్ : ఈశాన్య రాష్ట్రం మణిపూర్ లో శుక్రవారం మరోసారి హింస చెలరేగింది. తెంగ్నౌపాల్ జిల్లాలోని పల్లెల్ పట్టణంలో సాయుధ స్థానికులు , భద్రతా బలగాల మధ్య భారీ ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి.ఈ ఘటనలో ఇద్దరు మరణించగా.. 20 మందికిపైగా గాయపడినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం అక్కడ ఎదురుకాల్పులు కొనసాగుతున్నట్లు తెలిపాయి. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి అస్సాం రైఫిల్స్, మణిపూర్ పోలీసులతో కూడిన భద్రతా బలగాలు తీవ్రంగా శ్రమిస్తున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో టియర్ గ్యాస్ ప్రయోగించడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొన్నట్లు పేర్కొన్నారు.

దమ్ముంటే రాజ్యాంగాన్ని మార్చండి : ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్ : భారత్-ఇండియా పేరు వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దమ్ముంటే రాజ్యాంగాన్ని మార్చాలని మోడీ సర్కారుకు నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా సవాల్ విసిరారు. దేశం పేరు మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణకు పూనుకుంటే ఏ ఒక్కరూ ప్రభుత్వానికి మద్దతు పలకరని నేషనల్ కాన్ఫరెన్స్ నేత స్పష్టం చేశారు. దేశం పేరు మార్చడం అంత సులభం కాదని అన్నారు. కేంద్రానికి అంత ధైర్యం ఉంటే రాజ్యాంగాన్ని మార్చాలని, మీకు ఎవరు మద్దతిస్తారో తాము చూస్తామని ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు.

లడఖ్‌లో అక్టోబర్ 4న ఎన్నికలు

- షెడ్యూల్ విడుదల

లెహ్ : కేంద్రపాలిత ప్రాంతం లడఖ్‌లో అక్టోబర్ 4న ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు గురువారం నోటిఫికేషన్ విడుదలైంది. దీని ప్రకారం... సెప్టెంబర్ 9న నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ సెప్టెంబర్ 16. నామినేషన్లను పరిశీలన సెప్టెంబర్ 18న నిర్వహించనున్నట్లు తెలిపింది. నామినేషన్ల ఉపసంహరణకు సెప్టెంబర్ 20 చివరి తేదీ కాగా, అక్టోబర్ 4 ఓటింగ్‌ను నిర్వహిస్తారు. అక్టోబర్ 8న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు నోటిఫికేషన్ పేర్కొంది.నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుండి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంతవరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందని.. నోటిఫికేషన్‌లో పేర్కొంది. కార్గిల్ జిల్లా మొత్తం కూడా వర్తిస్తుందని పేర్కొంది.

నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) అభ్యర్థులు నాగలిని ఎన్నికల గుర్తుగా వినియోగించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ నేతృత్వంలోని పరిపాలక యంత్రాంగం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఎన్‌సీ అభ్యర్థులు తమ పార్టీ గుర్తును కొనసాగించవచ్చని తెలిపింది. యూటీ పరిపాలక యంత్రాంగాన్ని చీవాట్లు పెట్టడంతో పాటు లక్షరూపాయల జరిమానా విధించింది. అలాగే ఎన్నిక నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ.. తాజా ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించాలని ఆదేశించింది. తీర్పు వెలువడిన వారం రోజుల లోపు ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసింది.

లడఖ్ కేంద్ర పాలిత ప్రాంతంలో భాగమైన కార్గిల్‌లో 26 నియోజకవర్గాల్లో ఓటింగ్ జరగనుంది. ఓటింగ్ కోసం అధికారులు 278 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఆర్టికల్ 370 , 35ఎను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన అనంతరం కార్గిల్‌లో అక్టోబర్‌లో పోలింగ్ జరగనున్నది. చివరి సారిగా ఎల్ఎహెచ్‌డీసీ -కార్గిల్‌లో 2018లో ఎన్నికలు జరిగాయి. అభివృద్ధి, పరిపాలన, పర్వత ప్రాంతాలపై స్థానిక ప్రాతినిధ్యం వహించనున్న 30 మంది సభ్యులతో కూడిన పాలకమండలి కోసం 89 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు.

అమెరికా సైనిక గుత్తాధిపత్యం ప్రపంచ శాంతికి ముప్పు

- రష్యా రాజకీయ నిపుణుడి వ్యాఖ్య

మాస్కో : అమెరికా సైనిక గుత్తాధిపత్యం అంతర్జాతీయ శాంతి భద్రతలకు ఒక ముప్పుగా పరిణమించిందని రష్యన్ రాజకీయ నిపుణుడు దిమిత్రి సుస్లోవ్ వ్యాఖ్యానించారు. తన విస్తరణ విధానాలతో, అక్రమ సైనిక జోక్యాలతో, ఇతర దేశాల భద్రత, సుస్థిరతలను దెబ్బతీయడం ద్వారా అమెరికా సుదీర్ఘకాలంగా తన సైనిక గుత్తాధిపత్యాన్ని పెంచి పోషించుకోవడానికి ప్రయత్నిస్తోందని ఆయన పేర్కొన్నారు. మాస్కోలోని నేషనల్ రీసెర్చ్ యూనివర్శిటీ హయ్యర్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో అంతర్జాతీయ అధ్యయనాల కేంద్ర డిప్యూటీ డైరెక్టర్‌గా దిమిత్రి వున్నారు.అమెరికా సైనిక గుత్తాధిపత్యానికి సంబంధించిన మూలాలు, వాస్తవాలు, ప్రమాదాలు అన్న శీర్షికతో జిన్హువా ఇనిస్టిట్యూట్ ఒక

నివేదికను మంగళవారం విడుదల చేసింది. ఆ నివేదిక విడుదల కార్యక్రమంలో దిమిత్రి సుస్లోవ్ కూడా పాల్గొన్నారు. "అమెరికా సైనిక గుత్తాధిపత్యం ప్రపంచానికి శాంతి సుస్థిరతలను తీసుకురాదు. పైగా దీనికి విరుద్ధంగా అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తూ, అక్రమంగా సైనిక ఉల్లంఘనలకు పాల్పడుతుంది" అని ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు. 1999లో యుగోస్లోవియాపై నాటో బాంబు దాడులు, 2003లో ఇరాక్‌పై దండయాత్ర, 2011లో లిబియాపై నాటో దాడి వంటి సంఘటనలతో అనేక విషాదకరమైన పర్యవసానాలు సంభవించాయని అన్నారు. ఇతర దేశాలతో ఘర్షణేతర సమాన స్థాయి సంబంధాలు అన్న అంశాన్ని అమెరికా కనీసం ఊహించను కూడా ఊహించలేదని ఆయన విమర్శించారు.

ఉత్తర మాలిలో ఉగ్రవాద దాడులు

- 49 మంది పౌరులు, 15 మంది సైనికులు మృతి

బమకో : ఉత్తర మాలిలో జరిగిన రెండు ఉగ్రవాద దాడుల్లో 49 మంది పౌరులు, 15 మంది సైనికులు మరణించారని మాలి ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రజలను లక్ష్యంగా చేసుకునే ఈ రెండు దాడులు జరిగాయని గ్రూప్ టు సపోర్ట్ ఇస్లామ్ అండ్ ముస్లిమ్స్ (జిఎస్ఐఎం) తెలిపింది. గావో రీజియన్‌లో మాలి సాయుధ బలగాల సైనిక శిబిరాన్ని, ప్రయాణికుల బోటును లక్ష్యంగా చేసుకున్నట్లు ప్రభుత్వం ఆ ప్రకటనలో తెలిపింది. "ఉగ్రవాద దాడులు జరిగిన నేపథ్యంలో వైమానిక, పదాతి దళాలు సత్వరం స్పందించి దాదాపు 50 మంది ఉగ్రవాదులను అదుపులోకి తీసుకున్నట్లు ప్రభుత్వ ప్రకటన పేర్కొంది. ప్రయాణికులందరినీ తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తెలిపింది. దాడులు జరిగిన కొద్ది గంటల తర్వాత మాలి తాత్కాలిక అధ్యక్షులు అసిమి గొయిటా

మాట్లాడుతూ, గురువారం నుండి మూడు రోజుల పాటు జాతీయ సంతాప దినాలు పాటిస్తున్నట్లు ప్రకటించారు. 2012 నుండి చొరబాట్లు, కమ్యూనిటీల మధ్య హింసాకాండ, తీవ్రవాద కార్యకలాపాలతో మాలి ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఈ హింసలో వేలాదిమంది ప్రజలు మరణించగా, వేలాదిమంది నిర్వాసితులయ్యారు.

చైనాలో మదురో పర్యటన

కారకస్ : వెనిజులా అధ్యక్షులు నికొలస్ మదురో శుక్రవారం నుండి చైనాలో అధికార పర్యటన జరుపుతున్నారు. 14వరకు ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. చైనా అధ్యక్షులు షీ జిన్‌పింగ్ ఆహ్వానం మేరకు మదురో శుక్రవారం బయలుదేరి షెంఝాన్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి ఈ పర్యటన ఉపయోగపడుతుందని మదురో వ్యాఖ్యానించారు. కొత్త ప్రపంచ భౌగోళిక రాజకీయాలను నిర్మించడానికి ఉపయోగపడుతుందని అన్నారు. కాగా మదురో అధికార పర్యటన ఎజెండా, వివరాలను చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి వెల్లడించలేదు. మదురో 2018 సెప్టెంబరులో చివరిసారిగా చైనాలో పర్యటించారు. గురువారం వెనిజులా ఉపాధ్యక్షురాలు డెల్సీ రొడ్రిగజ్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి లు ద్వైపాక్షిక అంశాలను సమీక్షించిన మరుసటిరోజు మదురో పర్యటన ప్రారంభమైంది. ఇరు దేశాల మధ్య ఉన్నత స్థాయిలో దౌత్య సంబంధాలు మరింత సంఘటితం కావాలని ఇరు పక్షాలు అభిప్రాయపడ్డాయని చైనా విదేశాంగ శాఖ పేర్కొంది.

ఇండియా కూటమికి భయపడే తెరపైకి భారత్

- మోడీ సర్కారుపై రాహుల్ గాంధీ విమర్శ

లండన్ : యూరప్ పర్యటనలో బిజీగా ఉన్న కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఇండియా-భారత్ పేరు మార్పు వివాదంపై మోడీ సర్కారు లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. విపక్ష ఇండియా కూటమిని చూసి పాలక బిజెపికి వణుకు మొదలైందని, అందుకే దృష్టి మళ్లించే ఎత్తుగడలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ఇండియా.. అనగా భారత్ అనేది సరైన పదమని, మనం ఎవరనేది ఇది తెలియచెబుతుందని అన్నారు. అయితే ప్రభుత్వంలో భయం పట్టుకుందని, నా దృష్టిలో పేరు మార్పు వ్యవహారం భయం నుంచి వచ్చిన స్పందన అని రాహుల్ పేర్కొన్నారు. బెల్జియంలోని బ్రసెల్స్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు.

మోడీ సర్కారుపై తమ పార్టీ అదానీ వ్యవహారం, క్రోనీ క్యాపిటలిజంపై విరుచుకుపడినప్పుడల్లా ఆయన ప్రజల దృష్టిని మరల్చేందుకు సరికొత్త డ్రామాతో ముందుకొస్తారని విమర్శించారు. విపక్ష కూటమి పేరు ఇండియా ఇప్పుడు మోడీ ప్రభుత్వంలో వణుకు పుట్టిస్తోందని అన్నారు. ఇండియా కూటమి పేరు ప్రధానిని చికాకు పెడుతున్నదని, అది ఎంతగా అంటే దేశం పేరు మార్చేటంతగా అంటూ వ్యాఖ్యానించారు. దేశాన్ని ఇండియా-భారత్ అని రెండు పేర్లతో పిలవడం అద్భుతమైన ఆలోచన అని రాహుల్ పేర్కొన్నారు.

ఇండియా రాష్ట్రాల సమాఖ్య అని రాజ్యాంగం పేర్కొందని, తన సభ్యులతో సంప్రదింపులు జరపడం ద్వారా సమాఖ్యను బలోపేతం చేయడం కీలకమని అన్నారు. దేశ భవితవ్యాన్ని మార్చేందుకు కాషాయ సర్కారు కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారాన్ని కేంద్రీకృతం చేయాలని, సంపద కొద్దిమందికే పరిమితం చేయాలని, భారత ప్రజల మధ్య సంప్రదింపులను నియంత్రించాలన్నది బిజెపి విజన్ అని దుయ్యబట్టారు. దేశంలో గాంధీ, గాడ్సే విజన్‌ల మధ్య పోరాటం జరుగుతున్నదని రాహుల్ అభివర్ణించారు. దేశంలో ప్రజాస్వామిక వ్యవస్థలను కాపాడుకుంటూ ప్రజల గొంతుకగా నిలవాలన్నదే తమ పార్టీ ఆకాంక్ష అని అన్నారు.

మహిళల తెగువ దేశానికే ఆదర్శం

- పశ్చిమబెంగాల్‌లో ఐద్వా ర్యాలీలో బృందా కరత్

కొల్‌కతా : పంచాయతీ ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ బీభత్సాన్ని ఎదుర్కొని మహిళలు సాగించిన పోరాటం యావత్ దేశానికే ఆదర్శమని ఆల్ ఇండియా డెమోక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్ అఖిల భారత నాయకత్వం కొనియాడింది. మహిళా సంఘం పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కమిటీ శుక్రవారం రాణి రసమణి అవెన్యూలో 'ప్రతిఘటన ర్యాలీ'కి పిలుపునిచ్చింది. ఆ ర్యాలీలో వక్తలుగా సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కరత్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇదే అసలైన ప్రతిఘటన' రోజు అని అభివర్ణించారు. ఇక్కడకు వచ్చిన వారిలో అమరవీరుల కుటుంబానికి చెందిన మహిళలు ఉన్నారు. తమ వారిని కోల్పోయి.. దుఃఖంలో ఉండి కూడా ఈ సభకు రావడానికి ధైర్యం చూపించారు. భవిష్యత్తులో పోరాటానికి అండగా ఉంటానని బృందాకరత్ వారికి భరోసా ఇచ్చారు. బెంగాల్ పోరాటం యావత్ దేశానికే ఆదర్శమని పేర్కొన్నారు.పంచాయతీ ఎన్నికల్లో మహిళల పాత్రను ప్రశంసిస్తూ బందా కారత్ మాట్లాడుతూ.. "మీరు పంచాయతీ ఎన్నికల్లో పోరాడి అభ్యర్థులుగా నిలిచారు. ఓటు వేసే వరకు పోరాటంలోనే ఉన్నారు. రకరకాల చిత్రహింసల తర్వాత పోరాటాన్ని విరమించుకోలేదు. కొన్ని చోట్ల గెలిచారు. ఇంకొన్ని చోట్ల ఓడిపోయారు. కానీ సీపీఐ(ఎం) దృష్టిలో మీరు గెలిచారు" అని అన్నారు.

రాష్ట్రంలో తృణమూల్, బీజేపీ శక్తులకు వ్యతిరేకంగా వామపక్షాలు పోరాడాలి. అంటే "మీరు రెండు యుద్ధాలు చేయాలి" అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి కనినికా ఘోష్, మరియం ధావ్లే, పీకే శ్రీమతి తదితరులు ప్రసంగించారు.

ఉత్తరప్రదేశ్‌లో దారుణం

- దళిత మహిళపై సామూహిక అత్యాచారం

లక్నో : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో దారుణం చోటుచేసుకుంది. దళిత సామాజిక వర్గానికి చెందిన ఓ మహిళపై ఇద్దరు యువకులు సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. ఈ దుశ్చర్యను వీడియో తీశారు. ఈ ఘటన బరేలీ జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బరేలీ జిల్లాకు చెందిన దళిత యువతి తన స్నేహితురాలికి కొంత డబ్బును అప్పుగా ఇచ్చింది. దాన్ని తిరిగి ఇవ్వాలని కోరింది. దీంతో సెప్టెంబరు 2న ఓ కేఫ్‌కు రావాలని దళిత యువతికి స్నేహితురాలు ఫోన్ చేసి చెప్పడంతో ఆ యువతి అక్కడకు వెళ్లింది. అయితే, అప్పటికే తన స్నేహితురాలితో పాటు మరో ఇద్దరు యువకులు కూడా అక్కడ ఉన్నారు.

వీరు ముగ్గురూ కలిసి దళిత యువతిని ఓ హోటల్‌కు తీసుకెళ్లారు. అనంతరం ఇద్దరు యువకులు దళిత యువతిపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ తతంగాన్నంతా వీడియో తీశారు. ఆ వీడియోను అడ్డుపెట్టుకుని ఆమెను బెదిరించడం మొదలుపెట్టారు. రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆమె ఇవ్వకపోవడంతో ఆ వీడియోను యువతికి కాబోయే భర్తకు పంపించారు. దీంతో విసిగిపోయిన ఆ యువతి పోలీసులను ఆశ్రయించింది. తనకు జరిగిన అన్యాయం గురించి పోలీసులకు వివరించింది. ఈ మేరకు నిందితులపై కేసు పెట్టింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌సి, ఎస్‌టి చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితులందరినీ అరెస్టు చేశారు.

బిజీబిజీగా మోడీ !

న్యూఢిల్లీ : భారత్ ఆతిథ్యంలో శని, ఆదివారాల్లో ఇక్కడ జరుగుతున్న జి-20 సదస్సు కోసం ఇప్పటికే వివిధ దేశాల నేతలు, ప్రతినిధులు ఢిల్లీకి చేరుకున్నారు. మరోవైపు భారత్‌కు విచ్చేసిన పలువురు నేతలతో ప్రధాని నరేంద్ర మోడీ ద్వైపాక్షిక చర్చలు జరుపుతూ బిజీబిజీగా వున్నారు. అమెరికా అధ్యక్షులు జో బైడెన్ ఇప్పటికే ఢిల్లీ చేరుకున్నారు. జి-20 సదస్సుకు చైనా అధ్యక్షులు షీ జిన్‌పింగ్, రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్‌లు హాజరుకావడం లేదు. ఆ అవకాశాన్ని ఉపయోగించుకుని వాషింగ్టన్ ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి బైడెన్ చూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం భారత్‌కు వచ్చిన వెంటనే బైడెన్, మోడీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు.

బంగ్లా, మారిషస్ ప్రధానులతో భేటీ

జి 20 సదస్సు కోసం విచ్చేసిన బంగ్లాదేశ్, మారిషస్ ప్రధానులతో మోడీ భేటీ అయ్యారు. వారితో జరిగిన ద్వైపాక్షిక సమావేశాలు ఫలప్రదంగా సాగాయని మోడీ ట్వీట్ చేశారు. గత తొమ్మిదేళ్లలో భారత్, బంగ్లాదేశ్ మధ్య సంబంధాలు చాలా వృద్ధి చెందాయని అన్నారు. అనుసంధానత, వాణిజ్యం, ఇతర అనేక అంశాలపై బంగ్లా ప్రధాని షేక్ హసీనాతో చర్చించినట్లు మోడీ తెలిపారు.

అనంతరం మారిషస్ ప్రధాని ప్రవింద్ జగన్నాథ్‌తో మోడీ సమావేశమయ్యారు. భారత్, మారిషస్‌ల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75 ఏళ్లు పూర్తయిందని, అందువల్ల ఈ ఏడాది ఇరు దేశాలకు ప్రత్యేకమని వ్యాఖ్యానించారు. మౌలిక సదుపాయాలు, సంస్కృతి, ఇతర రంగాల్లో సహకారంపై చర్చించినట్లు మోడీ తెలిపారు.

రాబోయే రెండు రోజుల్లో ప్రపంచ నేతలతో మోడీ 15 సమావేశాలు జరపనున్నారు. సర్వతోముఖాభివృద్ధి ముఖ్యంగా మానవీయ కోణంలో జరగాల్సిన అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా కొత్త పంథాను రూపొందించడానికి ఈ సమావేశాలు ఉపయోగపడతాయని భావిస్తున్నట్లు మోడీ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ప్రపంచ నేతలతో ఫలప్రదమైన చర్చలు జరగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. స్నేహం, సహకారం మరింత పెంపొందేలా ఈ చర్చలు వుండబోతాయని చెప్పారు. శనివారం నాడు బ్రిటన్, జపాన్, జర్మనీ, ఇటలీ నేతలతో మోడీ భేటీ కానున్నారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
Tender Notice No: 42/2023-24/SE(W-II)/EE-IV/DB/Dt.05-09-2023
Number of works - 3, Value of works Rs.398.47 Lakhs
Tender Opening Dt. 07-09-2023, Closing Date 11-09-2023
Note: Further details at http://www.tender.apeprocurement.gov.in
O/o the EE-IV Cell No. 9912349454
For Commissioner

మీకోసం

ఎండు కొబ్బరి సులభంగా తురమాలంటే దానిపై కొద్దిగా నీళ్లు చల్లి ఫ్రిజ్‌లో ఉంచాలి.

జీవన సౌరభం

అజ్ఞానాన్ని తెలుసుకోవడమే నిజమైన జ్ఞానం.

బాలలు

బాలలూ, బాలలూ
భలే భలే బాలలూ...
ఆటలూ, పాటలూ
పాడుదాం పిల్లలూ..

వెలుగుపూలు పంచుదాం
నిద్రనుండి లేవండోయ్
కలసిమెలసి సాగుదాం
పరుగులెత్తి రారండోయ్

భరతభూమి పులకింపగ
గొంతులెత్తి పాడండోయ్
తప్పుజేయు వారలకు
బుద్ధిజెప్ప కూడండోయ్

మొక్కలెన్నో నాటుటకు
గుంతలెన్నో తవ్వండోయ్

చింతలన్ని బాపుటకు
స్నేహితులై నవ్వండోయ్

ఇరుగు పొరుగు బాగుకొరకు
మనసుపెట్టి మొక్కండోయ్
చెడు యోచనలన్నింటిని
వెలికితీసి తొక్కండోయ్...

- మీసాల చిన గౌరినాయుడు,
94928 48564.

దారి చూపండి

పిల్లలూ, రాము, చింటూ, బన్నీ ఈత కొట్టడానికి సిద్ధమయ్యారు. వాళ్ల దగ్గర ఉన్న తాడు ద్వారా వాళ్ల బెడ్స్‌కి వెళ్లే దారి చూపండి.

నేను గీసిన బొమ్మ



సరస్వతి అనూజ
తొమ్మిదవ తరగతి
జక్కాపూర్, సిద్దిపేట జిల్లా

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అతిసారంపై అప్రమత్తత అవసరం

అతిసార లేదా డయేరియా మామూలుగా వైరస్ వల్ల వస్తోంది. కొన్ని రకాలైన బ్యాక్టీరియా, ప్రోటోజోవాల ద్వారా కూడా అతిసార రావొచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ఒక మనిషి రోజులో మూడు లేక అంతకంటే ఎక్కువ సార్లు వదులుగా విరేచనాలు చేసుకుంటే దానిని అతిసారగా భావించొచ్చు. ఐదేళ్ల లోపు పిల్లల్లో జరిగే మరణాలకు అతిసార వ్యాధి రెండో ప్రధాన కారణం. ప్రపంచవ్యాప్తంగా ఏటేటా దాదాపు 170 కోట్ల అతిసార వ్యాధి కేసులు నమోదవుతున్నాయి. ఐదేళ్లలోపు పిల్లల్లో పోషకాహార లోపానికి అతిసారం ప్రధాన కారణం. డయేరియా అతి భయంకరమైన వ్యాధి కాకపోయినా దీనివల్ల ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితిని చూస్తూనే ఉన్నాం. చిన్న జాగ్రత్తలతో కూడా డయేరియాను నివారించుకోవచ్చు. కొద్దిపాటి ప్రాథమిక వైద్యంతో కూడా ప్రాణహాని జరగకుండా కాపాడుకోవొచ్చు.

- డాక్టర్ ఎం.వి.రమణయ్య
డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల

వర్షాలు కురుస్తున్నప్పుడు పైప్ లైన్లు పగలడం, బహిరంగ మలవిసర్జన కారణంగా కలుషితమైన నీరు నీటి పైపుల ద్వారా నీటి ట్యాంకుల్లో చేరిన ఈ కలుషిత నీరు తాగడం డయేరియా సోకడానికి : కారణం అవుతుంది. వ్యక్తిగత శుభ్రత లేని కారణంగా తాగేనీళ్ళతో పాటు తినే ఆహారం కూడా కలుషితమై డయేరియా తీవ్రంగా సోకుతుంది. సరైన వైద్యాన్ని సరైన సమయంలో అందిస్తే డయేరియా తీవ్రతను సులభంగా తగ్గించొచ్చు. అలాగే కొన్ని జాగ్రత్తలతో డయేరియా రాకుండా చూసుకోవచ్చు.

లక్షణాలు ఇలా ...

డయేరియా సోకినప్పుడు నీళ్ళ విరేచనాలతో పాటు వాంతులు వస్తుంటాయి. కొన్ని సందర్భాలలో జ్వరం, పొట్టలో నొప్పి కూడా రావచ్చు. విరేచనాలతో శరీరంలోని నీళ్ళతో పాటు శరీరానికి ముఖ్యమైన సోడియం, పొటాషియం లాంటి లవణాలు శరీరం నుంచి వెలుపలికి పోతాయి. శరీరంలో నీటి శాతం తగ్గిన కారణంగా దాహం ఎక్కువగా కావడం, నీరసంగా ఉండడం, నోరు ఎండిపోవడం, చర్మం పొడిబారడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. బిపి తగ్గిపోతుంది. మూత్రపిండాలకు సరిపోయినంత రక్తం అందక చెడిపోయే అవకాశం

ఏర్పడుతుంది. పిల్లలు, వృద్ధుల్లో డయేరియా సమస్య ఎక్కువైతే కోలుకోవడం కష్టం.. అందుకే లక్షణాలు ఎక్కువైనప్పుడు వెంటనే డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లాలి. రక్తంలో లవణాలు ఏ స్థాయిలో ఉన్నాయో పరీక్ష చేసి నీటి లేమి పరిస్థితిని పరిశీలించి వైద్యం చేస్తారు.

ఎప్పుడు ప్రమాదమంటే..

కొద్దిపాటి విరేచనాలకు ప్రమాదం ఏమి జరగదు. విరేచనాలు ఎక్కువగా అయ్యి శరీరంలోని నీటి శాతం ఎక్కువగా తగ్గి, బిపి తగ్గిపోయి శరీర భాగాలకు ప్రధానంగా మూత్రపిండాలు, మెదడుకు రక్తప్రసరణ తగ్గినప్పుడు ప్రాణహాని జరిగే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రధాన లవణాలైన సోడియం, పొటాషియం తగ్గిపోయి తీవ్రమైన బలహీనతకు గురై అపస్మారక స్థితిలోకి చేరుకునే అవకాశం ఏర్పడుతుంది. మూత్రం తక్కువ మోతాదులో రావడం లేదా అసలు రాకపోవడం, విపరీతంగా దప్పిక కావడం, బీపీ తీవ్రంగా తగ్గిపోవడం, అపస్మారక స్థితిలోకి చేరుకోవడం, కనుగుడ్లు లోపలికి పీక్కుపోవడం, చర్మం ముడతలు పడడం వంటి పరిస్థితులను ప్రమాద ఘంటికలుగా గుర్తించాలి.

ప్రాథమిక వైద్యంతో రక్షణ

ప్రమాదస్థితికి చేరుకోక ముందే విరేచనాలతో శరీరం కోల్పోయిన నీరు, లవణాలను సరి చేసుకోవడంతో ఈ ప్రమాదం జరగకుండా చూసుకోవచ్చు. ఇందుకోసం కొబ్బరినీళ్ళు, ఉప్పు కలిపిన మజ్జిగ, ఉప్పు కలిపిన నిమ్మకాయ నీళ్ళు, పండ్ల రసం, ఉప్పు కలిపిన గంజి లాంటి పానీయాలను తీసుకోవడం మంచిది. ఈ పానీయాలను తెచ్చుకోవడం, కలుపుకోవడం సాధ్యపడనప్పుడు అన్నివేళలా, అన్ని ప్రాంతాల్లో అందుబాటులో ఉండే ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ (ఓఆర్‌ఎస్)ను తెచ్చుకొని తరచుగా తాగొచ్చు. ఒక్కసారిగా ఎక్కువ మోతాదులో తీసుకుంటే వాంతులయ్యే అవకాశం ఉంటుంది. కొద్ది కొద్దిగా ఎక్కువ పర్యాయాలు తీసుకోవడం మంచిది. వాంతులవుతన్నప్పుడు ఈ పానీయాలను తీసుకోవడం సాధ్యం కాకపోతే సెలైన్ ఎక్కించుకోవడం అవసరం. అవసరమైతే నోటి ద్వారా ఈ పానీయాలను తీసుకుంటూ నరం ద్వారా సెలైన్ ఎక్కించుకోవాలి. నోటి ద్వారా తీసుకుంటున్న పానీయాలు, నరం ద్వారా ఎక్కించుకున్న సెలైన్ మోతాదు సరిపోయిందా లేదా అని చూసుకోవడానికి మూడు కొలమానాలను దృష్టిలో ఉంచుకోవాలి. దప్పిక, మూత్రం మోతాదు, బిపి వంటివి రెగ్యులర్ పద్ధతుల్లో ఉంటే ఎలాంటి ప్రమాదం లేదు.



అతిసార రాకుండా జాగ్రత్తలు..

డయేరియా బారిన పడకుండా ఉండేందుకు వ్యక్తిగత శుభ్రత పాటించడం ఒక్కటే మార్గం.

- వేడిగా ఉన్నప్పుడే ఆహార పదార్థాలను తినాలి
- భోజనానికి ముందు, మల విసర్జన తర్వాత తప్పక సబ్బుతో చేతులు కడుక్కోవాలి.
- కాచి చల్లార్చిన నీళ్లు లేదా ప్యూరిఫైడ్ వాటర్ మాత్రమే తాగాలి. వీలైతే ఎల్లప్పుడూ ఇలాంటి నీళ్లనే తాగడం ఆరోగ్యానికి మంచిది.
- చేతి గోళ్లు పెంచుకోవద్దు.
- పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.
- తినే ఆహార పదార్థాలపైన ఈగలు వాలకుండా మూతలు పెట్టాలి.
- ఇంటి చుట్టూ మురికినీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.
- బయటి ఆహారాలను వీలైనంతవరకు తినొద్దు
- బహిర్భూమిలో మలవిసర్జనను నివారించాలి.
- మురిగిపోయిన ఆహార పదార్థాలను తీసుకోవద్దు.
- ఆహార పదార్థాలను తయారు చేసే ముందు, పిల్లలకు ఆహారం పెట్టే ముందు తప్పక చేతులను శుభ్రంగా కడుక్కోవాలి.

పిల్లల విషయంలో జాగ్రత్త

ఐదేళ్లలోపు పిల్లలకు డయేరియా సోకితే ఒక్కోసారి డీహైడ్రేషన్ ఎక్కువై ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. డయేరియా సోకితే సొంత వైద్యానికి బదులు డాక్టర్ సలహా తీసుకోవడం మంచిది. డీహైడ్రేషన్ ఎక్కువైతే డాక్టర్లు ఐవీ లైన్ ద్వారా సెలైన్ ఎక్కిస్తారు. అలాగే అవసరాన్ని బట్టి జింక్, విటమిన్-ఎ సప్లిమెంట్స్ అందిస్తారు. దీనివల్ల పిల్లలు

ప్రాణాలు కోల్పోకుండా జాగ్రత్తపడొచ్చు. పిల్లలో అతిసార వ్యాధికి ప్రధాన కారణం రోటా వైరస్ ఇన్ఫెక్షన్. ఈ క్రిమి నివారణకు వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. పిల్లలకు రోటా వైరస్ వ్యాక్సిన్ వేయించడం ద్వారా డయేరియా ప్రమాదాన్ని తగ్గించొచ్చు. తల్లిపాలు తాగే పిల్లలకు అతిసార వ్యాధి వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది. రెండేండ్లు వచ్చే వరకూ పిల్లలకు తల్లిపాలు ఇస్తూ ఉంటే వాళ్లలో అతిసార వ్యాధిని తట్టుకునే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.

'రూల్స్ రంజన్' ట్రైలర్

కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి జంటగా రత్నం కృష్ణ దర్శకత్వంలో రూపొందుతోన్న 'రూల్స్ రంజన్' చిత్రం నుండి తాజాగా ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. సీనియర్ నిర్మాత ఏ.ఎం.రత్నం సమర్పణలో స్టార్ లైట్ ఎంటర్టైన్మెంట్ పతాకంపై దివ్యాంగ్ లవానియా, మురళి కృష్ణ వేమూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రింకు కుక్రెజ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అమ్రిష్ గణేష్ సంగీతం అందిస్తున్నారు. సెప్టెంబర్ 28న ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. వెన్నెల కిషోర్, హైపర్ ఆది, వైవా హర్ష, నెల్లూరు సుదర్శన్, సుబ్బరాజు, అజయ్, గోపరాజు రమణ తదితరులు ఈ చిత్రంలో నటించారు.

'కోటబొమ్మాళి పిఎస్' పాట 11న విడుదల

తాజాగా మలయాళంలో విజయవంతమైన 'నాయాట్టు'కి రీమేక్‌గా 'కోట బొమ్మాళి పిఎస్' సినిమా తెలుగులో తీస్తున్నారు. నిర్మాతలుగా బన్నీ వాస్, విద్యా కొప్పినీడి వ్యవహరిస్తున్నారు. శ్రీకాంత్ మేక ప్రధాన పాత్ర, వరలక్ష్మి శరత్‌కుమార్ ప్రత్యేక పాత్రలో నటిస్తున్నారు. రాహుల్ విజయ్, శివాని రాజశేఖర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రీకాకుళం యాసలో రూపొందించిన పాటను ఈనెల 11న విడుదల చేయనున్నట్లుగా దర్శక నిర్మాతలు ప్రకటించారు. గీతా ఆర్ట్స్ 2 పిక్చర్స్ బ్యానర్ ద్వారా తెలుగులో విడుదల చేయనున్నారు.

తుపాకీ శిక్షణలో కమల్

హీరో కమల్ హాసన్ 'విక్రమ్' తర్వాత నటించనున్న 'కేహెచ్233' కోసం తుపాకీ శిక్షణ పొందుతున్నారు. దీనికి సంబంధించి ఒక వీడియోను రాజ్‌కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసింది. హెచ్.వినోద్ డైరెక్టర్. ప్రీ పొడక్షన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇందుకోసం కమల్ హాసన్ తుపాకీ శిక్షణలో నిమగ్నమయ్యారు. శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఇండియన్-2'లో కమల్ నటించారు.

యు/ఎతో 'మార్క్ ఆంటోని'



విశాల్, ఎస్, జె సూర్య ప్రధాన పాత్రల్లో నటించిన 'మార్క్ ఆంటోని' చిత్రానికి సెన్సార్ బోర్డు 'యు/ఎ' సర్టిఫికెట్ మంజూరు చేసింది. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం తమిళం, తెలుగు భాషలలో సెప్టెంబర్ 15, 2023న థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ చిత్రం 150 నిమిషాల రన్‌టైమ్‌ను కలిగి ఉంది. ఎస్ వినోద్ కుమార్ నిర్మిస్తున్న ఈ సినిమాలో రీతూ వర్మ కథానాయికగా నటిస్తున్నారు. సునీల్, సెల్వ రాఘవన్, రీతూ, అభినయ, కింగ్స్లీ, యం.జి.మహేంద్రన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి జివి ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు.

గుండెపోటుతో నటుడు మారిముత్తు కన్నుమూత



ఇటీవల వచ్చిన 'జైలర్'లో విలన్ పక్కన కీలకపాత్రలో నటించిన కోలీవుడ్ నటుడు, డైరెక్టర్ మారిముత్తు (58) శుక్రవారం గుండెపోటుతో కన్నుమూశారు. ఓ టీవీ సీరియల్‌కు డబ్బింగ్ చెబుతూ ఆయన అకస్మాత్తుగా కుప్పకూలిపోయారు. వెంటనే అక్కడున్న సిబ్బంది ఆస్పత్రికి తరలించగా అప్పటికే కన్నుమూసినట్లుగా వైద్యులు ధృవీకరించారు. మారిముత్తు ప్రస్తుతం చేస్తున్న 'ఎథిర్ నీచెల్' అనే టీవీ సీరియల్‌కు డబ్బింగ్ చెప్పడానికి శుక్రవారం ఉదయం డబ్బింగ్ స్టూడియోకు వచ్చారని, డబ్బింగ్ చెబుతూనే గుండెపోటుతో కుప్పకూలిపోయారని స్టూడియో సిబ్బంది పేర్కొన్నారు.

15న రానున్న 'రామన్న యూత్'

అభయ్ నవీన్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన సినిమా 'రామన్న యూత్'. ఫైర్ ఫ్లై ఆర్ట్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. "రామన్న యూత్" సినిమా ఈ నెల 15న విడుదలకు సిద్ధమవుతోంది. సోమవారం ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించబోతున్నారు. విశ్వక్‌సేన్ ముఖ్య అతిథిగా ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. అభయ్ నవీన్, అనిల్ గీల, శ్రీకాంత్ అయ్యంగార్, తాగుబోతు రమేష్, రోహిణి జబర్దస్త్, యాదమ్మ రాజు, టాక్సీ వాలా విష్ణు, అమూల్య రెడ్డి, కొమ్మిడి విశ్వేశ్వర్ రెడ్డి, జగన్ యోగిరాజు, బన్నీ అభిరాన్, మాన్య భాస్కర్, వేణు పొలసాని తదితరులు నటిస్తున్నారు.

ఫైనల్‌కు గాఫ్, సబలెంకా

యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

కోకా గాఫ్

సబలెంకా

న్యూయార్క్: యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ మహిళల సింగిల్స్ ఫైనల్లోకి అమెరికా సంచలనం, 6వ సీడ్ కోకా గాఫ్, రష్యాకు చెందిన 2వ సీడ్ ఆర్యానా సబలెంకా ప్రవేశించారు. శుక్రవారం జరిగిన తొలి సెమీస్‌లో 18ఏళ్ల గాఫ్ 6-4, 7-5 తో 10వ సీడ్ కరోలినా ముఛోవా (చెక్ రిపబ్లిక్)పై సునాయాసంగా గెలుపొందిది. ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో యువ క్రీడాకారిణికి 27ఏళ్ల ముఛోవా నిలువరించలేక పోయింది. తొలుత ఒక బ్రేక్ పాయింట్ సాధించి ఆ సెట్‌ను చేజిక్కించు 6-4తో చేజిక్కించుకున్న గాఫ్.. రెండో సెట్ 5-5తో సమంగా ఉన్న దశలో టైబ్రేక్‌కు వెళుందనుకున్న దశలో ముఛోవా సర్వీ స్‌ను బ్రేక్ చేసింది. టోర్నీ ప్రారంభం నుంచి కోకా గాఫ్ అద్భుత విజయాలతో ఫైనల్లోకి దూసుకొచ్చింది.

రెండో సెమీస్‌లో 2వ సీడ్ సబలెంకా అద్భుత విజయాన్ని నమోదు చేసుకుంది. ఉత్కంఠభరితంగా సాగిన సెమీస్‌లో సబలెంకా తొలి సెట్‌ను ఒక్క పాయింట్ కూడా చేజిక్కించుకోకుండా 0-6తో ప్రత్యర్థికి సమర్పించుకొంది. దీంతో ఈ మ్యాచ్ 17వ కీస్ సునాయాసంగానే నెగ్గుతుందనుకున్న దశలో రెండు మూడు సెట్‌లను టై బ్రేక్‌లో చేజిక్కించుకొని ఫైనల్లోకి దూసుకొచ్చింది. హోరాహోరీగా సాగిన సెమీస్‌లో సబలెంకా 0-6, 7-6(7-1), 7-6(10-5)తో అమెరికాకు చెందిన కీస్‌ను చిత్తుచేసింది. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను నెగ్గిన సబలెంకా ఫ్రెంచ్, వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో సెమీస్‌కు చేరింది. యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌లోనూ తొలిసారి ఫైనల్లోకి ప్రవేశించింది.

నేడు పురుషుల సింగిల్స్ సెమీస్..
మెద్వదేవ్ × అల్కరాజ్, జకోవిచ్ × షెల్టన్

యుఎస్ ఓపెన్ పురుషుల డబల్స్ రన్నరప్ బొప్పన్న, ఎబ్డెన్ జోడీ

న్యూయార్క్ : యుఎస్ ఓపెన్ పురుషుల డబల్స్‌లో రోహన్ బొప్పన్న, ఎబ్డెన్ జోడీ పరాజయం పాలయ్యారు. శుక్రవారం రాత్రి జరిగిన ఫైనల్‌లో బొప్పన్న, ఎబ్డెన్ జోడీ 6-2, 3-6, 4-6తో మూడో సీడ్ రాజీవ్ రామ్, శాలిస్ బరీ చేతిలో ఓటమి పాలయ్యారు. దీంతో 2010 తరువాత మరోసారి టైటిల్ నెగ్గాలన్న బొప్పన్న ఆశలు అడియాశలయ్యాయి. రోహన్ బొప్పన్నకు ఇదే ఆఖరి గ్రాండ్ శ్లామ్ టోర్నీ.

వన్డే ప్రపంచకప్ అధికారుల జాబితాలో జవగళ్ శ్రీనాథ్, నితిన్ మీనన్‌లకు చోటు

దుబాయ్: భారత్ వేదికగా అక్టోబర్‌లో జరిగే 13వ వన్డే ప్రపంచకప్ అధికారుల పేర్లను అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) శుక్రవారం వెల్లడించింది. భారత్‌నుంచి ఐసిసి రిఫరీగా జవగళ్ శ్రీనాథ్, ఫీల్డ్ అంపైర్‌గా నితిన్ మీనన్‌లకు చోటు దక్కింది. వన్డే ప్రపంచకప్‌లో బాధ్యతలు నిర్వర్తించే అధికారులు, ఫీల్డ్, నాల్గో, టీవీ అంపైర్‌లతోపాటు మ్యాచ్ రిఫరీల పేర్లను ఐసిసి శుక్రవారం ప్రకటించింది. తొలి రౌండ్‌లో జరిగే పోటీలకు 20మంది మ్యాచ్ అధికారులు ఉండనున్నట్లు, అలాగే ఐసిసి అంపైర్ల ఎమిరేట్స్ ప్యానల్‌లోని 12మంది, ఐసిసి ఎమర్జింగ్ అంపైర్ ప్యానెల్‌లోని నలుగురు సభ్యులతో సహా మొత్తం 16మంది మ్యాచ్ అంపైర్ల పేర్లనూ వెల్లడించింది. ఇక ఎమిరేట్స్ ఐసిసి ఎలైట్ ప్యానెల్ ఆఫ్ మ్యాచ్ రిఫరీలుగా జెఫ్ క్రో, ఆండీ పైక్రాఫ్ట్, రిచీ రిచర్డ్‌సన్, జవగళ్ శ్రీనాథ్ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. అక్టోబర్ 5న అహ్మదాబాద్‌లో ఇంగ్లండ్-న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగే తొలి మ్యాచ్‌కు శ్రీనాథ్ మ్యాచ్ రిఫరీగా.. నితిన్ మీనన్, కుమార ధర్మసేన స్టాండింగ్ అంపైర్లుగా బాధ్యతలు నిర్వర్తించనున్నట్లు.. పాల్ విల్సన్ టీవీ అంపైర్‌గా, సైకత్ ఫోర్త్(నాల్గో) అంపైర్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నట్లు వెల్లడించింది.

వన్డే ప్రపంచకప్ ఐసిసి అధికారులు: క్రిస్ బ్రౌన్, కుమార ధర్మసేన, మారిస్ ఎరస్మస్, క్రిస్ గఫనీ, మిఛెల్ గాఫ్, అడ్రియన్ హోల్డ్‌స్టోక్, రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్, రిచర్డ్ క్యాటెల్‌బరో, నితిన్ మీనన్, అహసన్ రాజా, పాల్ రీఫిల్, షర్ఫుద్దౌల్లా షాహిద్, రాడ్ టక్కర్, అలెక్స్ వార్ఫ్, జో విల్సన్, పాల్ విల్సన్.

రిఫరీలు: జెఫ్ క్రో, ఆండీ పేక్రాఫ్ట్, రిచీ రిచర్డుసన్, జవగళ్ శ్రీనాథ్.

కాసులపైనే ధ్యాస..!

భారత్-పాక్ మ్యాచ్‌కు రిజర్వ్‌డే కేటాయింపు
సూపర్-4 ఆ ఒక్క మ్యాచ్‌కే అంటూ ప్రకటన

ముంబయి: ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఎసిసి) ఓ కీలక నిర్ణయం తీసు కుంది. భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య 10న జరగాల్సిన సూపర్-4 మ్యాచ్‌కు రిజర్వు డేను కేటాయిస్తున్నట్లు శుక్రవారం ప్రకటిం చింది. ఏసిసి గతంలో ప్రకటించిన షెడ్యూల్‌లో సూపర్-4 మ్యాచ్‌లకు రిజర్వు డే కేటాయించలేదు. అలాగే ప్రస్తుతం జరుగుతున్న మిగిలిన సూపర్-4 మ్యాచ్‌లకూ రిజర్వు డేను కేటాయించట్లేదని తాజాగా ప్రకటించింది. కేవలం భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య జరిగే ఒక్క మ్యాచ్‌కే రిజర్వు డే కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. అంటే కొలంబో వేదికగా 10న(ఆదివారం) భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ ఒకవేళ వర్షం కారణంగా సజావుగా సాగకపోతే ఆ మ్యాచ్ 11న(సోమవారం) జరగనుంది. దీంతో ఏసిసికి కాసుల ధ్యాసే తప్ప... మరింకేమిటి? అని క్రీడాభిమానులు పెదవి విరుస్తున్నారు.

భారత్-పాక్ మ్యాచ్‌కు వర్ష ముప్పు

సూపర్-4 మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తున్న కొలంబో నగరంలో ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నాయి. రుతుపవనాల ఆలస్యంతో రెండు వారాలుగా అక్కడ వర్షాలు పడుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం జరిగే భారత్-పాక్ మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉందని 75 శాతం వాన పడే అవకాశం ఉందని, మ్యాచ్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయినా ఆశ్చర్యపోన్నకర్లేదని అక్కడి వాతావరణ శాఖ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. మధ్యాహ్న సమయంలో 99 శాతం వర్షం పడే ఛాన్స్ ఉందని, 28 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయని పేర్కొంది. ఇక సూపర్-4 మ్యాచ్‌ల వేదికను హంబన్‌తోటకు మార్చాలని శ్రీలంక క్రికెట్(ఎస్‌ఎల్‌సి) ప్రతిపాదించినా.. ఏసిసి ఒప్పుకోలేదు. తక్కువ వ్యవధిలో సామగ్రి, సిబ్బందిని తరలించడం కష్టమని అధికారిక బ్రాడ్‌కాస్టర్ చెప్పడమే అందుకు కారణమని సమాచారం.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68